పద్నాలుగు వందల
నలభై రెండు నిమిషాలు
రూ॥100/- పేజీలు:96



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



మెట్రో రైల్‌తో ఓల్డ్ సిటీకి మహర్దశ

తెలంగాణలో అతిపెద్ద కుంభకోణం 'చిత్రపురి'

9న న్యూ ఎనర్జీ పాలసీ ప్రకటన

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 40 | మంగళవారం | 07-01-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00





దేశ స్వాతంత్రోద్యమంలో దళితులు, ఆదివాసీలదే ముఖ్యపాత్ర. కానీ 78 ఏళ్ల స్వతంత్ర భారతావనిలో నేటికీ ఆ వర్గాలు అత్యంత వివక్షతను ఎదుర్కొంటున్నాయి. దేశంలోని కుల వ్యవస్థే దీనికి కారణం. దళితులు, ఆదివాసీలు లేనిదే ఈ దేశం లేదు. వారి శ్రమ ఫలితమే దేశ సంపద.
- డి.రాజా

## దళిత, ఆదివాసీ, అట్టడుగు వర్గాలే
# అసలైన సంపద సృష్టికర్తలు

● అయినా మోదీ దృష్టిలో ఆదానీ, అంబానీలే ● శ్రామిక వర్గాల బాగోగులు ప్రధానికి పట్టవు ● మనిషి భవిష్యత్తును కులాలు నిర్ణయించే దౌర్భాగ్య పరిస్థితి దారుణం ● ఎఐడిఆర్‌ఎం జాతీయ రెండవ మహాసభలను ప్రారంభిస్తూ సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శ

ప్రజాపక్షం / హైదరాబాద్

తమ చెమట చుక్కలను దారపోసి దేశ సంపదను సృష్టిస్తున్న 90శాతం మంది దళితులు, ఆదివాసీలు, అట్టడుగు శ్రామిక వర్గాలే అసలైన సంపద సృష్టికర్తలని, ప్రధాని మోదీ దృష్టిలో ఆదానీ, అంబానీలే సంపద సృష్టికర్తలని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. అసలైన సంపద సృష్టికర్తల బాగోగులు మోదీకి పట్టవని అన్నారు. పేదల కాయకష్టంతో సృష్టించిన ఈ దేశ సంపదను ప్రధాని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో విశ్వేశ్వరయ్యభవన్‌లో సోమవారం అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం (ఎఐడిఆర్‌ఎం)జాతీయ రెండవ మహాసభలలో భాగంగా ప్రతినిధుల సభ సోమవారం నాడు ప్రారంభమైంది. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎఐడిఆర్‌ఎం పతాకాన్ని ఎఐడిఆర్‌ఎం జాతీయ అధ్యక్షుడు రామ్మూర్తి ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన డి.రాజా మహాసభలను ప్రారంభించారు. రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన మహాసభ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అనీ రాజా, తరువాయి 2లో



## ఎ టు జెడ్ ఫ్లైఓవర్‌కు మాజీ ప్రధాని
# మన్మోహన్‌సింగ్ పేరు





● హైదరాబాద్ అభివృద్ధికి ఎంఐఎంతో కలిసి ముందుకెళ్తాం ● ప్రధానితో కొట్లాడాల్సి వస్తే కొట్లాడుతా, అసదుద్దీన్ ఒవైసీతో కలవాల్సి వస్తే కలుస్తా ● ఎన్నికలప్పుడే రాజకీయాలు తరువాత కలిసి పని చేస్తాం ● ఆరాంఘర్- జూపార్క్ వరకు నిర్మించిన ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ అభివృద్ధికి ఎవరితో కలిసి పనిచేయడానికైనా తాము సిద్ధమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి ఎంఐఎంను కలుపుకొని ముందుకుపోతామన్నారు. ప్రధాని నరేంద్ర మోదీతో కొట్లాడాల్సి వస్తే కొట్లాడుతా, అసదుద్దీన్ ఒవైసీతో కలావల్సి వస్తే కలుస్తానని చెప్పారు. కాంగ్రెస్, ఎంఐఎం కలిసి హైదరాబాద్ కోసం కలిసి పనిచేస్తాయన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేస్తామని, ఎన్నికల తర్వాత అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆరాంఘర్ –జూ పార్క్ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక ఎంపి. అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం శాసనసభ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి లతో కలిసి ఘనంగా ప్రారంభించారు. రూ.799 కోట్లతో జిహెచ్‌ఎంసి నిధులతో ఆరాంఘర్ చౌరస్తా నుంచి జూపార్క్ వరకూ 6 లైన్‌ల ఫ్లైఓవర్‌ను నిర్మించారు. 4.08 కిలోమీటర్ల పొడవు, 23 మీటర్ల వెడల్పుతో నిర్మించారు. పివి.ఎక్స్‌ప్రేస్ వే తర్వాత ఈ ఫ్లైఓవర్ నగరంలో రెండో అతిపెద్ద ఫ్లైఓవర్ కావడం విశేషం. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఓల్డ్ సిటీకి మెట్రో కావాలని మోడీతో కొట్లాడి తీసుకొస్తున్నా, ప్రధాని రాష్ట్రానికి వచ్చినప్పుడు మెట్రో విస్తరణకు సహకరించాలని కోరా అని చెప్పారు. ఒవైసీ బ్రదర్స్ తండ్రిబాటలోనే అభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఎంఐఎం సహకారంతో పాతబస్తీని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. పాతబస్తీలో మెట్రోను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇది ఓల్డ్ సిటీ కాదని, ఒరిజనల్ సిటీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గత పదేళ్లలో మెట్రో విస్తరణ పనులను పట్టించుకోలేదన్నారు. త్వరలో ఎంఐఎం ఎంఎల్‌ఎలను పిలిచి నగర అభివృద్ధి కోసం చర్చిస్తామన్నారు. మీరాలం ట్యాంక్‌పై కేబుల్ బ్రిడ్జి నిర్మించి, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్ స్టేడియంలో నిర్మిస్తామని సిఎం పునరుద్ఘాటించారు. అభివృద్ధికి నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పనులు పూర్తి చేయించే బాధ్యత ఇక్కడి ప్రజా ప్రతినిధులదే అన్నారు. ఆరాంఘర్ నెహ్రూ జులాజికల్ పార్క్ ఫ్లై ఓవర్‌కు దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఫ్లై ఓవర్‌గా నామకరణం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఉమ్మడి తరువాయి 2లో




## హెచ్ఎంపివి
# కలకలం

భారత్‌లో మూడు కేసుల నిర్ధారణ

ఆందోళన వద్దన్న కేంద్ర ఆరోగ్యశాఖ

**న్యూఢిల్లీ:** చైనాలో హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్‌ఎంపివి) విజృంభిస్తున్న వేళ... భారత్‌లోనూ ఆ వైరస్‌ను గుర్తించారు. కర్నాటక రాష్ట్రంలో రెండు కేసులు వెలుగు చూసినట్లు ఐసిఎంఆర్ వెల్లడించగా, గుజరాత్‌లో ఒక అనుమానిత కేసు నమోదైంది. బెంగళూరులో మూడు, ఎనిమిది నెలల వయసున్న ఇద్దరు చిన్నారులకు హెచ్‌ఎంపివి నిర్ధారణ కాగా... అహ్మదాబాద్‌లో రెండు నెలల చిన్నారి ఇదే వైరస్ లక్షణాలతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. 'దేశవ్యాప్తంగా ఐసిఎంఆర్ సాధారణ పర్యవేక్షణలో భాగంగా రెండు శ్వాసకోశ వ్యాధులు వెలుగు చూశాయి' అని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ఈ వైరస్ వ్యాపిస్తోందని, దానికి సంబంధించిన కేసులు నమోదయ్యాయని తెలిపింది. ఆందోళన అవసరం లేదని పేర్కొంది. ఇదిలా తరువాయి 2లో

# త్వరలో చర్లపల్లికి 'బుల్లెట్ రైలు'

రైల్వేల ఆధునీకరణతో మారనున్న దేశ ముఖచిత్రం : ప్రధాని మోదీ

వర్చువల్‌గా చర్లపల్లి రైల్వే టర్మినల్ స్టేషన్ ప్రారంభం



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి/చర్లపల్లి

ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని రైల్వేల ఆధునీకరణతో దేశ ముఖచిత్రం మారిపోతున్నదని, రైల్వే రంగంలో మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేస్తూ అన్ని ప్రాంతాలకు కనెక్టివిటీ పెంచేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. సకల హంగులతో స్టేట్ ఆఫ్ టెక్నాలజీతో అత్యంత అధునాతన సదుపాయాలతో రూ.413 కోట్ల వ్యయంతో మేడ్చల్ జిల్లాలోని చర్లపల్లి ప్రాంతంలో నూతనంగా నిర్మించిన చర్లపల్లి రైల్వే టర్మినల్ స్టేషన్‌ను ప్రధాని సోమవారం వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిర్‌పోర్టును తలదన్నేలా చర్లపల్లి రైల్వే టర్మినల్ నిర్మాణం జరిగిందని, ఓఆర్‌ఆర్‌కు అత్యంత సమీపంలో ఉన్న ఈ స్టేషన్ వల్ల తెలంగాణా ప్రగతికి అత్యంత దోహదకారిగా మారుతుందని, సోలార్ స్టేషన్‌గా దీన్ని తీర్చిదిద్దామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా చర్లపల్లి లాంటి స్టేషన్‌లు ఎంతో అవసరమని, 2014లో కేవలం 5 నగరాల్లోనే మెట్రో ఉందని, పదేళ్ల తమ హయాంలో మెట్రోను 21 నగరాలకు వెయ్యి కిలోమీటర్లకు విస్తరింపచేసామని ప్రధాని పేర్కొన్నారు. దేశంలో కనెక్టివిటీకి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని, ఇప్పటికే జమ్మూ కశ్మీర్, ఒడిశా, తెలంగాణలో కొత్త కనెక్టివిటీకి ఏర్పాట్లు జరిగాయని, త్వరలో భారత్‌కు తరువాయి 2లో




## కేంద్రం సహకరిస్తే తెలంగాణా ఆర్థిక పురోగతి

సిఎం రేవంత్‌రెడ్డి

రైల్వే, మెట్రో విస్తరణలో కేంద్రం పూర్తి స్థాయిలో సహకరించాలంటూ చర్లపల్లి రైల్వే టర్మినల్ ప్రారంభంలో వర్చువల్‌గా పాల్గొన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశ ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. కేంద్రం సహకరిస్తే తరువాయి 2లో

# నక్సల్స్ ప్రతీకారచర్య

జవాన్ల వాహనం పేల్చేసిన మావోయిస్టులు
8 మంది జవాన్లు, ఒక డ్రైవర్ మృతి



**బీజాపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ ప్రతీకార చర్యకు పాల్పడ్డారు. బీజాపూర్ జిల్లాలో సోమవారం నక్సల్స్ తమ వాహనాన్ని పవర్‌ఫుల్ ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఇడి)తో పేల్చివేయడంతో జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి)కి చెందిన ఎనిమిది మంది జవాన్లు, ఒక పౌర డ్రైవర్ మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఇది గత రెండేళ్లలో రాష్ట్రంలో భద్రతా బలగాలపై మావోయిస్టులు జరిపిన అతిపెద్ద దాడి. అదే విధంగా 2025లో జరిగిన తొలిదాడి. దంతేవాడ జిల్లాకు చెందిన డిఆర్‌జి సిబ్బంది తమ స్కార్పియో వాహనంలో యాంటీ నక్సలైట్ ఆపరేషన్ ముగించుకుని తిరిగి వస్తుండగా కుట్రు పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబెలి గ్రామ సమీపంలో మధ్యాహ్నం 2.15 గంటలకు మావోయిస్టులు ఐఇడిని పేల్చివేశారని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (బస్తర్ రేంజ్) సుందర్‌రాజ్ పి తెలిపారు. ఎస్‌యువిలో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది డిఆర్‌జి జవాన్లు, వాహనం డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారని అధికారి తెలిపారు. ఘటనాలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి మృతుల మృతదేహాలను తరలిస్తున్నట్లు తెలిపారు. భద్రతా బలగాలు తరువాయి 2లో

## గ్రీన్ కో నుంచి బిఆర్‌ఎస్‌కు
# రూ.41 కోట్లు

● ఎన్నికల బాండ్ల రూపంలో ఇచ్చిన ఈ – కార్ రేస్ సంస్థ ● అనుబంధ సంస్థలతో కలిసి 41 సార్లు చెల్లింపులు

ప్రజాపక్షం/హైదరాబాద్

'ఫార్ములా ఈ –కార్ రేస్' కేసు బిఆర్‌ఎస్‌కు రూ.41 కోట్లను బాండ్ల రూపంలో 'గ్రీన్ కో సంస్థ' ముట్టచెప్పినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గ్రీన్ కో కంపెనీ ద్వారా బిఆర్‌ఎస్‌కు కోట్ల రూపాయల లబ్ధి చేకూరినట్లు తెలిపింది. గ్రీన్ కో, దాని అనుబంధ సంస్థలు కలిసి మొత్తం 41 సార్లు రూ. 49 కోట్లను బిఆర్‌ఎస్‌కు చందాల రూపంలో ఇచ్చినట్టు వెల్లడించింది. అయితే 2022, 8 ఏప్రిల్ నుంచి అక్టోబర్ 10వ తేదీ మధ్య ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసినట్లు సమాచారం. ప్రతిసారి రూ. కోటి విలువ చేసే బాండ్లు గ్రీన్ కో కంపెనీ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. మొత్తం తరువాయి 2లో



## 'డిండి ఎత్తిపోతలకు' ఆమోదం పట్ల
# సిఎంకు సిపిఐ ధన్యవాదాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫ్లోరైడ్‌తో జీవచ్ఛవాలుగా కరువు ఎడారితో ఉన్న మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందించే డిండి ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర మంత్రివర్గం రూ.1800 కోట్లు కేటాయించి ఏదుల నుండి నీరు తీసుకోవడానికి ఆమోదం తెలపడం పట్ల సిపిఐ ధన్యవాదాలు తెలిపింది. సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మునుగోడు మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకటరెడ్డి నేతృత్వంలో సిపిఐ నల్లగొండ జిల్లా పార్టీ కార్యదర్శి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి మాజీ ఎంఎల్‌ఎ వి.యాదగిరిరావులతో కూడిన సిపిఐ ప్రతినిధుల బృందం సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డిలను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపింది. నల్లగొండ తరువాయి 12లో

## రైతునేత డల్లేవాల్ వద్దకు
# 'సుప్రీం' కమిటీ



**న్యూఢిల్లీ / చండీగఢ్ :** రైతు నాయకుడు జగ్‌జిత్‌సింగ్ డల్లేవాల్‌తో షెడ్యూల్ చేయాల్సిన సమావేశం గురించి పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వివరించిన అనంతరం సోమవారం మధ్యాహ్నం 3:30గంటలకు సుప్రీంకోర్టు నియమించిన ప్యానెల్ ఆమరణనిరాహారదీక్ష చేస్తున్న రైతు నేత డల్లేవాల్‌ను కలిసింది. న్యాయమూర్తులు సూర్యకాంత్, ఎన్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనానికి పంజాబ్ ప్రభుత్వం తరపున ప్రాతినిథ్యం వహించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఈ సమాచారాన్ని తెలియజేశారు. సుప్రీంకోర్టు నియమించిన కమిటీకి అధ్యక్షుడిగా ఉన్న రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ తరువాయి 12లో

## ఎసిబి విచారణ..
# కెటిఆర్ మెలిక

లీగల్ టీంకు అనుమతి లేదన్న ఎసిబి

9న హాజరు కావాలంటూ మాజీ మంత్రికి మరో నోటీసు జారీ

విచారణకు మరో సమయం ఇవ్వండి : కెటిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్

ఫార్ములా ఈ– కార్ రేస్ కేసులో ఎసిబి అధికారుల విచారణకు మాజీ మునిసిపల్ మంత్రి, బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ హాజరు కాకుండానే ఎసిబి కార్యాలయం బయటి నుంచి బయటికే వెళ్లిపోయారు. దీంతో ఎసిబి అధికారులు ఈ నెల 9న విచారణకు హాజరుకావాలంటూ కెటిఆర్‌కు మరో నోటీసు జారీ చేశారు. ఇదిలా ఉండగా ఇదే కేసులో డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారుల ముందు మంగళవారం కెటిఆర్ విచారణకు హాజరు కావాలిసి ఉంది. అయితే ఈ విచారణకు కెటిఆర్ హాజరుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా ఈ నెల 3న ఎసిబి అధికారులు జారీ చేసిన నోటీసుల మేరకు కెటిఆర్ సోమవారం తరువాయి 12లో




# బిడిఆర్ ఊచకోతల్లో భారత్‌పై బంగ్లా అభాండాలు!

## హసీనాను ప్రశ్నించేందుకు ఢిల్లీకి దర్యాప్తు కమిషన్





**ఢాకా :** పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనాతో మాట్లాడేందుకు ఆ దేశ దర్యాప్తు కమిషన్ భారత్‌కు వచ్చే అవకాశం ఉంది. విదేశీమంత్రిత్వశాఖ ద్వారా లేదా నేరుగానో హసీనాతో మాట్లాడేందుకు వారు సన్నాహాలు చేస్తున్నారు. 2009లో బంగ్లాదేశ్ రైఫిల్స్ (బిడిఆర్) చేసిన ఊచకోతలకు సంబంధించి షేక్ హసీనాను ప్రశ్నించేందుకు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఇండిపెండెంట్ కమిషన్ భారత్‌లో పర్యటించనున్నది. ప్రస్తుతం బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్‌గా పేరు మార్చుకున్న ఈ బిడిఆర్ హసీనా ప్రభుత్వ హయాంలో ఊచకోతలకు పాల్పడిందన్నది అభియోగం. పదవీ విరమణ చేసిన బంగ్లాదేశ్ సాయుధ బలగాల అధికారుల సంక్షేమ సంఘం (ఆర్ఎఓడబ్ల్యుఎ) క్లబ్ సమావేశంలో బాధిత కుటుంబాలతో అభిప్రాయాలు పంచుకున్న ఈ నేషనల్ కమిషన్ ఛైర్మన్, రిటైర్డ్ మేజర్ జనరల్ ఫజ్లుర్ రెహ్మాన్ ఈ పరిణామాల గురించి వివరించారు. ఈ ఊచకోతలో ప్రధానంగా షేక్ హసీనా పాత్ర ఉందని ఆయన అన్నారు. ఈ విషయంపై ఆమెను ప్రశ్నించేందుకు ఈ ఇండిపెండెంట్ కమిషన్ భారత్‌లో పర్యటించనున్నది. విదేశీ మంత్రిత్వశాఖ ద్వారా లేదా నేరుగానో హసీనాతో మాట్లాడేందుకు తాము ప్రయత్నం చేస్తామని ఫజ్లుర్ రెహ్మాన్ అన్నారు. భారత్ హై కమిషన్‌కు ఈ సమాచారాన్ని అందజేసిన తర్వాత ఏ మార్గంద్వారా చట్టబద్ధంగా ఆమెను కలుసుకోవడానికి సాధ్యపడుతుందో నిర్ణయిస్తామని అన్నారు. ఆమెను దేశానికి పంపాలని అడుగుతామని, లేకపోతే తామే అక్కడ ఉండి ఆమెను ప్రశ్నిస్తామని ఆయన అన్నారు. ఇంకా ఎవరెవరని ప్రశ్నించాలో, ఎలాంటి ప్రశ్నలు అడగాలో తాము జాబితా తయారు చేస్తున్నామన్నారు. అదేవిధంగా బంగ్లాదేశ్ రైఫిల్స్‌ను ఊచకోత కోయడంలో భారత్ ప్రమేయం ఉందని చెరప్పినంత మాత్రాన సరిపోదనీ, అందుకు తగినన్ని సాక్ష్యాధారాలను తాము సేకరించాల్సి ఉందని ఆయన అన్నారు. ఇది కేవలం దేశీయంగానో, విదేశీ జోక్యంతోనో జరిగిందని చెబితే సరిపోదన్నారు. దర్యాప్తు జరిగే సమయంలో కమిషన్ తటస్థ వైఖరిని అనుసరిస్తుందని, ఇతర దేశాలలో కూడా కమిషన్ దర్యాప్తు చేసి తగిన సాక్ష్యాలు సేకరించే ప్రయత్నం చేస్తుందన్నారు. పరోక్షంగ్గ పాకిస్థాన్ నుండి సాక్ష్యాలు సేకరిస్తామని ఆయన సంకేతాలు ఇచ్చారు. మూడు నెలల్లో దర్యాప్తు పూర్తిచేస్తామని, ఈ గడువును పెంచే ఉద్దేశం కూడా తమకు లేదని ఫజ్లుర్ రెహ్మాన్ చెప్పారు.

**హసీనాకు మరోసారి అరెస్టు వారెంటు**

పదవీచ్యుతురాలైన ప్రధానమంత్రి షేక్ హసీనాకు బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రిమినల్ ట్రిబ్యునల్ (ఐసిటి) సోమవారంనాడు మరోసారి అరెస్టు వారెంటు జారీ చేసింది. ఆమెతోపాటు మరో 11 మందికి కూడా అరెస్టు వారెంట్లు జారీ చేశారు. హసీనాకు ఇప్పటికే ఒకసారి అరెస్టు వారెంటు జారీ అయ్యింది. ఆగస్టులో అవామీలీగ్ పార్టీ నాయకత్వంలోని బంగ్లాదేశ్ ప్రభుత్వం కుప్పకూలింది. విద్యార్థులు ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు చేసి, ప్రధానమంత్రి అధికార నివాసంలోకి చొచ్చుకురావడంతో హసీనా ముందుగానే అప్రమత్తమై దేశం వదిలి భారత్‌కు వచ్చి గుర్తుతెలియని ప్రదేశంలో తలదాచుకున్నారు. హసీనాతోపాటు ఆమె ప్రభుత్వంలో పనిచేసిన మాజీ పోలీసు ఉన్నతాధికారులకు, సైనిక జనరల్స్‌కు కూడా అరెస్టు వారెంట్లు జారీ అయ్యాయి. హసీనా ప్రభుత్వంలో అనేకమంది జాడ తెలియకుండా పోయారన్నది ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన అభియోగం.ప్రాసిక్యూషన్ విజ్ఞప్తిని పరిశీలించిన తర్వాత ఐసిటి ఛైర్మన్ ముర్తుజా మొజుందాలర్ ఈ అరెస్టు వారెంటు జారీ చేసినట్లు ఐసిటి అధికారి ఒకరు చెప్పారు.

# 34మంది బందీల విడుదలకు హమాస్ రెడీ!

## ఇజ్రాయెల్ తాజా దాడుల్లో 14 మంది మృతి



**ఖతార్ :** ఇజ్రాయెల్–హమాస్ మధ్య గాజాలో యుద్ధ విరమణ దిశగా కాల్పులు ఆపేందుకు సంబంధించిన సన్నాహాలు మరింత ఊపు అందుకుంటున్నాయి. గాజాలో ఎలాగైనా వీలైనంత త్వరగా యుద్ధ విరమణ జరగాలని గతం కంటే భిన్నమైన రీతిలో హమాస్ కూడా చాలా తొందరపడుతున్నది. ఇందులోభాగంగా తనవద్ద బందీలలో తొలి విడతగా 34 మందిని విడుదల చేసేందుకు ఒక పేర్ల జాబితాను కూడా హమాస్ సిద్ధం చేసిందని పాలస్తీనా గ్రూపులను ఉటంకిస్తూ బ్రిటన్ అధికార మీడియా తెలియజేసింది. వెంటనే తమను విడిపించాలని, బందీల విడుదలకు ఒప్పందం చేసుకోవాలని ప్రాధేయపడుతున్న ఇజ్రాయెల్‌కు చెందిన హమాస్ బందీ లిరీ అల్‌బాగ్ (19) వీడియోను హమాస్ ఆదివారంనాడు విడుదల చేసింది. ఐతే వీరు కాకుండా హమాస్ ఇద్ద ఇంకా సజీవులైన బందీలు ఎంత మంది ఉన్నారన్న విషయంపై ఇప్పటికీ ఒక స్పష్టత లేదు. కానీ గతనెలలో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 10 మంది మహిళలు, 11 మంది వృద్ధులు,పిల్లలు మరణించారని హమాస్ ప్రకటించింది. హమాస్ ప్రభుత్వ హయాలంలోని గాజా ఆరోగ్యమంత్రిత్వశాఖ సమాచారం ప్రకారం గతవారాంతంలో ఇజ్రాయెల్ గగనతలదాడుల్లో 100 మంది హతులయ్యారు. ఇంకా ఎంతమంది బందీలుగా తమ వద్ద ఉన్నారన్న పూర్తి వివరాలను ఇజ్రాయెల్ ప్రభుత్వానికి హమాస్ సమకూర్చిందన్న వార్తలను ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ ఖండించారు. కాల్పుల విరమణకు సంబంధించి ఖతార్‌లోనిన దోహాలో మధ్యవర్తుల చర్చలు ఇప్పటికే తిరిగి ప్రారంభమయ్యాయి. చర్చల పురోగతి గురించి మాత్రం స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. బందీలను విడుదల చేసేందుకు ఒక ఏకాభిప్రాయం వస్తుందని ఆశిస్తున్నామని, అందుకు అనుగుణంగా సంభాషణలు జరుగుతున్నాయనీ ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ఇప్పటికే చెప్పారు. కానీ చర్చల్లో ఒక ఒప్పందం జరగకుండా ఇజ్రాయెల్ అడ్డుపడుతోందని హమాస్, హమాసే అన్నీ చెడగొడుతోందని ఇజ్రాయెల్ పరస్పరం ఆరోపణలు చేసుకోవడం అలవాటుగా మారింది. 2023అక్టోబరు 7వ తేదీన హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై సామూహిక దాడికి పాల్పడి 1,139 మందిని విచక్షణారహితంగా కాల్చి చంపారు. మరో 200 మందిని బందీలుగా తీసుకుపోయారు. దాంతో గాజాలో ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించి చరిత్రలో క్షమార్హతలేని రీతిలో విధ్వంసం సృష్టించింది. గాజాలో ఇప్పటివరకూ జరిగిన యుద్ధంలో 45,854 మంది పాలస్తీనియన్లు మరణించగా, మరో 1,09,139 మంది గాయపడ్డారు. ఇదిలా ఉండగా కిక్కిరిసి ఉన్న గాజా ప్రాంతంలో సోమవారంనాడు ఇజ్రాయెల్ సైనికులు జరిపిన దాడుల్లో 14 మంది మరణించారు. గడచిన 24 గంటల్లో 49 మంది మరణించారు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ లో ఇజ్రాయిలీవాసులను తీసుకువెళ్ళే ఒక బస్సుపై ఆగంతకుడు కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ముగ్గురు మరణించారు. పాలస్తీనా గ్రామం అల్ ఫండక్‌లో ఈ దాడి జరిగింది. ఉత్తర గాజా కమల్ అద్వాన్ కీలక ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ హుస్సమ్ అబు సఫియాను వెంటనే విడుదల చేయాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇజ్రాయెల్ సైన్యానికి మరోసారి విజ్ఞప్తి చేసింది.

# రేపో మాపో ప్రధానమంత్రి ట్రూడో రాజీనామా



**ఒట్టావా :** కెనడాదేశ ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో ఈ వారంలోనే అంటే బుధవారంలోపు రాజీనామా ప్రకటించే అవకాశాలున్నాయి. నిర్ణీత ప్రకారం ఈ ఏడాది అక్టోబరులో సార్వత్రిక ఎన్నికలు కెనడాలో జరగాల్సి ఉంది. ఎన్ని విమర్శలు ఎదురైనాగానీ ట్రూడో మాత్రం తన భవితవ్యంపై నోరు విప్పడంలేదు. ఆయన సొంతపార్టీ లబరల్ పార్టీలో అసమ్మతి రోజు రోజుకూ పెరుగుతోంది. దీంతో ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయాలని కూడా ఆయనపై ఒత్తిడి రోజు రోజుకూ పెరుగుతోందని, ఈ వారంలోనే ఆయన రాజీనామా చేసే అవకాశాలున్నాయనీ, ఈ విషయంపై ఆయన తీవ్ర ఆలోచనలో ఉన్నారనీ కెనడా పత్రిక 'గ్లోబ్ అండ్ మెయిల్' తెలియజేసింది. ఇటీవలికాలంలో ట్రూడో ప్రజాభిమానం కొడిగట్టి బాగా మసకబారింది. ఆయనకు ఈమధ్య అవిశ్వాస తీర్మానాల పరంపర ఎదురైంది. అయినాగానీ ఆయన తృటిలో వాటిని తప్పించుకుని ఇప్పటివరకూ మనుగడసాగిస్తూ వస్తున్నారు. తక్షణం ట్రూడో తన పదవికి రాజీనామా చేయాలని విమర్శకులు వివిధ వేదికల ద్వారా ఆయనపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారు. తెల్లారిలేస్తే సోషల్ మీడియాలో కూడా ఆయనకు తీవ్ర అవమానకరమైన పోస్టింగులు ఎదురవుతున్నాయి. టారిఫ్‌ల విషయంలో అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరిపోవాలని డోనాల్డ్ ట్రంప్ చేసిన సవాలు ఆయనకు పెద్ద చెంప పెట్టుగా మారింది. సోషల్ మీడియాలో ప్రధానంగా '51వ రాష్ట్ర గవర్నర్' ట్రూడో అంటూ వ్యంగ్యంగా ట్రూడోకు పోస్టింగులు ఎదురవుతున్నాయి. ఇదో గ్రేట్ ఐడియా అంటూ ఆయనను ఎద్దేవా చేస్తున్నారు. ట్రూడో ఉపప్రధానమంత్రి క్రిస్టినా ఫ్రీలాండ్ గడచిన డిసెంబరునెలలోనే ఆయనతో విభేదించి తన పదవికి రాజీనామా చేశారు. ట్రంప్‌ను స్వయంగా వెళ్ళి కలిసిన తర్వాత కూడా ట్రూడో పరిస్థితిలో మార్పురాలేదు సరికదా ట్రంప్ నుండి వ్యంగ్యాస్త్రాలు పెరిగాయి. అదేవిధంగా అంతర్గత సంక్షోభం నుండి బయటపడేందుకు మంత్రివర్గంలో మార్పులు చేసినాగానీ ట్రూడోకు కలిసిరాలేదు.

## నక్సల్స్ ప్రతీకారచర్య

(మొదటి పేజీ తరువాయి)

ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు ప్రారంభించినట్లు ఐపిఎస్ అధికారి తెలిపారు. డిఆర్‌జి సిబ్బంది నారాయణపూర్, దంతెవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో భద్రతా సిబ్బందితో కలిసి సంయుక్తంగా మూడు రోజుల పాటు నిర్వహించిన యాంటీ నక్సలైట్ ఆపరేషన్‌లో పాల్గొన్నారని ఐజి తెలిపారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ ఆపరేషన్‌లో ఐదుగురు నక్సలైట్లు మరణించారని, ఒక డిఆర్‌జి హెడ్ కానిస్టేబుల్ కూడా ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఆపరేషన్ తర్వాత, దంతెవాడ నుండి డిఆర్‌జి సిబ్బంది వాహనంలో తమ స్థావరానికి తిరిగి వస్తుండగా కుట్రు ప్రాంతంలో దాడి జరిగిందని సుందర్‌రాజ్ తెలిపారు. రాజధాని రాయ్‌పూర్ నుండి 400 కి.మీ. దూరంలో ఉన్న చివరి ప్రాంతం. ఇదిలా ఉండగా పేలుడు తర్వాత కాంక్రీట్ రహదారిని చీల్చుతూ 10 అడుగుల కంటే ఎక్కువ లోతులో భారీ గుంత ఏర్పడినట్లు కొన్ని దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. పేలుడు ధాటికి వాహనం పూర్తిగా ధ్వంసమైంది, ప్లాస్టిక్ షీట్లపై ఛిద్రమైన మృతదేహాలు కనిపించాయి. వాహనంలో కొంత భాగం సమీపంలోని చెట్టుకు వేలాడుతూ కనిపించింది.

**'జవాన్ల బలిదానం వృథా కాదు'**

మావోయిస్టుల చేసిన ఈ దాడిపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయ్ స్పందించారు. 'బీజాపూర్‌లో నక్సలైట్లు జరిపిన దాడిలో 8 మంది జవాన్లు వీరమరణ పొందారనే వార్త చాలా బాధాకరం. అమరుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. అమరులైన జవాన్ల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. బస్తర్‌లో జరుగుతున్న నక్సల్స్ నిర్మూలన చర్యలపై నక్సలైట్లు విసుగు చెందుతున్నారు. అందుకే ఈ పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారు. జవాన్ల బలిదానం వృథా కాదు, నక్సలిజాన్ని అంతం చేసేందుకు మా పోరాటం బలంగా కొనసాగుతుంది' అని ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**'నక్సలిజం అంతం తథ్యం'**

నక్సలైట్ల దాడిలో జవాన్లు మరణించడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విచారం వ్యక్తం చేశారు. 'మన జవాన్ల త్యాగాలను వృథా కానివ్వం. 2026 మార్చి నాటికి భారత్‌లో నక్సలిజం లేకుండా చేస్తాం' అని స్పష్టం చేశారు.

**ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారం?**

శనివారం అర్ధరాత్రి ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందగా ఓ డిఆర్‌జి కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే గత రెండు రోజులుగా భద్రతా దళాలు మావోయిస్టుల కోసం గాలిస్తున్నాయి. ఈ క్రమంలోనే మావోయిస్టులు జవాన్ల కాన్వాయ్‌పై దాడి చేశారు. 2023 ఏప్రిల్ 26న దంతెవాడ జిల్లాలో భద్రతా సిబ్బందిని తీసుకువెళుతున్న కాన్వాయ్‌పై నక్సలైట్లు ఇలాగే దాడి చేశారు. ఆ ఘటనలో 10మంది పోలీసులు సిబ్బంది సహా ఓ డ్రైవర్ మృతిచెందాడు.

## ఆర్థిక పురోగతి (మొదటి పేజీ తరువాయి)

తెలంగాణా రాష్ట్రం ట్రిలియన్ ఎకానమి సాధించగలుగుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేసారు. చర్లపల్లి రైల్వే టర్మినల్ ప్రారంభిస్తున్నందుకు సిఎం ప్రధానికి తెలంగాణా ప్రజల తరపున ధన్యవాదాలు తెలియచేస్తూ తెలంగాణా రాష్ట్రం ఫార్మా రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, రాష్ట్రానికి డ్రైపోర్టు ఇవ్వాలని, ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి, బందర్ పోర్టుకు రైల్వే లైన్‌కు అనుమతి మంజూరు చేయాలని. ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి సైతం అనుమతించాలని సిఎం కోరారు. 374 కిలో మీటర్ల రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం కొనసాగుతోందని, రీజనల్ రైల్ సైతం రాష్ట్రానికి అవసరం ఉందన్నారు. వికారాబాద్ నుండి కొడంగల్ మీదుగా కర్ణాటకకు రైల్వే లైన్ నిర్మాణం, రైల్ రింగ్‌కు కేంద్రం అనుమతించాలని సిఎం దేశ ప్రధానిని కోరారు.

## కలకలం (మొదటి పేజీ తరువాయి)

ఉండగా, బెంగళూరులో మూడు నెలల చిన్నారి వైరస్ నుంచి కోలుకుని ఆసుపత్రి నుంచి విడుదల కాగా... మరో ఎనిమిది నెలల చిన్నారి చికిత్స పొందుతోంది. వైరస్ వెలుగు చూసిన దేశాల్లో వీరి కుటుంబాలు ప్రయాణాలు చేయలేదని తెలిపింది. చైనాలో కలకలం సృష్టిస్తున్న వైరస్... ఇదీ ఒకటా కాదా తెలియాల్సి ఉంది. హెచ్ఎంపివి వైరస్ లక్షణాలు ఫ్లూ, ఇతర శ్వాసకోశ సంక్రమణ మాదిరిగానే ఉంటాయని వైద్య నిపుణులు వెల్లడించారు. దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి కనిపిస్తాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్నవారిలో బ్రాంకైటిస్, నిమోనియాకు దారితీయవచ్చు. వ్యాధి లక్షణాలు బయటకు కనిపించడానికి మూడు నుంచి ఆరు రోజు లు పడుతుంది. చిన్నారులు, వృద్ధులు, బలహీనమైన రోగనిరోధక శక్తి కలిగిన వ్యక్తులు ఈ వైరస్ బారినపడే అవకాశాలు అధికంగా ఉంటాయని అమెరికాకు చెందిన సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ పేర్కొంది. చైనాలో హ్యూమన్ మెటానిమో వైరస్ సహా శ్వాసకోశ వ్యాధులు విజంభిస్తున్నాయన్న వార్తలతో భారత్ ఇప్పటికే అప్రమత్తమైంది. ఇటీవలే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అధ్యక్షతన జాయింట్ మానిటరింగ్ గ్రూప్ (జెఎంజి) సమావేశం నిర్వహించింది. శీతాకాలంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగానే చైనాలో ఇన్‌ఫ్లూయెంజా, ఆర్ఎస్‌వి, హెచ్ఎంపివి తరహా వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయని జెఎంజి తేల్చి చెప్పింది. భారత్‌లో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. ముందస్తుచర్యల్లో భాగంగా ఇప్పటికే వివిధ చోట్ల ఆర్ఎస్‌వి, హెచ్ఎంపివి తదితర పరీక్షలు చేస్తున్నట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఒకవేళ శ్వాసకోశ వ్యాధులు అనుకోకుండా పెరిగినా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. కాగా, ఇద్దరు చిన్నారులకు వైరస్ సోకడంతో కర్నాటక ప్రభుత్వం అప్రమత్తమైంది. వైద్యారోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. వైరస్ మరింత వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

## రూ.41 కోట్లు (మొదటి పేజీ తరువాయి)

రూ. 49 కోట్లను ఎన్నికల బాండ్ల రూపంలో బిఒఆర్ఎస్ కు గ్రీన్ కో సంస్థ చెల్లించినట్టు ప్రచారం జరుగుతోంది. రేసుకు సంబంధించిన చర్చలు మొదలైనప్పటి నుంచే ఎన్నికల బాండ్లను గ్రీన్ కో సంస్థ కొనుగోలు చేసినట్లు దర్యాప్తు సంస్థ అనుమానిస్తోంది. ఈకార్ రేసులో ఎన్నికల బాండ్ అంశం తెరపైకి రావడంతో రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. అయితే గ్రీన్ కో సంస్థ చెల్లించిన ఎన్నికల బాండ్‌ను బిఆర్ఎస్ స్పష్టంగా ఖండించకపోగా ఈ సంస్థ అనేక రాజకీయ పార్టీలకు ఎన్నికల బండ్‌ను చెల్లించినట్టు సాక్షాత్తూ బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి మీడియా సమావేశంలోనే వెల్లడించారు మరోవైపు తెలంగాణ భవన్‌లో తనను కలిసిన జర్నలిస్టులతో కెటిఆర్ ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ గ్రీన్ కో ఎలక్టోరల్ బాండ్లు 2022లో ఇచ్చిందని, కానీ ఫార్ములా ఈ రేసు మాత్రం 2023లో జరిగిందని స్పష్టం చేశారు. పైగా గ్రీన్ కో ఎలక్టోరల్ బాండ్లు కాంగ్రెస్, బిజెపి పార్టీలకు కూడా ఇచ్చిందని, పార్లమెంట్ ఆమోదించిన ఎలక్టోరల్ బాండ్లు ఇవ్వడం అవినీతి ఎలా అంటారని కెటిఆర్ ప్రశ్నించారు.

## మన్మోహన్ సింగ్ పేరు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో వైఎస్. రాజశేఖర్ రెడ్డి హయంలో అతిపెద్ద ఫ్లై ఓవర్ పివి. ఎక్స్ ప్రెస్‌వే, నగరంలోనే రెండో అతిపెద్ద ఫ్లై ఓవర్ అరాంఘర్ ఫ్లై ఓవర్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే పివి. ఎక్స్ ప్రెస్ వే నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. మళ్లీ కాంగ్రెస్ హయాంలోనే రెండో అతిపెద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం జరిగిందన్నారు. మనకు మనమే పోటీ అని మరోసారి నిరూపించుకున్నామన్నారు. అధికారంలోకి రాగానే పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నామన్నారు. హైదరాబాద్‌లో మెట్రో విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. నిజాంలు హైదరాబాద్‌ను లేక్ సిటీగా తీర్చిదిద్దారని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు పూర్తయితే రాష్ట్రం రూపురేఖలు మారిపోతాయన్నారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తాయన్నారు.

**మా పార్టీ మీ వెంటే ఉంటుంది.. సిఎం రేవంత్ రెడ్డితో అసదుద్దీన్ ఒవైసి**

ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, ఎంపి. అసదుద్దీన్ ఓవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని తమ పార్టీ మీ వెంటే ఉంటుంది' అని సిఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అసదుద్దీన్ అన్నారు. హైదరాబాద్ తెలంగాణ గ్రోత్ సెంటర్‌గా మారిందని ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు బాగున్నాయన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇస్తామన్న సిఎం ప్రకటనకు ధన్యవాదాలు తెలిపారు. రైతులకు కూడా ఈ ప్రభుత్వం సహకరించడం మంచి తరుణమని అభినందించారు. నల్లగొండ క్రాస్ రోడ్ స్టీల్ బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా సిఎంను అసదుద్దీన్ కోరారు. ఓల్డ్ సిటీలో మరిన్ని ఫైర్ స్టేషన్లు రావాల్సిన అవసరం ఉందన్నారు. రేవంత్ రెడ్డి జైల్లో ఉన్నప్పుడు వంట చేసి పెట్టిన వాళ్ళను మర్చిపోకుండా వారిని పిలిపించుకుని సహాయం చేయడం మంచి పరిణామమన్నారు. 1998లో తనని కూడా అప్పటి సిఎం చంద్రబాబు జైల్లో పెట్టించారని గుర్తు చేసుకున్నారు.

**ఓల్డ్ సిటీలో ఒలంపిక్ మెడల్స్ తీసుకువచ్చే ఫుడ్ బాల్ ప్లేయర్స్ : అక్బరుద్దీన్**

ఓల్డ్ సిటీలో ఇంత పెద్ద ఫ్లై ఓవర్ ప్రారంభించడం ఆనందంగా ఉందని చాంద్రాయణగుట్ట అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. ఓల్డ్ సిటీ పరిధిలో 301 కోట్లతో సీవరేజ్ పనులు ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వర్షం నీరు, మురుగు నీరు కలవకుండా వేర్వేరు లైన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వం ఓల్డ్ సిటీని ఇస్తాంబుల్, సింగపూర్ చేస్తామని గొప్పలు చెప్పింది.. కానీ చార్మినార్ పాదచారుల ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. గోషామహల్‌లో కొత్తగా నిర్మించనున్న ఉస్మానియా ఆస్పత్రిపై ప్రభుత్వం దృష్టిసారించి, త్వరగా పూర్తి చేయాలని కోరారు. నగరంలో ఉన్న క్రీడా స్టేడియాలను రాజకీయ పార్టీల సభలకు మాత్రమే కాకుండా, స్పోర్ట్స్ యాక్టివిటీస్‌ను పెంచే విధంగా మార్పు చేయాలని సూచించారు. ఓల్డ్ సిటీ నుండి ఒలంపిక్స్‌లో మెడల్స్ తీసుకువచ్చే ఫుడ్ బాల్ ప్లేయర్స్ ఉన్నారని, వారికి ప్రభుత్వం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. నగర అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పని చేస్తామన్నారు. ఓల్డ్ సిటీకి మెట్రో రైలు తీసుకువస్తోన్న సిఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా అక్బరుద్దీన్ ధన్యవాదాలు తెలిపారు.

**ఆరాంఘర్ ఫ్లై ఓవర్ వివరాలు..**

ఆరాంఘర్ నుంచి నెహ్రూ జులాజికల్ జూపార్క్‌వరకు 24 మీటర్ల వెడల్పు, 4.08 కిలోమీటర్ల పొడవు, ఆరు లేన్లతో నిర్మించారు. ఇది నగరంలో అతిపెద్ద రెండో ఫ్లైఓవర్ స్థానాన్ని దక్కించుకుంది. ఈ ఫ్లై ఓవర్ అందుబాటులోకి రావడంతో జూపార్క్ నుంచి ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, మహబూబ్‌నగర్, కర్నూల్, అనంతపురం, బెంగళూరు వెళ్లేవారికి ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయి.

## బుల్లెట్ రైలు

(మొదటి పేజీ తరువాయి)

బుల్లెట్ రైలు సాకారం అవుతుందన్నారు. ఒక్కో అడుగు వేసుకొంటూ కేంద్రం దేశాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నామని, రైల్వే రంగంలో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిస్తూ ఆధునీకరణతో పాటు ప్రయాణీకులకు సౌకర్యాలు మెరుగుపరుస్తున్నామని ప్రధాని మోడీ స్పష్టం చేసారు. ప్రయాణీకులకు అందుబాటులోకి తీసుకొని వచ్చిన వందే భారత్, అమృత్ భారత్, నమో భారత్ లాంటి హైస్పీడ్ రైళ్లు పరుగులు పెడుతున్నాయని, వీటిలో స్లీపర్ వంటి సౌకర్యాలను సైతం కల్పించబోతున్నామని, కొత్త రైల్వే ట్రాక్‌లతో పాటు అండర్ బ్రిడ్జిల నిర్మాణాలను వేగవంతం చేస్తున్నామన్నారు. వికసిత్ భారత్ సంకల్పంతో తాము ముందుకు వెళుతున్నామని, మౌలిక వసతులు, ప్రయాణీకుల సదుపాయాలు, మారుమూల ప్రాంతాలకు కనెక్టివిటీ, ఉపాధి కల్పన లాంటి లక్ష్యాలతో నాలుగు విభాగాల్లో రైల్వేను అభివృద్ధి చేస్తున్నామని పిఎం పేర్కొన్నారు. నూతనంగా నిర్మించిన చర్లపల్లి రైల్వే టర్మినల్ వల్ల సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్ స్టేషన్లపై ప్రయాణీకుల ఒత్తిడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ మాట్లాడుతూ దేశ ప్రగతికి దోహదపడే రవాణా వ్యవస్థలో కీలకమైన రైల్వే రంగానికి కేంద్రం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, ఈ విషయంలో దక్షిణ మధ్య రైల్వే గణనీయమైన ప్రగతి సాధిస్తోందన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రానికి కేంద్రం అత్యంత ప్రాధాన్యమిస్తూ రోడ్లు, రైల్వే లైన్లకు భారీ నిధులు కేటాయిస్తోందని, పూర్తి స్థాయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ సహకారం ఎంతైనా అవసరం ఉందన్నారు. కేంద్ర రైల్వే జల వనరుల శాఖ మంత్రి సోమన్న మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రంలో సాధారణ రైల్వే ప్రయాణీకులను దృష్టిలో పెట్టుకొని అన్ని రైల్వే స్టేషన్లలో వెయిటింగ్ రూంలు,బుకింగ్ కౌంటర్లు, దివ్యాంగులు, వృద్ధుల కోసం ఎస్కలేటర్లు, లిఫ్టులు, ర్యాంప్ సౌకర్యాలను ఏర్పాటు చేస్తోందన్నారు. తెలంగాణా రాష్ట్రానికి గతంలో ఏ నాడూ లేని విధంగా భారీగా నిధులు కేటాయించిందని, 370 కిలో మీటర్ల కొత్త రైల్వే లైన్లు, 370 కిలో మీటర్ల డబ్లింగ్, ట్రిప్లింగ్ రైల్వే లైన్లు, విద్యుదీకరణ, కొత్త ఆర్‌ఓబిల నిర్మాణం చేసిందని, 121మానవ రహిత రైల్వే గేట్లను మూసేసామన్నారు. అప్రోచ్ రహదార్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం వాటా ఉండాల్సిందేనన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకారం లేనప్పటికీ పూర్తి స్థాయిలో వ్యయాన్ని కేంద్రమే భరిస్తూ ఆర్‌ఓబి, ఆర్‌యుబి పనులు పూర్తి చేసిందని, త్వరలో కాజిపేటలో రైల్వే బోగీలు, ఇంజన్ల తయారీ కర్మాగారం ప్రారంభమవుతోందని, దీని వల్ల అనేక మందికి ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్రంలో పెద్దపల్లి మినహా 31 జిల్లాల్లో జాతీయ రహదార్లుగా కేంద్రం మార్చిందన్నారు. కొత్తగా భక్తులకు సౌకర్యం కలిగే విధంగా కొమరవల్లిలో నూతన రైల్వే స్టేషన్ నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. యాదగిరిగుట్టకు ఎంఎంటిఎస్ రైల్వే లైన్లు పొడిగిస్తున్నామన్నారు. సికింద్రాబాద్ రైల్వే పునర్నిర్మాణం తర్వాత అవసరమయ్యే అప్రోచ్ రోడ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ప్రయాణీకులకు పూర్తి స్థాయిలో మౌళికసదుపాయాలు కల్పిస్తూ చర్లపల్లి రైల్వే స్టేషన్ నిర్మించారని, పలు రైళ్లు ఇక్కడి నుండే ప్రారంభమవుతాయని దక్షిణ మధ్య రైల్వే జిఎం అరుణ్‌కుమార్ తెలిపారు. సోలార్ స్టేషన్‌గా దీన్ని తీర్చి దిద్దామన్నారు. రాష్ట్ర ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ భవిష్యత్ ఆలోచనతో రాష్ట్రంలో రహదార్ల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని, అప్రోచ్ రోడ్‌లకు సహకరించాలని కోరారు. రైల్వే నెట్‌వర్క్‌ను మరింత విస్తృత పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు,పలువురు ప్రజా ప్రతినిధులు, రైల్వే శాఖాధికారులు పాల్గొన్నారు.

# అసలైన సంపద సృష్టికర్తలు

(మొదటి పేజీ తరువాయి)

చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మహాసభల ఆహ్వాన కమిటీ ,చైర్మన్ ఎం.బాలనరసింహ్మా, ఎంపి కె.రాధాకృష్ణన్, కాంగ్రెస్ ఎంఎల్‌ఎ గడ్డం వివేక్, ఎఐడిఆర్ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి విఎస్.నిర్మల్ కుమార్, జాతీయ నాయకులు మాజీ ఎంఎల్‌ఎలు ఎన్.రాజన్, జి.లతా, జాతీయ నాయకులు మనోజ్ బి.ఎడమన్నా, దేవికుమారి, గుల్జార్ సింగ్ బొరియా, కె.సుబ్బారావు, మహాదేవ్ కుడే, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం, ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్‌లు పాల్గొన్నారు. డి.రాజా ప్రారంభోపన్యాసంలో మాట్లాడుతూ ప్రపంచంలో మనిషి పుట్టుకే సుప్రీం అని, ఎవరైనా తల్లి గర్భం నుంచి ఓకేలా పుడుతారని, కానీ మన దేశంలో పుట్టిన ప్రతి బిడ్డ, ఆడ, మగ అన్న తేడా లేకుండా వారి భవిష్యత్తును కులాలు నిర్ణయించే దౌర్భగ్య పరిస్థితి ఉండడం దారుణమన్నారు. ఈ దారుణ పరిస్థితులు పోవాలంటే ముందు మనుషుల మనస్సుతత్వం మారాలని, మనిషిగా పుట్టిన వారంతా ఒక్కటేనని, ఒకే కుటుంబం అన్న భావన రావాలని, అప్పుడే ఈ దేశం ప్రగతిపథంలో పయణించడమే కాకుండా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కలలు కూడా నిజమవుతాయని తెలిపారు. దేశ స్వాతంత్రోద్యమంలో దళితులు, ఆదివాసీలది ముఖ్య పాత్ర అని, కానీ 78 ఏళ్ల స్వతంత్ర భారతవాణిలో నేటికీ ఆ వర్గాలు అత్యంత వివక్షతను ఎదుర్కొంటున్నారని, దీనికి ఈ దేశంలోని కుల వ్యవస్థే కారణమన్నారు. దళితులు, ఆదివాసీలు లేనిదే ఈ దేశం లేదని, వారి శ్రమ ఫలితమే ఈ దేశ సంపద అని రాజా పేర్కొన్నారు. ప్రపంచంలో ఆర్థికంగా భారత్ 5వ శక్తివంతమైన దేశమని ప్రధాన మంత్రి పదే పదే మాట్లాడుతుంటారని, ఇది ఈ దేశంలో ఉన్న 90 శాతంగా ఉన్న అట్టడుగు వర్గాల ప్రజలు తమ శ్రమతో సృష్టించిన సంపద ద్వారానే సాధ్యమైందన్న అంశాన్ని అందరూ మరిచిపోతున్నారన్నారు. ఈ సంపద సృష్టిస్తున్న 90 శాతం మంది దేశ ప్రజలు నిత్యం నిరుపేదలుగా మారుతుంటే కనీసం శ్రమ అనేదే తెలియని కొంత మంది లక్షల కోట్ల రూపాయలకు ఎగబాకుతున్నారని పేర్కొన్నారు. దేశంలో కుల వ్యవస్థను నిర్మూలించడానికి వామపక్ష, ప్రగతిశీల శక్తులు ఏకం కావాలని, ఇందుకు అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం కీలక భూమిక పోషించాలని రాజా సూచించారు. ఎంపి, దళిత సోషన్ ముక్తి మంచ్ జాతీయ అధ్యక్షులు రాధాకృష్ణన్ మాట్లాడుతూ మనిషి తన మేధోశక్తితో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఎఐ) అనే సాకేంతిక పరిజ్ఞానాన్ని సృష్టించ గలిగాడు కానీ, కుల వ్యవస్థను నిర్మూలించలేకపోతున్నామన్నారు. ఆర్‌ఎస్ఎస్, బిజెపి శక్తులు ఈ దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చి చతుర్వర్ణ వ్యవస్థను తిరిగి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోందని, దీనిని తిప్పికొట్టడానికి దళితులు, ఆదివాసీలు ఐక్యం కావాలని ఆయన కోరారు. అనీ రాజా మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం ఎవరి వాటా వారికి కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. మధ్యప్రదేశ్‌లో ఓ నీటి పంపు వద్ద 8 ఏళ్ల బాలిక లేచి నిలబడితే ఆమె నీడ అక్కడి నుంచి వెళ్లుతున్న అగ్రవర్ణ వ్యక్తిపై పడిందనే నేపంతో ఆ కుటుంబాన్ని అంత మొందించిన అనాగరిక సమాజంలో మనం ఉన్నందుకు ఈ సమాజం సిగ్గు పడాలాన్నారు. దళితుల హక్కులు, అభున్నతి కోసం జరిగే ఉద్యమాల్లో ఎఐడిఆర్ఎంతో భుజం భుజం కలిపి నడుస్తోందని తెలిపారు. ఎంఎల్‌ఎ గడ్డం వివేక్ మాట్లాడుతూ దళితులు ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రానున్న బడ్జెట్‌లో 25 శాతం నిధులు కేటాయించాల్సిందేనన్నారు. ఇందుకు సంబంధించి ఎస్‌సి, ఎస్‌టిలకు రానున్న బడ్జెట్‌లో అధిక నిధులను కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. మల్లెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ దళితుల శ్రమతోనే ఈ దేశం ముందుకు సాగుతోందన్నారు. బొగ్గు గనులు మొదలు పారిశుధ్యం, లెదర్, నిర్మాణ రంగం, వ్యవసాయం ప్రతీ పనిలోనూ తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి దళితులు, ఆదివాసీలే శ్రామికులుగా సంపదను సృష్టిస్తున్నారని చెప్పారు. దళితుల ఆదివాసీలకు రిజర్వేషన్లు కల్పించడం దయాదాక్షిణ్యాలు కాదని, అది వీరి హక్కు అని, లక్షల వేల కోట్ల సంపదను సృష్టిస్తున్న ఈ వర్గాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దళితులు, ఆదివాసీలకు రాజ్యాంగం చట్టబద్ధంగా అనేక హక్కులు కల్పించినప్పటికీ ఇప్పటికీ వివక్షత కొనసాగడం దుర్మార్గమన్నారు. దళితులు, ఆదివాసుల సంక్షేమం, అభివృద్ధికి నామ మాత్రమే నిధులను కేటాయిస్తున్న ప్రభుత్వాలు వాటిని కూడా సక్రమంగా ఖర్చు చేయడంలేదని, ఫలితంగా వివిధ వర్గాల అభివృద్ధి ఎండమావిగానే మారుతోందన్నారు. వీటన్నింటికి వ్యతిరేకంగా ఎఐడిఆర్ఎం ఉద్యమించాలని, దీనికి సిపిఐ పూర్తి తోడ్పాటును అందిస్తుందని తెలిపారు.

**అమరులకు సంతాపం**

తొలుత ఇటీవల మరణించిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్, బికెఎంయు జాతీయ అధ్యక్షుడు అతుల్‌కుమార్ అంజాన్, సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరితో పాటు ఎఐడిఆర్ఎం నాయకుల మృతి పట్ల మహాసభ సంతాపాన్ని ప్రకటించింది. ఈ మేరకు సంతాప తీర్మాన్ని సభ ఆమోదిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించింది.

# తెలంగాణలో అతిపెద్ద కుంభకోణం ‘చిత్రపురి’




ప్రస్తుత అక్రమాల చిత్రపురి కమిటీని రద్దు చేయాలి
అడ్‌హక్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలి
సమావేశంలో ప్రభుత్వానికి అఖిలపక్షం డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మణికొండ, చిత్రపురి కాలనీ డాక్టర్ ఎం.ప్రభాకర్‌రెడ్డి సినీ వర్కర్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో జరిగిన కుంభకోణం తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అతిపెద్ద కుంభకోణమని వివిధ రాజకీయ పార్టీల నాయకులు పలువురు అన్నారు. చిత్రపురి కాలనీలో జరిగిన అవినీతి అవకతవకలపై అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని, దేశోద్ధారక భవన్‌లో సోమవారం జరిగింది. సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షత వహించగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.బాలరాజ్, సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జి.నరసింహారావు, టిజెసిస్ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్, టిజెఎస్ నాయకులు సర్వయ్య, సీనియర్ రాజకీయ నాయకులు దేశ్ పాండే తదితరులు ప్రసంగించారు. చిత్రపురి అక్రమాలపై అన్ని పార్టీలతో జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేయాలని, ప్రస్తుత అక్రమాల చిత్రపురి కమిటీని రద్దు చేయాలని, అడ్‌హక్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని సమావేశం నిర్ణయించింది. సిఎం రేవంత్ రెడ్డిని కలిసి సమస్య తీవ్రతను తెలియజేయాలని, ఈ సమస్యపై టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, టిజెఎస్ నేత ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరామ్, సిపిఐ ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ(ఎం) కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఆమ్ ఆద్మీ కన్వీనర్ దిడ్డి సుధాకర్, దేశ్ పాండే తదితరులు అందరితో కలిసి వెళ్లాలని సమావేశం నిర్ణయించింది. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ చిత్రపురి అవినీతి, అక్రమాలు తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత జరిగిన అతిపెద్ద కుంభకోణమన్నారు. చిత్రపురి బాధితులకు అండగా ఉండటమే కాకుండా అవినీతి అధికారులను జైలుకు పంపించే వరకూ వదిలి పెట్టబోమన్నారు. చరణ్ కౌశిక్ యాదవ్ మాట్లాడుతూ చిత్రపురి కాలనీ కుంభకోణాన్ని సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, కుంభకోణానికి పాల్పడ్డ సొసైటీ సభ్యులపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. డి.జి.నరసింహారావు మాట్లాడుతూ ఇంత అవినీతి వింటుంటే అసలు మనం సమాజంలో ఉన్నామా అని అసహ్యం వేస్తోందన్నారు. బాధితులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని, చిత్రపురి అక్రమార్కుల భరతం పట్టేవరకు వదిలేదన్నారు. ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ అసలు ఇన్ని అక్రమాలు జరుగుతుంటే ప్రభుత్వ అధికారులు ఏమి చేస్తున్నారు, ముందు వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఐ ఇప్పటికే చిత్రపురి అవినీతిపై అనేక పోరాటాలు చేసిందని వివరించారు. టిజెఎస్ నాయకులు సర్వయ్య మాట్లాడుతూ అనేక ఏళ్ల నుండి ఈ సమస్య గురించి మీడియా ద్వారా వింటున్నామని, దీని గురించి టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ కూడా చర్చించారని, దీనిపై ప్రత్యేక పోరాటం చేయాలని, అన్ని పక్ష పార్టీలు, ఆప్ అందరం సిఎంను కలిసి ఒత్తిడి తెస్తామన్నారు. దేశ్ పాండే మాట్లాడుతూ నేను గత నాలుగేళ్ల నుండి ఈ పోరాటంలో పాల్గొంటున్నానని, ప్రభుత్వ అధికారులు కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తుంటే ప్రభుత్వం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. సమావేశంలో టిఎన్‌జిఓ మాజీ నాయకులు శ్యాంరావ్, చిత్రపురి ఉద్యమకారులు కస్తూరి శ్రీనివాస్, సామాజిక ఉద్యమకారులు భద్ర, జూనియర్ ఆర్టిస్ట్స్ యూనియన్ నాయకులు కొసనూరి రవీందర్, రమాదేవి, రాజు, సినీ దర్శకులు కాట్రగడ్డ రవితేజ, మద్దినేని రమేష్, బాధితులు నిర్మల, పద్మావతి, ఆప్ నాయకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# 31లోగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

వచ్చే నాలుగు సంవత్సరాలలో 80 లక్షల ఇళ్లు నిర్మించే లక్ష్యం
దేశంలో టిజిఆర్‌టిసిని మోడల్‌గా తీర్చిదిద్దేలా ప్రభుత్వం కృషి
రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** జనవరి 31లోగా అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, రాష్ట్ర బిసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, దొంతి మాధవరెడ్డి, కె ఆర్ నాగరాజ్, హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, జిడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలతో కలిసి హనుమకొండ వరంగల్ జిల్లాలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పురోగతి, భద్రకాళి చెరువు పూడికతీత అభివృద్ధి తదితర అంశాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూలంకషంగా చర్చించి సమర్థ నిర్వహణకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిన తర్వాత వరంగల్ పట్టణం వరంగల్ ప్రాముఖ్యతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించి హైదరాబాద్ తర్వాత హైదరాబాద్‌కు సమానంగా పాత వరంగల్ పట్టణాన్ని అభివృద్ధి చేయాలన్న ఆలోచన చేశారని, దానికి అనుగుణంగా మొదటి సంవత్సరం పూర్తి కాకముందే సీఎం రెండు పర్యాయాలు వరంగల్ పట్టణానికి వచ్చారని తెలిపారు. మొదటిసారి పర్యటన సందర్భంగా చేయాల్సిన అభివృద్ధిపై స్థానిక ప్రజా ప్రతినిధులతో చర్చించి అభిప్రాయాలను తీసుకొని ఎయిర్ పోర్ట్, వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తనకు బాధ్యతలు అప్పగించారని, రెండో పర్యాయం వచ్చినప్పుడు అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారని, 6 వేల కోట్లకు పైగా వరదలాగా నిధులు మంజూరు చేశారని అన్నారు. 2041 మాస్టర్ ప్లాన్ మంజూరు చేయడం జరిగిందన్నారు. భద్రకాళి చెరువు పూడికతీత, వివిధ అభివృద్ధి, మౌలిక వసతులు కల్పన టెండర్లు పిలిచామని అన్నారు. హైదరాబాద్‌లో లాగా వరంగల్‌లో కూడా కొన్ని ఎలక్ట్రికల్ బస్సులు సోమవారం లాంచనంగా ప్రారంభించుకున్నామని, సంక్రాంతి లోపు రెండో విడతలో మరికొన్ని ఎలక్ట్రికల్ బస్సులు ఇవ్వబోతున్నట్లు తెలిపారు. దేశంలో టిజిఆర్టీసీని మోడల్‌గా తీర్చిదిద్దే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆ శాఖను మంత్రి పొన్నం ప్రభాకర్ ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. గృహ నిర్మాణశాఖ సంబంధించి 2004 నుండి 2014 వరకు 25 లక్షల ఇల్లు కట్టించిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదని అన్నారు. గత ప్రభుత్వం గత 10 ఏళ్లలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇస్తామని కలలు కలలుగానే ఉంచిందన్నారు. ఇళ్ల నిర్మాణం చేసి మొండిగా వదిలేసిందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో ఈ సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్ళు, ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున మంజూరు చేస్తూ, 4 సంవత్సరాలలో 80 లక్షల ఇళ్ల నిర్మించే లక్ష్యంగా ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న పేదోడి కల నెరవేర్చాలని దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకెళ్తున్నదని అన్నారు. జనవరి 31లోగా అత్యంత పారదర్శకంగా అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామన్నారు. గత ప్రభు త్వం మొండి గోడలతో వదిలేసిన 1.5 లక్షల ఇళ్ల పూర్తి చేస్తామన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధం గా 25 లక్షల 65 వేల మంది రైతులకు రూ 22 వేల కోట్ల 2 లక్షలలోపు రుణమాఫీ చేశామని అన్నారు. రైతు భరోసా విషయంలో రాష్ట్రవ్యాప్తం గా కమిటీ పర్యటించి రైతుల నుండి అభిప్రాయాలు సేకరించామని తెలిపారు.

భారత రాజ్యాంగం ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జనవరి 26వ తేదీ నుండి వ్యవసాయ యోగ్యత గల భూమికి ప్రతి సంవత్సరం ఎకరాకు రైతు భరోసా క్రింద 12 వేల రూపాయలు అందిస్తామన్నారు. జనవరి 26 నుండి కొత్త రేషన్ కార్డుల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు.

## సాగులో ఉన్న భూములకు రైతు భరోసా హర్షణీయం

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు రూ.12 వేల రైతు భరోసాను సక్రమంగా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కోరింది. కొంత సమయం తీసుకుని పాలకులు గతంలో చేసిన వాగ్దానం ప్రకారం ఏటా ఎకరాకు రూ.15 వేలు, కౌలు రైతులకు రైతు భరోసా అమలు చేయటానికి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ సూచించారు. సాగు భూములను ఎఈఓల ద్వారా, సాటిలైట్ సర్వే ద్వారా నిర్దిష్టంగా తేల్చాలని, 10 గుంటలు, అరెకరం పొలం ఉన్న రైతులు 36 శాతం వ్యవసాయ కూలీలుగా కూడా పని చేస్తున్నట్లుగా 77వ జాతీయ శాంపిల్ సర్వే వెల్లడించిందని, వీరికి రైతు భరోసాతో పాటు ‘ఇందిరమ్మ ఆత్మీయ భరోసా’ కూడా వర్తింప చేయడానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గత వానాకాలం పంటకు కూడా రైతు భరోసా ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ నేటికీ పూర్తి కానందున ముందుగా కౌలు రైతులను గుర్తించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతులను గుర్తించడంలో వారి నుండి దరఖాస్తులు తీసుకుని గ్రామ సభలలో నిర్ధారణ చేసి వారికి జీవనోపాధి కార్డులను ఇవ్వడం ద్వారా గుర్తించాలన్నారు. 2011 అధీకృత సాగుదారుల చట్టం అమలు చేయడం ద్వారా కౌలు రైతులు బ్యాంకు రుణాలు పొందడానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందటానికి వీలును కల్పించాలని వారు కోరారు.

# మందుల సరఫరా పర్యవేక్షణకు కమిటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మందుల సరఫరాను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాలోనూ ముగ్గురు సభ్యులతో కమిటీని నియమిస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ఈ కమిటీలో జిల్లా డిఎంహెచ్ఒ, డిసిహెచ్ఎస్, జిల్లాలోని బోధన ఆస్పత్రి సూపరింటెండెంట్ సభ్యులుగా ఉంటారని, ఈ కమిటీ అన్ని ఆస్పత్రులలో మెడిసిన్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఫార్మసిస్టులు తమకు సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా కమిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఎంసిహెచ్ఆర్‌డిలో సోమవారం జరిగిన ‘ఫార్మసీ, ఈ ఔషధి వర్క్ షాపు’ను మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సంధ్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఫార్మసీ కోరిన మందులను సరఫరా చేస్తున్నప్పటికీ మందులు లేవని వార్తలు వస్తున్నాయని, ఇందుకు కారణాలు ఏమిటో ఆస్పత్రి సూపరింటెండెంట్లు, ఉన్నతాధికారులు గుర్తించాలని ఆదేశించారు. మందుల కొరతను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని, ఇందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత అధికారి, సిబ్బందిపైన చర్యలు తీసుకోవాలన్నారు. మందుల కొరతతో రోగులు ఇబ్బందిపడినట్టుగా తమ దృష్టికి వస్తే సంబంధిత బాధ్యులపైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఫార్మసిస్టులు, డాక్టర్లు, హాస్పిటల్ సూపరింటెండెంట్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఫార్మసీలో అందుబాటులో ఉన్న మందుల వివరాలను డాక్టర్లకు ఫార్మసిస్టులు తెలియజేయాలని, అందుబాటులో ఉన్న మందుల వివరాలను డాక్టర్లు, ఈ ఔషధి పోర్టల్‌లో చెక్ చేసుకునే అవకాశం కూడా ఉన్నదని తెలిపారు. సూపరింటెండెంట్లు, ఆర్ఎంఓలు ప్రతిరోజూ ఉదయమే ఆస్పత్రుల్లోని ఫార్మసీ స్టోర్‌ను తనిఖీ చేయాలని, మెడిసిన్ లిస్ట్‌ను కూడా పరిశీలించాలని, మెడిసిన్ సరిగా భద్రపరుస్తున్నారా? లేదా? చూడాలని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ఈ వర్క్‌షాపులో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా చొంగ్తూ , కమిషనర్ ఆర్‌వి కర్ణన్, టిజిఎంఎస్ఐడిసి ఎండి హేమంత్, టివివిపి కమిషనర్ అజయ్ కుమార్, డిహెచ్ రవిందర్ నాయక్, అన్ని జిల్లాల నుంచి ఫార్మసీ సూపర్‌వైజర్లు , డిఎంహెచ్ఒలు, డిసిహెచ్ఎస్‌లు, టీచింగ్ హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వ శిక్షా అభియాన్ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమ్మెలో ఉన్న సమగ్ర సర్వ శిక్షా అభియాన్ సిబ్బంది ఆర్థికేతర అంశాల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. క్యాబినేట్ సబ్ కమిటీలో చర్చించి న్యాయం చేస్తామని సర్వ శిక్షా అభియాన్ ప్రతినిధుల బృందానికి డిప్యూటీ సిఎం హామీ ఇచ్చారు. సోమవారం ప్రజా భవన్‌లో ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరాంతో కూడిన కలిసిన సర్వ శిక్షా అభియాన్ ప్రతినిధుల బృందం ఉపముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ డిమాండ్లపై సాధ్యమైనంత త్వరలో ఒక సానుకూలమైన రీతిలో స్పందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. సమ్మె కాలానికి సైతం వేతనం చెల్లించేందుకు ప్రభుత్వ సిద్ధంగా ఉందని వెల్లడించారు. దీంతో తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా నడుచుకోవాలి

ప్రతి కార్యక్రమంపై విమర్శలు చేయడం, దుష్ప్రచారం చేయడమే ప్రతిపక్ష పార్టీలు పనిగా పెట్టుకోవద్దు
తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమంపై విమర్శలు చేయడం, దుష్ప్రచారం చేయడమే ప్రతిపక్ష పార్టీలు పనిగా పెట్టుకోవద్దని, ప్రభుత్వానికి సరైన సూచనలు, సలహాలు ఇస్తూ ప్రజల కోసం పని చేయాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టులు ఎస్ఎల్‌బిసి, డిండి, ఉదయ సముద్రం ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేయడం హర్షణీయమన్నారు. ప్రస్తుత ఎంఎల్ఎలు నిరంతరం ప్రజల్లో ఉం టూ, ప్రజల అభీష్టానికి అనుగుణంగా నడుచుకోవాలని ఆయన సూచించారు. శాసనమండలిలోని తన ఛాంబర్‌లో సోమవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల ప్రస్తుత ప్రభు త్వం ఆర్థిక సమస్యలను, సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ రైతులను ఆదుకోవాలనే దృఢ సంకల్పంతో రైతు భరోసాను రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచడం గొప్ప నిర్ణయమని తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసాను ఈ నెల 26 నుండి ఎలాంటి షరతులు లేకుండా సాగులో ఉన్న ప్రతి ఎకరాకు ఇవ్వడం అభినందనీయమన్నారు. భూమిలేని రైతు కూలీలకు ఏటా రూ.12 వేల సాయం అందించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. ప్రస్తుత ప్రభుత్వ పనితీరు ప్రజాయోగ్యంగా ఉందని, ప్రతిపక్ష పార్టీలు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని ఆయన అన్నారు.

**పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టుకు మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి పేరు పెట్టడం సముచితం**

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు ప్రభుత్వం కేంద్ర మాజీమంత్రి, దివంగత ఎస్.జైపాల్‌రెడ్డి పేరు పెట్టడం ఎంతో సముచితమని, ఈ నిర్ణయం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని మరింత పెంపొందించిందని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించిన జైపాల్‌రెడ్డి కృషిని ఎప్పటికీ మరవలేమన్నారు. ప్రచారం తక్కువ, పని ఎక్కువగా చేసే తత్వం జైపాల్‌రెడ్డిదని, అలాంటి మహానాయకుడి పేరును పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు పెట్టడాన్ని ప్రతిపక్ష పార్టీల నేతలు కూడా స్వాగతించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బంధుప్రీతితో ప్రాజెక్టుకు జైపాల్ రెడ్డి పేరు పెడుతున్నారని దుష్ప్రచారం చేయడం సరైంది కాదని, హైదరాబాద్ తో కూడిన తెలంగాణ రాష్ట్రం సాధించడం కోసం కేంద్ర మంత్రి హోదాలో జైపాల్‌రెడ్డి కృషి ఎనలేనిదన్నారు.

## సమ్మెకు ఎఐటియుసి సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికుల సమ్మెకు ఎఐటియుసి సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసుఫ్ తెలిపారు. సివిల్ సప్లయిా కార్పొరేషన్ అధికారులు కార్మికులు సంఘాలతో జరిపిన చర్చల్లో అంగీకరించిన అంశాలపై జి.ఓ. విడుదల చేయమని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం అంగీకరించిన అంశాలపై జి.ఓ.ను విడుదల చేయకుండా మొండివైఖరి అవలంభించటం వల్లే గత్యంతరం లేని పరిస్థితిలో కార్మికులు సమ్మె చేస్తున్నారని ఎం.డి. యూసుఫ్ తెలిపారు. సమ్మె మొదలై 6 నుండి 7వ రోజుకు చేరినప్పటికి ప్రభుత్వం ఎలాంటి జవాబు చెప్పకుండా కొత్త కార్మికులను తెచ్చి పని చేయించటానికి ప్రయత్నించటం, పాత కార్మికులను తీసివేస్తామని బెదిరించటం ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు స్పష్టంగా అద్దం పడుతుందన్నారు. వెంటనే హమాలీ కార్మికుల సంఘాలతో చర్చల్లో అంగీకరించిన అంశాలపై వెంటనే జి.ఓ.ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు నిర్వహిస్తున్న న్యాయమైన సమ్మెకు ఎఐటియుసి సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని, అవసరమైతే ప్రత్యక్షంగా కార్యాచరణలో పాల్గొంటామని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహా ప్రకటించారు.

## మీడియా పట్ల ప్రజల్లో తగ్గుతున్న విశ్వసనీయత : సంజయ్ బారు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రధాన స్రవంతి మీడియా పట్ల ప్రజలలో విశ్వసనీయత తగ్గుతోందని మాజీ ప్రధాన మంత్రి దివంగత మన్మోహన్‌సింగ్ మీడియా సలహాదారు, సీనియర్ జర్నలిస్టు సంజయ్ బారు అన్నారు. ‘‘ద వైర్’’ తెలుగు వెబ్‌సైట్‌ను హైదరాబాద్, బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో సోమవారం సంజయ్ బారు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ‘‘ద వైర్’’ తెలుగు వెబ్‌సైట్ ఎడిటర్ కొండూరి వీరయ్య సభాధ్యక్షత వహించగా, విశిష్ట అతిథులుగా ది వైర్ వ్యవస్థాపకులు సిద్ధార్థ వరదరాజన్, వ్యవస్థాపక సంపాదకులు ఎం.కె వేణు, సంపాదకులు సీమా చిస్తి, అతిథులుగా రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్, అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రియాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ బారు మాట్లాడుతూ నాటి ఎమర్జెన్సీ రోజుల కంటే ప్రస్తుత కాలంలోనే వంద మందికి పైగా జర్నలిస్టులు తమ ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన మీడియా సంస్థల అంచనాలు తప్పాయని, స్వతంత్ర జర్నలిస్టులు, పలు వేదికలు ఇచ్చిన అంచనాలు దగ్గరగా ఉన్నాయన్నారు. స్వతంత్ర జర్నలిస్టుల ఆధ్వర్యంలో కొనసాగే వెబ్‌సైట్‌కు ప్రజ మద్దతు దక్కుతుందని, కొన్ని వెబ్‌సైట్ల పట్ల విశ్వసనీయత ఉంటుందన్నారు. సిద్ధార్థ వరద రాజన్ మాట్లాడుతూ కనీసం మీడియా సమావేశాలను కూడా నిర్వహించని ఏకైక ప్రధానమంత్రి మోదీ ఒక్కరే అని ఎద్దేవా చేశారు. దేశంలో ప్రభుత్వ, రాజకీయ పార్టీల అనుకూల మీడియా సంస్థలు ఉన్నాయని ఆరోపించారు. వైర్ వెబ్‌సైట్ పూర్తిగా ప్రజల మద్దతుతోనే కొనసాగుతోందని వివరించారు. పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ దేశ మౌలిక విలువలపైన గత వందేళ్లుగా దాడి జరుగుతోందన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందని, డాలర్ విలువ తగ్గుపోతుందని, భారతదేశ పౌర సత్వాన్ని వదులుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నకిలీ వార్తలను ఒక ఆర్మీ ద్వారా నిర్వహిస్తున్నారన్నారు. ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో 75 ఏళ్లుగా అగ్రవర్ణాల చేతుల్లోనే అధికారం ఉన్నదని, ఎక్కువ శాతం మీడియా సంస్థలు కూడా వారి చేతుల్లోనే ఉన్నాయన్నారు. యూట్యూబ్ ఒక వ్యాపారంగా మారిందని, ప్రజా సమస్యలు, వాస్తవ అంశాల ఆధారంగా పని చేసే డిజిటల్ మీడియా సంస్థలు మరిన్ని రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. రియాజ్ మాట్లాడుతూ గతంలో విద్యార్థులు భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న నాయకులను ఆదర్శంగా, స్ఫూర్తిగా తీసుకునేవారని, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఆ నాయకుల పేర్లను కూడా ప్రస్తావించే పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. సీమా చిస్తి మాట్లాడుతూ ప్రస్తుతం మీడియాలో ఎక్కువగా సినిమా, నేరాలు, క్రీడా రంగాలతో ఒక ఎంటర్‌టైన్‌మెంట్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## హైదరాబాద్‌కు గోవా మద్యం..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గోవా నుంచి హైదరాబాద్‌కు మద్యం వ్యాపారం జోరుగా సాగుతుంది. ఇటీవలే ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గోవా నుంచి రైలులో తెస్తున్న మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన జరిగి 24 గంటలు గడవక ముందే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గోవా నుంచి వచ్చిన వాస్కోడిగామా రైలులో ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో సోమవారం తనిఖీలు చేయగా 82 గోవా మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. పట్టుకున్న మద్యం విలువ రూ.2 రెండు లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. మద్యం పట్టుకున్న ఎస్‌టిఎఫ్ టీమ్‌లను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టర్ వివి కమలహాసన్ రెడ్డితో పాటు అడిషనల్ ఎస్‌పి భాస్కర్, డిఎస్‌పిలు శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్ అభినందించారు.

# మెట్రో రైల్‌తో ‘ఓల్డ్ సిటీ’కి మహర్దశ

ప్రభావిత ఆస్తుల యజమానులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మెట్రో ఎం.డి.ఎన్‌విఎస్ రెడ్డి
మెట్రో నిర్మాణానికి మనఃస్ఫూర్తిగా సహకరిస్తాం : ఎంపి అసదుద్దీన్ ఒవైసీ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు కీలకమైన అడుగులు పడ్డాయి. ఎంజిబిఎస్ చాంద్రాయణ గుట్ట మార్గంలో ప్రభావిత 34 ఆస్తులకు సంబంధించిన 41 మంది యజమానులకు రూ. 20 కోట్ల నష్టపరిహారాన్ని ప్రభుత్వం సోమవారం చెల్లించింది. లక్డీకాపూల్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం చెక్కుల పంపి ణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ, హెచ్ఎంఎల్ ఎం.డి.ఎన్‌విఎస్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిసెట్టి పాల్గొన్నారు. పాతనగరంలో మెట్రో రైల్ నిర్మాణం కోసం ఆస్తులు కోల్పోయిన వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సముచితమైన రీతిలో నష్టపరిహారాన్ని చెల్లిస్తున్నామని, ఈ ప్రక్రియలో ఎంపి అసదుద్దీన్ ఒవైసీ సూచనలను పరిగణలోకి తీసుకున్నామని ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు.

**చార్మినార్ పరిసరాల్లో స్కైవాక్‌ల నిర్మాణం..**

మొదటి దశ కన్నా మరిన్ని సౌకర్యాలతో రెండో దశ నిర్మాణం చేపట్టనున్నామని, దీనిలో పాతనగరం రూపురేఖలు మరనున్నాయన్నారు. ఎంపి సూచనల మేరకు మెట్రో స్టేషన్‌ల నుండి చార్మినార్, లాడ్ బజార్, సాలార్ జంగ్ మ్యూజియం వంటి పర్యాటక ప్రాంతాలకు స్కై వాక్, ఫుట్ పాత్ మొదలైన అధునాతన సౌకర్యాలు సమకూరుస్తామని వెల్లడించారు. పాత నగరం ఇంకా అభివృద్ధి జరగాలని సిఎం ఆకాంక్ష అన్నారు. అందుకు తగ్గట్టుగా మెట్రోను పాతనగర వాసులకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మొత్తం రు.2,741 కోట్ల అంచనా వ్యయంతో ఏడున్నర కిలోమీటర్ల పాతనగరం మెట్రోను నాలుగేళ్లలో పూర్తి చేయాలన్న సిఎం సంకల్పాన్ని నెరవేర్చడానికి సన్నద్ధం అయ్యామన్నారు. నాంపల్లిలో అధునాతన మల్టీ లెవెల్ పార్కింగ్ ప్రాజెక్టు కూడా వచ్చే నెలలో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని, ఇది కూడా పాతనగర అభివృద్ధికి ముఖద్వారం అవుతుందన్నారు.

**నిర్వాసితులకు వ్యాపారాలకు అవకాశం ఇవ్వాలి: అసదుద్దీన్ ఓవైసీ..**

ఎంపి ఒవైసీ మాట్లాడుతూ ఎంతో కాలంగా ఓల్డ్ సిటీ వాసులు ఎదురు చూస్తున్న మెట్రో రైల్ ఇప్పుడు ఆచరణలోకి రావడం ప్రశంసనీయమని, ఇందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మెట్రో ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి చేస్తున్న కృషికి తాము సహకరిస్తామని హామీనిచ్చారు. ప్రతిపాదిత మీరాలం మండీ, చార్మినార్ స్టేషన్‌ల వద్ద స్కై వాక్‌లను నిర్మిస్తే పర్యాటక పరంగానే కాకుండా స్థానికులకు కూడా సౌలభ్యంగా ఉంటుందని ఆయన సూచించారు. నిర్వాసితులకు, రాబోయే మెట్రో స్టేషన్ల వద్ద వ్యాపారాలు పెట్టుకోడానికి తగు ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా ఒవైసీ విజ్ఞప్తి చేశారు.

**లాభాదాయకమైన నష్టపరిహారం ఇస్తున్నాం : జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మెట్రో రైల్ ప్రాజెక్టు కోసం ముందుకు వచ్చిన నిర్వాసితులకు లాభదాయకమైన నష్టపరిహారాన్ని నిర్ణయించామని, దీనిని అందరు ఆహ్వానించారని తెలిపారు. మొత్తం 1100 ఆస్తులకు సుమారు రూ.1,000 కోట్ల నష్టపరిహారం చెల్లించనున్నామని, ఇందుకు స్థానికులు తమకు పూర్తిగా సహకరిస్తున్నారని జిల్లా కలెక్టర్ చెప్పారు. మెట్రో రైల్ భూ సేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్ కె.స్వర్ణలత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
డిప్యూటీ డైరెక్టర్, యుబిడి, సికింద్రాబాద్ జోన్.

Short NIT No.940&885/UBD/Sec-bad Zone/GHMC/2024-25 ‘ఇ’ ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 06.01.2025

**క్ర.సం.1, NIT No.** 940/UB/GHMC/2024-25, **పనుల సంఖ్య:** 1 పని, **అంచనా విలువ:** రూ.4.43 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం :** బిడ్ దాఖలుకు ప్రారంభ తేదీ & సమయం: 07.01.2025న ఉ.11.30గం.ల నుండి, బిడ్ దాఖలుకు ఆఖరి తేదీ & సమయం: 10.01.2025 నుండి ఉ.11.30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** డిప్యూటీ డైరెక్టర్, యుబిడి, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి. సెల్: 7207923113. **క్ర.సం.2, NIT No.** 885/UB/GHMC/2024-25, **పనుల సంఖ్య:** 1 పని, **అంచనా విలువ:** రూ.3.38 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం :** బిడ్ దాఖలుకు ప్రారంభ తేదీ & సమయం: 07.01.2025న ఉ.11.30గం.ల నుండి, బిడ్ దాఖలుకు ఆఖరి తేదీ & సమయం: 16.01.2025 నుండి ఉ.11.30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** డిప్యూటీ డైరెక్టర్, యుబిడి, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి. సెల్: 7207923113. **మొత్తం: 2 పనులు, రూ.7.81 లక్షలు.** మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/– డిప్యూటీ డైరెక్టర్, యుబిడి, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 8711-PP/CL/ADVT/1/2024-25, Date: 06-01-2025

**శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం - కాళేశ్వరం**
మహాదేవపూర్ మండలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.

Rc.No. 1/2025 తేది: 06.01.2025

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా! శ్రీయుత కమీషనర్, దేవాదాయ శాఖ, తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ వారి ఉత్తర్వులు Memo.No. F5/16852/2024 తేదీ 30.12.2024 ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం నందు ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 20 రోజుల అనంతరము దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టం 30/ 1987 (సవరించబడిన చట్టం 33/2007 ననుసరించి) సెక్షన్ 15, ఉప సెక్షన్ 1 కి లోబడి వంశపారంపర్యం కాని ధర్మకర్తల మండలి నియమించబడును. కావున ఆసక్తి గల అభ్యర్థులు ధర్మకర్తగా నియామకం కొరకు వారి దరఖాస్తులను సెక్షన్ 17 నందలి ఉప సెక్షన్ (3) ననుసరించి నిర్ణీత ప్రొఫార్మా (ఫారం II) లో ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 20 రోజుల లోపు శ్రీయుత సహాయ కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ వారికి పంపవచ్చును.

సం/- కమీషనర్, దేవాదాయ శాఖ, హైదరాబాద్.
DIPR R.O. No. : 8693-PP/CL/ADVT/1/2024-25, Date: 06-01-2025

**శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానము**
మట్టపల్లి మహాక్షేత్రము, మఠంపల్లి మండలము, సూర్యాపేట జిల్లా.

లేఖ నెం.29/యస్.యల్.యన్.యస్.డి/2024, టెండర్ కం బహిరంగ వేలముల ప్రకటన తేది:04-01-2025.

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలములు ది:11-01-2025 శనివారము రోజున ఉ. గం.10-00లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి | కాలపరిమితి |
|---|---|---|---|
| 1 | కొబ్బరికాయలు అమ్ముకొను హక్కు | 3,00,000/- | 12-01-2025 నుండి 11-01-2026 వరకు |
| 2 | కొబ్బరిచిప్పలు సేకరించుకొను హక్కు | 1,00,000/- | 01-03-2025 నుండి 28-02-2026 వరకు |

కావున పైన తెలిపిన టెండర్ - కం - బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ 9703662667 సంప్రదించగలరు.

ఇట్లు, చెన్నూరు విజయ్‌కుమార్, అనువంశిక ధర్మకర్త
ఇట్లు, సిరికొండ నవీన్, కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 8688-PP/CL/ADVT/1/2024-25, Date: 06-01-2025

ప్రజాపక్షం
మంగళవారం, జనవరి 07

## ఇతను గవర్నర్‌గా తగునా?

తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి పదవీ బాధ్యతలు చేబట్టిన 2021 సెప్టెంబర్ నుంచి ఆయన తీరును గమనిస్తే తమిళనాడు ప్రభుత్వంతో ఘర్షణద్వారా ఢిల్లీలోని తమ యజమానులను సంతృప్తిపరచటమే పనిగా పెట్టుకున్నట్లు భావించాల్సి వస్తోంది. తమిళనాడు అసెంబ్లీ సాంప్రదాయాన్ని అగౌరవపరుస్తూ, సభలో జాతీయ గీతాలాపన అంశంపై సోమవారం తాజా వివాదానికి పాల్పడ్డారు. గవర్నర్లు రాజ్యాంగ ఆదేశం ప్రకారం సంవత్సరారంభంలో అసెంబ్లీ తొలి సమావేశం మొదటిరోజున సాంప్రదాయక ప్రసంగం చేసే నిమిత్తం అసెంబ్లీకి వస్తారు. వారి ఆగమనం, నిష్క్రమణ సమయంలో సర్వసాధారణంగా జాతీయ గీతాలాపన జరుగుతుంది. అయితే తమిళనాడు అసెంబ్లీ సాంప్రదాయం ప్రకారం తొలుత తమిళనాడు రాష్ట్రగీతం, గవర్నర్ ప్రసంగం ముగిసిన తదుపరి జాతీయగీతం ఆలాపించబడతాయి. గవర్నర్ రవి 2024 ఫిబ్రవరి 12న జాతీయగీతం ఆలాపనకోసం వేచిఉండకుండా సభ నుంచి వెళ్లిపోయారు. కాగా 2025 జనవరి 6వ తేదీన, తమిళనాడు అసెంబ్లీలో జాతీయ గీతానికి అగౌరవంగా ఆరోపిస్తూ సభ నుండి వెళ్లిపోయారు. ఏమిటి ఉద్దేశం? తమిళ ప్రజలు, లెజిస్లేటర్లు దేశ వ్యతిరేకులన్న భావం ఆపాదించదలిచారా? తమిళనాడు అసెంబ్లీ సాంప్రదాయాన్ని అగౌరవపరచటం అమర్యాద కాదా? ఇది రవిగారికోసం జరిగిన ఏర్పాటు కాదే! ఆయనకన్నా ముందు ఎందరో గవర్నర్లు వచ్చారు, పోయారు. వారెవరూ ఇటువంటి అవివేక రచ్చ సృష్టించలేదే! దేశ రాజకీయాలు సున్నితమైన దశలో ఉన్నాయి. ఇతర సమూదాయాలకు వ్యతిరేకంగా హిందువుల ఐక్యతను కోరుతున్న బిజెపి హిందూత్వ రాజకీయాలకన్నా దేశ ఐక్యత ముఖ్యం. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారుచేతనైతే జాతీయైక్యతను ప్రోదిచేసేందుకు తోడ్పడాలికానీ బలహీన పరచరాదు. సోమవారం తమిళనాడు అసెంబ్లీలో గవర్నర్ సాంప్రదాయక ప్రసంగం చదవకుండా, జాతీయ గీతాలాపన అంశంపై గొడవతో సభనుండి నిష్క్రమించటం ఎవరికి తోడ్పడుతుందో ఆయన ఆలోచించాలి. డిఎంకె ప్రభుత్వంతో అదేపనిగా వివాదాలకు దిగుతూ కేంద్రం–రాష్ట్ర సంబంధాల్లో చిక్కులు తయారైన గవర్నర్ రవిని రాష్ట్రపతి వెనక్కు పిలవాలి. జాతీయగీతం అంశంపై డిఎంకె ప్రభుత్వంతో గొడవపడటం రవికి ఇది మొదటిసారికాదు. 2024 ఫిబ్రవరిలో తమ సాంప్రదాయక ప్రసంగం చదవకుండానే నిష్క్రమించారు. కారణం? తొలుత, చివరలో జాతీయ గీతం వినిపించాలన్న డిమాండ్‌తో పాటు, ఆ ప్రసంగంలో అసత్యాలతో కూడిన తప్పుత్రోవ పట్టించే క్లెయిములతో కూడిన పేరాలు ఉన్నాయని అభ్యంతరం చెప్పారు. అది రాష్ట్ర మంత్రివర్గం రూపొందించిన ప్రసంగం. తన ప్రభుత్వం చేసిన కృషిని దాన్ని చదవటమే ఆయన బాధ్యత తప్ప చదవటాన్ని నిరాకరించే హక్కు లేదు. కొందరు గవర్నర్లు అవాంఛనీయంగా ఉన్నట్టున్న ప్రసంగంలోని అంశాలతో తీవ్రమైన విభేదాలున్నప్పుడు తొలి వాక్యం...చివరివాక్యం చదువుతున్నారు. చదివినట్లుగా సభ పరిగణిస్తుంది. ఆ ప్రసంగానికి గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని సభ ఆమోదిస్తుంది, అది సభ రికార్డుల్లో భాగమవుతుంది. అసలు చదవకపోవటం రాజ్యాంగ ప్రక్రియను ధిక్కరించటం.

> దేశ రాజకీయాలు సున్నితమైన దశలో ఉన్నాయి. ఇతర సముదాయాలకు వ్యతిరేకంగా హిందువుల ఐక్యతను కోరుతున్న బిజెపి హిందూత్వ రాజకీయాలకన్నా దేశ ఐక్యత ముఖ్యం. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు చేతనైతే జాతీయైక్యతను ప్రోదిచేసేందుకు తోడ్పడాలికానీ బలహీన పరచరాదు.

గవర్నర్ రవి 2023 ప్రసంగంలో చదవకుండా దాటవేసిన పదాల్లో "సెక్యులరిజం", "ఆత్మ గౌరవం" పదాలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ద్రవిడ నాయకులకు సంబంధించిన భాగాలున్నాయి. ప్రభుత్వంతో అనవసరపు వివాదాలు ఆయనకు సరదాలాగా ఉంది. రాజీవ్‌గాంధీ హత్య కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న ఎజి పెరివాలన్ రిమిషన్ అందులో ఒకటి. అటువంటి ప్రయత్నం దేశ "ఫెడరల్ స్వరూపం మూలాలపైనే దాడి" అని సుప్రీంకోర్టు 2022 ఏప్రిల్‌లో పేర్కొన్నది. ఆయన గవర్నర్‌గిరీ తొలి సంవత్సరంలోపే – తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన 21 బిల్లులకు 2022 మే 31నాటికి ఆమోద ముద్ర వేయకుండా పెండింగ్‌లో పెట్టారు. పాలకపార్టీ గత 50 సంవత్సరాలుగా అభివృద్ధి నిరోధకంగా ఉంటున్నదని 2023 జనవరిలో నిందించారాయన. అంతేనా తమిళనాడుకు "తమిళగం" సరైన పేరు అంటూ పెద్ద వివాదానికి హేతువైనాడు. దీన్ని డిఎంకె విమర్శించగా, బిజెపి స్వాగతించింది. వాటినిబట్టి చూస్తే ఆయన రాజకీయాలకు నిదర్శనం. మోదీ ప్రభుత్వం బిజెపియేతర రాష్ట్రాల్లో తమ స్వార్థరాజకీయాలకోసం గవర్నర్లను దుర్వినియోగం చేస్తున్నదని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణను తమిళనాడు గవర్నర్ చేష్టలు ధృవీకరించటం లేదా!

# విప్లవోద్యమ చోదకశక్తి సిపిఐ



చాడ వెంకటరెడ్డి
సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

ప్రపంచంలో చైనా తర్వాత రెండవ అధిక జనాభా కలిగిన పెద్ద దేశం భారతదేశం. ఇక్కడ 550 సంస్థానాలపైబడిన వాటిలో పాలన బ్రిటిష్‌వారి పెత్తనం క్రింద సాగుతుండేది. అనేక సంస్థానాలలో అక్కడి అణచివేతలపై తిరుగుబాట్లు జరుగుతుండేవి. పరిశ్రమలు ఏర్పడిన పిదప కార్మికులు సంఘాలు పెట్టుకున్నారు. 1920లో ఎఐటియుసి స్థాపించబడింది. అప్పటికి దేశానికి స్వాతంత్ర్యం లేదు. కాని 1857 సిపాయిల తిరుగుబాటుతో స్వాతంత్ర్యసంగ్రామానికి అడుగులు పడ్డాయి. దీన్ని భారత్‌లో ప్రథమ స్వాతంత్ర్య పోరాటంగా కారల్ మార్క్స్ అభివర్ణించారు. స్వాతంత్ర్యసాధనకై కాంగ్రెస్ స్థాపించబడింది. అది పార్టీకాదు, భారతీయులలో నెలకొన్న అసమ్మతి, అసంతృప్తిని వెళ్లగక్కేందుకు ఎ.ఒ.హ్యూమ్ ఆధ్వర్యంలో ఒక వేదికగా రూపొందించబడింది. అప్పటికే మరోవైపున కామ్రేడ్స్ కమిటీ, అభ్యుదయ భావాలకు చెందిన వారు చిన్నచిన్న సంఘాలుగా ఏర్పడ్డారు.

అట్టి సంక్లిష్ట పరిస్థితులలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం, రష్యా విప్లవం వెలుగులో 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూరులో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) స్థాపించబడింది. అది మార్క్సిజం–లెనినిజం సిద్ధాంత పునాదులపైన స్థాపించబడినందున అంతరాలు లేని వర్గరహిత సమాజ నిర్మాణం లక్ష్యం గా ఉద్యమాలకు శ్రీకారం చుట్టింది. అదే సంవత్సరంలో ఆర్. ఎస్.ఎస్ కూడా ఏర్పడింది. దాని లక్ష్యం హిందురాజ్యం స్థాపించడం, ముస్లింలను వెళ్ళగొట్టడం. దాని ఎజెండా అదొక్కటే. స్వాతంత్ర్య పోరాటంలో దాని పాత్రలేదు. ఇది నగ్నసత్యం. కాంగ్రెస్, సోషలిస్టు పార్టీల పాత్ర గమనంలోకి తీసుకోవాలి. అయితే దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదట పిలుపిచ్చింది సిపిఐ మాత్రమే.

పార్టీ స్థాపించబడగానే ఆనాటి ముఖ్యనాయకులందరిపై బ్రిటీష్ ప్రభుత్వం కాన్పూరు, మీరట్ కుట్ర కేసులు పెట్టి సంవత్సరాల తరబడి జైళ్లల్లో నిర్భంధించింది. సగటున ఒక్కొక్క నాయకుడు 9 సంవత్సరాల పైబడి జైల్లో మగ్గారు. సిపిఐ ఆరంభంలో అనేక ఆటుపోట్లకు గురి అయ్యింది. అనేక సంస్థానాలలో నెలకొన్న రాచరిక వ్యవస్థ అణచివేతలను ఖండిస్తూ ప్రత్యక్ష ఆందోళనకు పూనుకోవడం కత్తి మీద సాము లాగానే కొనసాగింది. అనేక సంస్థానాలలో తిరుగుబాట్లు సాగాయి. బ్రిటిష్ వారికి సంస్థానాధీశులు కప్పం చెల్లిస్తారు కాబట్టి వారికి అవసరమైన మిలిటరి అండదండలు అందించారు. ప్రధానంగా మన తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలో ప్రఖ్యాతిగాంచింది. తెభాగా. పున్నప్ర–వాయిలర్ ఆ కోవలోనివే. అనేక చోట్ల కార్మికులు, కూలీలు, రైతులు స్వేచ్ఛ, హక్కుల సాధనకై విజృంభించారు. ప్రాణాలకు తెగించి పోరాటాలు చేసారు.

తెలంగాణలో భూమి, భుక్తి, విముక్తికై సాగిన సాయుధ పోరాటం అపూర్వం. బాహ్యప్రపంచానికి తెలియని అనేక ఘటనలు, ఉదంతాలు సాయుధ పోరాటంలో చేసుకున్నాయి. ఈ దేశంలో భూకేంద్రీకరణను బద్దలుకొట్టి దున్నేవానికి భూమి పంపిణీ ఆవశ్యకతను జాతీయ ఎజెండాలోకి తెచ్చింది, వెట్టిచాకిరీ రద్దు, తెలంగాణకు స్వాతంత్ర్యం తెచ్చిందీ తెలంగాణ పోరాటమే. స్వాతంత్ర్య పోరాటంలో సిపిఐ మిలిటెంట్ పాత్ర పోషించింది, త్యాగాలకు నిలయమైంది. లాఠీ, తూటాలకు గురైందీ, జైళ్లలో ఎక్కువ కాలం ఉందీ, ఎక్కువ మంది శిక్షలు అనుభవించింది కమ్యూనిస్టు పార్టీ నాయకులు మాత్ర మే.

1952లో జరిగిన సాధారణ ఎన్నికలలో తెలంగాణ నాయకులందరూ జైళ్లలో ఉండటంతో కొంతమంది జైల్లో నుండి నామినేషన్ వేసారు. తెలంగాణ సంస్థానంలో 16 జిల్లాలుండేవి. 8 తెలంగాణ, 5 కర్నాటక, 3 మహారాష్ట్రలో ఉండేవి. మొత్తం 16 జిల్లాల పరగణ. అప్పుడు తెలంగాణలో ఎక్కువమంది సిపిఐ ఎం.ఎల్.ఎ.లు గెలిచినప్పటికీ మిగతా రెండు ప్రాంతాలలో తక్కువ మంది గెలిచినందువలన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం సాధ్యపడలేదు.

పార్లమెంట్ ఎన్నికలలో చాలా చోట్ల పార్టీ గెలిచింది. భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి కామ్రేడ్ రావినారాయణ రెడ్డి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కంటే ఎక్కువ ఓట్లతో గెలిచారు. అందుకే కామ్రేడ్ రావి నారాయణ రెడ్డి గారితోనే తొలి పార్లమెంటులోకి తొలి అడుగు వేయించారు నెహ్రూ. అప్పటి త్యాగాలు, పోరాటాలు ప్రజల హృదయాల్లో స్థానం పొందాయి.

### రాజ్యాంగం అమలుతీరు

1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత 1949 నవంబర్ 26న రాజ్యాంగ ముసాయిదా ఆమోదించబడింది. అందులో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రధానపాత్ర పోషించారు.




1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అయితే నాటి పాలకులు కూడా అనేక ఉల్లంఘనలకు పాల్పడ్డారు. తొలి ప్రభుత్వంలో ప్రతిపక్ష ప్రభుత్వాలను పడగొట్టటం లాంటి దుర్మార్గాలకు ఒడిగట్టారు. ప్రపంచంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ద్వారా కేరళలో ఎన్నికైన తొలి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని రద్దు చేశారు. ఆ తర్వాత అనేక సందర్భాల్లో మరెన్నో రాష్ట్ర ప్రభుత్వాలను రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించారు. ఇప్పుడు మోదీ ప్రభుత్వం దాడి నుండి రాజ్యాంగాన్ని రక్షించుకోవటం ప్రధాన కర్తవ్యంగా ముందుకు వచ్చింది.

దున్నేవాడికే భూమి అనే నినాదం ఉధృతరూపం దాల్చడంతో పాలకులకు భూ సంస్కరణల చట్టాలు తేకతప్పలేదు. 1970 తర్వాత సిపిఐ దేశ వ్యాపితంగా భూ పోరాటాలు ఉధృతం చేసింది. దొంగ నిల్వలకు వ్యతిరేకంగా గోదాంలపై దాడులు చేయబడ్డాయి. ప్రజల మాన, ప్రాణాల రక్షణకై సిపిఐ ప్రజలకు రక్షణ కవచమైంది. స్వాతంత్ర్యం సిద్ధించిన పిదప కూడా రాజులకు రాజభరణాలు చెల్లించబడేవి. రాజభరణాల రద్దుకై ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేయడంతో కేంద్ర ప్రభుత్వం రాజభరణాల రద్దుకు చట్టం చేసింది. పెట్టుబడిదారుల చేతుల్లో ఉన్న బ్యాంకులను జాతీయం చేయాలనే ఉద్యమం ఉధృత రూపం దాల్చడంతో ఇందిరాగాంధీ 1969లో తొలుత 14 బ్యాంకులను జాతీయం చేశారు. పర్యవసానంగా నిరుపేదలకు ఎస్.సి., బి.సి., బడుగుబలహీనవర్గాలకు అప్పులిచ్చే నిబంధనలు రూపొందించబడినాయి.

బ్యాంకుల జాతీయాకరణ జరిగి అవి శాఖోపశాఖలుగా విస్తరించి సామాన్యులకు సైతం సేవలందిస్తున్నాయంటే సిపిఐ, బ్యాంకు ఉద్యోగుల నిరంతర పోరాటాలే కారణం. గత మూడు దశాబ్దాల్లో సరళీకరణ పేరుతో తూట్లు పొడుస్తున్నారు పాలకులు. 1975 తర్వాత నుండి సంక్షేమ పథకాల అమలు ప్రక్రియ ప్రారంభించబడింది. ఎస్సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌లు అమలులోకి వచ్చాయి. ఈ మధ్య అవి కూడా నేరుగా అమలు కావడం లేదు.

ప్రజలలో రాజకీయ, సామాజిక చైతన్యాన్ని పెంపొందించటానికి సిపిఐ విశేషకృషి చేసింది. అనేక ఆటుపోట్లు, కష్టాలు, కడగండ్లు, అణచివేతలు, నిర్బంధాలు ఎదురైనప్పటికీ, కమ్యూనిస్టు ఉద్యమంలో చీలికలతో ఉద్యమం బలహీనపడినా నిరాశానిస్పృహలకు గురికాకుండా ప్రజల మధ్య ఉంటూ ప్రజా ఉద్యమాలు నిర్మించడానికి నిరంతరం పాటుపడుతున్నది.

### 2014లో అధికారం చేపట్టిన మోడీ తీరు

కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన తరువాత రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతూ కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేస్తున్నది. నల్లడబ్బు వెలికి తీస్తానన్న హామీ నీటి బుగ్గలాగానే ఉండిపోయింది. ఒకే పన్ను ఒకే దేశమని ప్రగల్భాలు పలికి జిఎస్‌టిని తెచ్చి, పరోక్షంగా కేంద్ర సుంకాలు, సెస్సుల పేర్లతో ట్యాక్స్‌లు సేకరించుకుంటున్నది. రాష్ట్రాల హక్కులను హరిస్తున్నది. ఇప్పుడేమో ఫెడరల్ భావనకు వ్యతిరేకంగా ఒకే దేశం ఒకే ఎన్నికలు అని జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగ సవరణకు పూనుకుంటున్నది.

కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాలంటే ఇదేదో కేవలం కమ్యూనిస్టు పార్టీ శ్రేణులకే పరిమితం కాదు. భారత దేశ స్వాతంత్ర్యానికి పూర్వం ఏర్పడి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన సమరయోధులను దేశానికి అందించిన పార్టీ ఇది. దేశ చరిత్రతో, చారిత్రక సంఘటనలతో కమ్యూనిస్టు పార్టీ చరిత్ర పెనవేసుకొని ఉన్నది.

భూ సంస్కరణల చట్టాలు, పేదలకు భూమి పంపిణీ చేయడం, సమాచార హక్కు, అటవీ హక్కుల చట్టం, మెరుగైన భూ సేకరణ చట్టం, గ్రామీణ ఉపాధి హామీ హక్కు చట్టం, ఇలాంటి ప్రగతిశీల చట్టాలు, పథకాలు కేవలం ప్రభుత్వాల మనసులో నుంచి వచ్చిన ఆలోచనలు కాదు. అవి చట్టరూపం తీసుకునేందుకు కమ్యూనిస్టు పార్టీ, ప్రజాసంఘాల పోరాటాలు భూమిక అనేది వాస్తవం. కమ్యూనిస్టు పార్టీ దేశంలో గణనీయమైన ప్రభావశాలి అనేది నిస్సందేహం. వామపక్షాల మద్దతుతో ఏర్పడిన నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్, యుపిఏ 1 ప్రభుత్వాలు ప్రజానుకూల చట్టాలు, పథకాలు తీసుకురాడమే ఇందుకు నిదర్శనం.

సిపిఐకి వెన్నుదన్నుగా లక్షలాది ప్రజానీకం ఉన్నది. పార్టీ దేశ వ్యాపితంగా విస్తరించి తన శైలిలో ఉద్యమాలు, పోరాటాలు నిర్మిస్తున్నది. అయితే ప్రజాప్రాతినిధ్యం తగ్గిందని ఇతర బూర్జువాపార్టీలు, వర్గశత్రువులు చిన్నచూపు చూస్తుంటారు. అటువంటివారికి మన పోరాటాలే జవాబు కావాలి. చట్టసభల్లో ప్రాతినిధ్యం పెంచుకోవటానికి కేంద్రీకరించి పనిచేయాలి.వర్గరహిత, సమసమాజ సాధనకై పునరంకితం కావడం పార్టీ సభ్యుల సానుభూతిపరుల లక్ష్యం కావాలి.

---

## రేట్లపెంపు ఒప్పంద హామీకి..

# హమాలీల సమ్మె ఉధృతం

పౌరసరఫరాల గోదాములలో పనిచేస్తున్న హమాలీలను కొత్త సంవత్సరం నుండి సమ్మెలోకిదించింది ప్రభుత్వమే! గత అక్టోబర్ 4న హమాలీ రేట్లు పెంపుకు హమాలీ కార్మిక సంఘాలతో ఒప్పందం కుదుర్చుకొని నేటికీ అమలు చేయకపోవడంతో కొత్త సంవత్సరం జనవరి 1 నుండి గత్యంతరం లేని పరిస్థితిలో హమాలీలు సమ్మెలోకి దిగారు. తక్షణమే పెంచిన రేట్లు అమలు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

తెలంగాణ రాష్ట్రంలో పౌర సరఫరాల సంస్థ బియ్యం సరఫరా187 మండల పాయింట్ల ద్వారా 17,335 రేషన్ షాపులకు సరఫరా చేస్తున్న గోదాములలో సుమారు 3,600 మంది హమాలీలు పనిచేస్తున్నారు. రాష్ట్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్లలో పని చేస్తున్న హమాలీల రేట్లను రెండేళ్లకు ఒకసారి పెంచేందుకు ఒప్పందం ఉంది. ఈ ఒప్పందం ప్రకారం గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం, అంతకుముందు కాంగ్రెస్ ప్రభుత్వం హమాలీ రేట్ల పెంపు ప్రక్రియను కొనసాగిస్తూ వస్తున్నారు. అందుకు అనుగుణంగా 2022 వరకు రేట్లు పెంపు ప్రక్రియ కొనసాగిం ది. ఎంఎల్ఎస్ పాయింట్లకు వచ్చే బియ్యాన్ని దించడానికి, అక్కడి నుంచి రేషన్ దుకాణాలకు తరలించడానికి హమాలీలకు క్వింటాలుకు రూ.26 లెక్కన కూలి చెల్లిస్తున్నారు. ఈ రేట్లను 2024 లో సవరించాల్సి ఉండగా ప్రభుత్వం మారడంతో కాలయాపన జరుగుతూ వచ్చింది. హమాలీ కార్మిక సంఘాల ఆందోళనల మేరకు ఎట్టకేలకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ శ్రీ చౌహాన్ వద్ద జరిగిన సమావేశంలో కూలిరేట్లను పెంచేందుకు హమాలీ సంఘాల నాయకులతో ఒప్పందం కుదిరింది. అయితే అందుకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల కాకపోవడంతో డిసెంబర్ 18న హమాలీలు పౌరసరఫరాల శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆ సందర్భంగా రేట్లు పెంపుదలకు అంగీకరించిన ఫైలు సర్కులేషన్ లో ఉందని తొందర్లో జీవో విడుదల చేసి అమలు చేస్తామని హామీ ఇచ్చారు. నెలాఖరులోగా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ కాకుంటే జనవరి ఒకటి నుంచి సమ్మెలోకి వెళ్తామని హమాలి సంఘాల జెఎసి సమ్మె నోటీసు ఇవ్వటం జరిగింది. గత ఏడాది డిసెంబర్ 28న మరోసారి ఎగుమతి–దిగుమతులు జనవరి 1 నుండి పెంచిన రేట్లు అమలు కాకపోతే పనులు నిలుపుదల చేస్తామని సమ్మె నోటీసు ఇచ్చా రు.

**5 రోజులుగా కొనసాగుతున్న హమాలీల సమ్మె :** రేట్లు పెంపు ఉత్తర్వులు కొత్త ఏడాదిలోను విడుదల కాకపోవడంతో జనవరి 1వ తేదీ నుంచి హమాలీల జెఎసి సంఘాలు ఎఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు సమ్మెలో దిగినట్టు ఎఐటియుసి హమాలీ కార్మిక సంఘం అధ్యక్షులు జి. మునీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ ప్రకటించారు. రాష్ట్రంలో గత నాలుగు రోజులుగా పూర్తిస్థాయి సమ్మె కొనసాగుతుంది. అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్ ఉమ్మడి జిల్లాలలో పూర్తిస్థాయిలో హమాలీలు సమ్మెలో ఉన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పాక్షికంగా సమ్మె జరుగుతోందని. సమ్మె చేస్తున్న హమాలీలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు సంఘీభావం తెలుపుతున్నాయి. జనవరి ఒకటి నుండి గోదాముల వద్ద నిరసన తెలుపుతున్నారు.

**నేడు కలెక్టరేట్ల ముట్టడి :** సమ్మె ఉధృతంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్లవద్ద నిరసన , ధర్నాలు చేపడుతున్నట్టు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు ప్రకటించారు. కొత్త సంవత్సరం రేషన్ బియ్యం కోసం పేదలు పడిగాపులు పడుతున్నారు. స్టేజి 1 గోదాముల నుంచి జిల్లాలలోని మండల స్థాయి స్టాక్( ఎం ఎల్ ఎస్ ) పాయింట్లకు బియ్యంలారీలు వచ్చినప్పటికీ ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యం దిగుమతి హమాలీలు సమ్మె కారణంగా బియ్యం దిగుమతి కాక, అక్కడి నుండి గ్రామాలలోని షాప్స్‌కు చేరడం లేదు.

అదేవిధంగా పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి బియ్యం సరఫరా కావాల్సి ఉంది. రాష్ట్రంలో ఉన్న అన్ని రెసిడెన్షియల్ స్కూల్సుకు, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలలకు కూడా బియ్యం సరఫరా కావాల్సి ఉంది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ సమక్షంలోనే జరిగిన ఒప్పందం.. అమలు కాకపోవటం.. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మాత్యులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి గారు ప్రేక్షకపాత్రతో ఉండటంతో చేసుకున్న అగ్రిమెంట్ అమలుకోసం సమ్మె చేయవలసిన పరిస్థితి వచ్చిందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. తక్షణమే పెంచిన హమాలిరేట్లతో ఎరియర్స్‌తో జిఒ విడుదల చేస్తూ సమ్మెను విరమింపచేసి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని కోరు తున్నారు.

---

## లేఖ

# అన్యాయాన్ని నిరసిస్తున్న యువత

29 డిసెంబర్ 2024 ఆదివారం నాడు, బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కంబైన్డ్ (ప్రిలిమినరీ) పోటీ పరీక్షని రద్దు చేయాలని కోరుతూ బీహార్ పోలీసులు యువతపై లాఠీ ఛార్జ్ చేశారు. పాట్నాలో నిరసన తెలుపుతున్న అభ్యర్థులను చెదరగొట్టేందుకు పోలీసులు వాటర్ క్యాన్లను కూడా ప్రయోగించారు. బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాష్ట్రంలోని 912 కేంద్రాలలో డిసెంబర్ 13న ఇంటిగ్రేటెడ్ 70వ కంబైన్డ్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించింది. రాష్ట్ర పరిపాలనలో పోస్టుల భర్తీకి ఈ పరీక్ష. ఏదేమైనప్పటికీ, పాట్నాలోని ఒక కేంద్రంలో పరీక్ష బాపు పరీక్షా పరిసర సెంటర్లో పేపర్ లీక్ అయిందనే నివేదికలు పరీక్షలకు అంతరాయం కలిగించడంతో రద్దు చేయబడింది. ఆ కేంద్రంలో పునఃపరీక్ష కోసం జనవరిలో కొత్త తేదీని ప్రకటించారు. పరీక్షకు హాజరైన వందలాది మంది అభ్యర్థులు డిసెంబరు 18 నుండి పాట్నాలోని గార్దానీబాగ్ ప్రాంతంలో ఆందోళన చేస్తున్నారు, రాష్ట్రవ్యాప్తంగా పరీక్షను రద్దు చేసి మళ్లీ పరీక్షను నిర్వహించాలని డిమాండ్ చేశారు. కొన్ని ఇతర కేంద్రాలలో కూడా ప్రశ్నపత్రం లీక్ అయిందన్న నివేదికల ఆధారంగా నిరసనలు జరిగాయి, అయితే ఇతర ప్రదేశాలలో ప్రశ్నపత్రాలను పంపిణీ చేయడంలో జాప్యం జరిగింది. అయితే బీపీఎస్సీ అధికారులు మాత్రం ఒకే ఒక కేంద్రంలో లీక్‌ను అంగీకరించారు. దాదాపు 2 వారాల నిరసనల తర్వాత డిసెంబర్ 29న నిరసనకారులు ముఖ్యమంత్రి కార్యాలయానికి మార్చ్ నిర్వహించారు. యువత ఎదుర్కొంటున్న భారీ నిరుద్యోగం మరియు భయంకరమైన అనిశ్చిత భవిష్యత్తు మన దేశంలో ప్రబలంగా ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క ఫలితం. ఈ వ్యవస్థ పాలక పెట్టుబడిదారీ వర్గ లాభాలను పెంపొందించడానికి మాత్రమే పనిచేస్తుంది. ప్రజల జీవనోపాధి భద్రతపై ఎలాంటి ఆందోళన లేదు. రాష్ట్రంలోని అన్ని ఏజెన్సీలు పాలక వర్గం సేవలో పనిచేస్తాయి. యువతకు నాణ్యమైన విద్య, శిక్షణ ఉపాధిని కల్పించడంలో ఆసక్తి, సామర్థ్యం కలిగి , జీవనోపాధి, అందరికీ సురక్షితమైన భవిష్యత్తు కల్పించే భరోసా కల్పించాలి.

**ఆళవందార్ వేణు మాధవ్**

---



ఉజ్జిని రత్నాకరరావు
9490952646

# 'భూభారతి'తో రైతన్నకు మేలు జరగాలి

గత బిఆర్ఎస్ ప్రభుత్వం భూరికార్డులకు శాశ్వత పరిష్కారంగా శాస్త్రీయంగా ఉండేందుకు మూడు సంవత్సరాలు కసరత్తుచేసి 'ధరణి పోర్టల్'ను 2018లో తీసుకొచ్చింది. కానీ, ధరణి పోర్టల్‌లో భూ రహస్యానికి చోటు కల్పించింది. దీనితో అనేక అక్రమాలకు వీలుఏర్పడింది. ఈ లోపాలను సవరించటానికి జిల్లా కలెక్టర్స్/ఆర్డిఒలకు అధికారం ఉండాలని కోరుతూ రైతులు, ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు చెబుతున్నప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఉదా : భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో చాలకాలంగా రైతులు సాగుచేసుకుంటున్న భూములు సర్వే నెంబర్లు 149, 150, 154,165, 166, 168 లలోని సుమారు 1,827 ఎకరాలను ధరణి పోర్టల్ లో ఫారెస్ట్ భూమిగా ఎక్కించారు. గ్రామానికి చెందిన 1200 మంది రైతుల పేర్ల స్థానంలో అడవి అని నమోదు చేశారు. దీనితో రైతులకు పట్టా పాస్ బుక్స్ రాలేదు. పంటల బీమా, రైతు బంధు, రైతు భీమా రాలేదు. అమ్ముకోలేక కొనలేక అనేక అవస్థలు పడ్డారు. ఆరు సంవత్సరాలుగా రైతులు తిరగని ఆఫీసులేదు. మంత్రి ఆదేశాలతో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ జిఒ నెం.94 జారీచేసి ధరణిలో అడవి నమోదు తొలగించి రైతులపేర్లు నమోదుచేసినారు. ధరణిలో ఉన్న లోసుగులను అడ్డం పెట్టుకొని అధికార పార్టీ నాయకులు వారి ఏజెంట్లు వేలాదిఎకరాల ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్న సంఘటనలు కోకొల్లలు.

**ధరణితో విధ్వంసం:** గత ప్రభుత్వాలు భూమిలేని పేదలను సామాజికంగా, ఆర్థికంగా మెరుగుపరచడం కోసం ఉమ్మడి రాష్ట్రంలో వివిధ మార్గాల ద్వారా భూపంపిణీ చేపట్టాయి. కానీ కెసిఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారి రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని 'ధరణి' ప్రవేశపెట్టి రాష్ట్రంలోని 25–30 లక్షల కుటుంబాల్లో అశాంతిని, అలజడిని కలిగించారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా విదేశాల్లోని స్టాఫ్ వేర్ సంస్థలకు రాష్ట్ర భూములపై పెత్తనాన్ని అప్పగించారు. ఇందులో ఉన్న లొసుగులను ఆసరా చేసుకుని అధికార పార్టీ నాయకులు, వారి అనుంగులు, పైరవి కారులు, అధికారులు ఇష్టం వచ్చిన రీతిగా భూములు మార్పిడిలు చేశారు.



ప్రభుత్వ భూములను నిస్సిగ్గుగా అర్ధరాత్రి పూట కూడా రిజిస్ట్రేషన్ చేసుకున్న సంఘటనలు కొల్లలు. అంతేకాదు గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పంపిణీ చేసిన అసైన్డ్ భూముల్లోనూ అత్యధిక భూములను ప్రభుత్వ అవసరాల నిమిత్తం స్వాధీనం చేసుకొని, ఆ తరువాత ప్రైవేట్ కంపెనీలకు అమ్ముకున్నారు. వివాదాస్పద భూములను, డిమాండ్ ఉన్న భూములను ధరణి చట్టాలలోని లొసుగులను ఉపయోగించుకొని గత ప్రభుత్వ నేతలు తమ అనుయాయులకు పంపిణీ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇక ప్రభుత్వ అండతో అసైన్డ్ భూములు, ఇనాం భూములు, ఫారెస్ట్ భూములు, ఇతరత్రా సమస్యలున్న భూములను ఆ పార్టీ నాయకులు కొందరు కబ్జాలకు పాల్పడ్డారు.

**రెవెన్యూ వ్యవస్థ ధ్వంసం:** విఆర్ఒలు, విఆర్ఎలు అవినీతికి పాల్పడ్డారంటూ రెవిన్యూ వ్యవస్థలో పనిచేస్తున్న దాదాపు 22 వేలమందిని తొలగించటం.. వారు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో వారిని వివిధ శాఖలకు బదిలీ చేయడం జరిగింది. దీనివల్ల రెవిన్యూ వ్యవస్థ పూర్తిగా చిన్నా భిన్నమైంది. భూములపై పర్యవేక్షణ లేకుండా పోయింది.

**రైతాంగానికి భూభారతి భరోసా :**

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు రెవిన్యూలో సంస్కరణ తీసుకురావాలని నిర్ణయించి ధరణిని రద్దు చేస్తూ, దాని స్థానంలో నూతన ఆర్ఓఆర్ 2024 భూ మాత బిల్లును తెలంగాణ రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డిసెంబర్ 18 న ప్రవేశపెట్టారు. అసెంబ్లీలో దీని విధి విధానాలపై చర్చ జరిగింది. ధరణి కన్నా భూ మాత మరింత మెరుగైనదని వివరించిన తర్వాత ఈ బిల్లు ఆమోదం పొందింది. ఇప్పటికే ధరణి చట్టంలోఉన్న లొసుగులను తొలగించి సమగ్రంగా రూపొందించడానికి మంత్రివర్గ ఉప సంఘాన్ని వేయడం జరిగింది. ఈ ఉప సంఘం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో పర్యటించి వివిధ వర్గాల ప్రజలను రైతుల నుండి అభిప్రాయాలు సేకరించి సమగ్రమైన భూ సంస్కరణకు శ్రీకారం చుట్టింది. దానికి భూభారతి అని నామకరణం చేయడం జరిగింది. భూ భారతి పోర్టల్‌ను నూతన సంవత్సరం సంక్రాంతి నుండి అందుబాటులోకి తెచ్చే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. భూ భారతి చట్టంపై ఇప్పటికే ప్రజల నుంచి రైతు సంఘాల నుండి సానుకూల స్పందన వచ్చింది.

**విఆర్ఏ వ్యవస్థ పునరుద్ధరణ :**

రెవెన్యూ సంస్కరణలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన నేపథ్యంలో గ్రామస్థాయిలో పనిచేస్తున్న పాత విఆర్వోలు, విఆర్ఎల సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు గతంలో పనిచేసిన 22 వేల ఉద్యోగులను తిరిగి నియమించేందుకుగాను, ఆసక్తి కలిగిన వారు, అర్హతలు ఉన్న వారు గూగుల్ ఫామ్‌లో దరఖాస్తులు పెట్టుకోవాలని ఏర్పాట్లు చేసినారు.

క్షేత్రస్థాయిలో విఆర్ఓలు, వీఆర్ఏలు కీలకంగా పనిచేస్తుంటారు. రెవిన్యూ గ్రామాల పరిధిలో ఎంత విస్తీర్ణంలో ప్రభుత్వ స్థలం ఉంది, పట్టా భూములు ఏ మేరకు ఉన్నాయో, పంటసాగు వివరాలు వీఆర్వోలకు స్పష్టంగా తెలుస్తుంది. అలాగే బీడు భూములు, అన్యాక్రాంతానికి గురయ్యే వాటిపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటారు.కాగా వీరి సేవలు ఉపయోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.వీరి ద్వారానే ఇతర ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన విచారణలు జరుగుతాయి. ప్రధానంగా కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, ఆసరా పింఛన్, ఇండ్లు, రేషన్ కార్డులు కోసం నిత్యము వందలాది మంది దరఖాస్తు చేసుకుంటున్నప్పటికీ వారి ఆర్థిక స్థితిగతులను తెలుసుకొని ఉన్నతాధికార్లకు సకాలంలో సమాచారం చేరవేసే యంత్రాంగం తాసిల్దార్ కార్యాలయాలలో ఉంటూ, క్షేత్రస్థాయి సమాచారం అందించే విఆర్వోలు, విఆర్ఏలు అవసరమని ప్రభుత్వం భావించింది.

గతంలో జిహెచ్ఎంసి పరిధిలో(హైదరాబాద్ రంగారెడ్డి మేడ్చల్ ) వెయ్యికి పైగా ఉండేవారు. వారిని తొలగించడంతో కనీస పర్యవేక్షణలేక వేల ఎకరాలు అక్రమ కబ్జాలకు గురైనవి.. చెరువులు, కుంటల భూములు, ప్రభుత్వ భూములు మాయమైనవి. హైడ్రా 200 ఎకరాలు అక్రమ కబ్జా లనుండి కాపాడింది.

**తెలంగాణలో భూమి సాగు వివరాలు:–**

తెలంగాణ విస్తీర్ణం1,12,000 చదరపు కిలోమీటర్లు.. అంటే దాదాపు 2 కోట్ల 75 లక్షలు ఎకరాల భూమి.దీనిలో కోటి 60 లక్షల ఎకరాల సేద్యంలో ఉన్నది. 66 లక్షల ఎకరాల అటవీ భూమి, మిగిలినవి గ్రామకంతాలు, పట్టణాలు, దేవాలయాలు, మాన్యాలు, ఒక్ఫ ఇనాం, శిఖం కింద ఉన్నాయి. ఈ లెక్కలన్నీ కూడా ఉజ్జాయింపు లెక్కలే కానీ, వాస్తవమైన స్పష్టమైన లెక్కలు లేవు. వీటిపై కొంత కష్టమైనా పొజిషన్ ప్రకారం సమగ్ర భూ సర్వే చేసి తీరుతాం, లెక్కలు తీస్తామని, అన్యాక్రాంతం, కబ్జాలకు గురైన ప్రభుత్వ భూముల రక్షణ కోసం కట్టుబడి ఉన్నదని,దాని కోసం సీసీఎల్ ఏ ను పటిష్టంగా ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది.

రైతు భరోసా సాయం మీద కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం పాస్ పుస్తకం ఉన్న ప్రతి మనిషికి రైతుబంధు ఇచ్చింది. కొండలు, గుట్టలు, ఫామ్ హౌస్ లకు, కంచెలకు కూడా డబ్బులు ఇచ్చింది. నేటి ప్రజా ప్రభుత్వం కేవలం సాగులోని భూమికి మాత్రమే సాయం అందిస్తామని ప్రకటించింది. ప్రతి గ్రామంలోని విలేజ్ అగ్రికల్చరల్ ఆఫీసర్, శాటిలైట్ సహాయంతో పంట పొలాలను గుర్తించి నిజమైన రైతులకు సాయం అందించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. సంక్రాంతికి ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇలా స్పష్టమైన పటిష్టమైన అవగాహనతో పునర్ నిర్మాణం అవుతున్న తెలంగాణ గ్రామీణ వ్యవసాయ రంగం, అభివృద్ధి వైపు ప్రయాణాన్ని కొనసాగించాలని కోరుకుందాం..

# మారని గవర్నర్ తీరు

## తమిళనాడు అసెంబ్లీ నుంచి వాకౌట్

### గవర్నర్‌ది 'పిల్లచేష్ట' అంటూ స్టాలిన్ మండిపాటు



**చెన్నై :** తమిళనాట డిఎంకె ప్రభుత్వంతో రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవికి విభేదాలు మరింత ముదిరాయి. చాలాకాలంగా పాలనాపరమైన విషయాలతో పాటు ఇతరత్రా అంశాలపై డిఎంకె ప్రభుత్వంతో గవర్నర్‌కు రగడ కొనసాగుతోంది. తాజాగా మరోసారి అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వంతో గవర్నర్ విభేదించారు. అసెంబ్లీ సమావేశాల తొలి రోజు సంప్రదాయంగా సభను ఉద్దేశించి ప్రసంగించేందుకు ఆయన నిరాకరించి వెళ్లిపోయారు. రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సంప్రదాయం ప్రకారం సభ సమావేశమైనప్పుడు రాష్ట్ర గీతం తమిళ్ థాయ్ వాజత్తు (తమిళ తల్లికి వందనం), సభ ముగిసిన తర్వాత చివరలో జాతీయ గీతం ఆలపిస్తారు. అయితే ఈ నిబంధన మార్చాలని గవర్నర్ రవి డిమాండ్ చేశారు. సభ ప్రారంభంలోనూ జాతీయ గీతం ఆలపించాలని సభా నాయకుడు అయిన ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, స్పీకర్ ఎం.అప్పావును కోరారు. వారు నిరాకరించడంతో గవర్నర్ రవి సభ నుంచి వాకౌట్ చేశారు. దీంతో గవర్నర్ చదవాల్సిన సంప్రదాయ ప్రసంగాన్ని స్పీకర్ ఎం.అప్పావు చదివి వినిపించారు. 'ఈరోజు తమిళనాడు అసెంబ్లీలో భారత రాజ్యాంగానికి, జాతీయ గీతానికి మరోసారి అవమానం జరిగింది. జాతీయ గీతాన్ని గౌరవించడం మన రాజ్యాంగంలో పొందుపరిచిన మొదటి ప్రాథమిక విధి. ఇది అన్ని రాష్ట్రాల శాసనసభలలో గవర్నర్ ప్రసంగం ప్రారంభంలో, చివరిలో ఆలపించడం జరుగుతుంది' అని గవర్నర్ సభను బహిష్కరించిన తర్వాత రాజ్ భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. 'ఈరోజు గవర్నర్ సభకు రాగానే తమిళ థాయ్ వాజత్తు మాత్రమే ఆలపించారు. గవర్నర్ సభకు రాజ్యాంగ కర్తవ్యాన్ని గౌరవపూర్వకంగా గుర్తు చేశారు. జాతీయ గీతాన్ని ఆలపించాలని ముఖ్యమంత్రి, స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అయితే వారు సున్నితంగా తిరస్కరించారు. ఇది తీవ్ర ఆందోళన కలిగించే అంశం. రాజ్యాంగాన్ని, జాతీయ గీతాన్ని అవమానించడంతో తీవ్ర వేదనతో గవర్నర్ సభ నుంచి వెళ్లిపోయారు' అని రాజ్‌భవన్ పేర్కొంది. దీనిపై ముఖ్యమంత్రి స్టాలిన్ స్పందిస్తూ అసెంబ్లీ సంప్రదాయాన్ని ఉల్లంఘించడం గవర్నర్ ఆనవాయితీగా మార్చుకున్నారని, అతని చర్యలను 'పిల్లచేష్టలు'గా అభివర్ణించారు. 'రాజ్యాంగం ప్రకారం గవర్నర్ సంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వ ప్రసంగాన్ని చదవడం శాసన ప్రజాస్వామ్య సంప్రదాయం! దానిని ఉల్లంఘించడం గవర్నర్ ఆనవాయితీగా మార్చుకున్నాడు. ఉన్నదానిని కత్తిరించి లేనిది చేర్చిన గవర్నర్ ఈసారి చదవకుండా పోవడం 'పిల్లతనం' అని అసెంబ్లీలో తన మునుపటి ప్రసంగాలలో గవర్నర్ దాటవేసిన భాగాలను స్టాలిన్ ప్రస్తావించారు. 'తమిళనాడు ప్రజలను, వారిచే ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని, సుదీర్ఘచరిత్ర గల తమిళనాడు శాసనసభను నిరంతరం అవమానించేలా గవర్నర్ చర్యలు ఆయన నిర్వహిస్తున్న పదవికి తగనివి. తమ రాజకీయ, న్యాయపరమైన విధులను నిర్వర్తించడానికి ఇష్టపడని వ్యక్తి పదవిలో ఎందుకు కొనసాగాలి? అనేది అందరి మదిలో మెదులుతున్న ప్రశ్న!' అని పేర్కొన్నారు.

**గవర్నర్‌ది ఎప్పుడూ ఇదే తంతు!**

తమిళనాడు అసెంబ్లీలో గవర్నర్, డిఎంకె ప్రభుత్వం మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడం ఇదే తొలిసారి కాదు. గత ఫిబ్రవరిలో గవర్నర్ అసెంబ్లీలో సంప్రదాయ ప్రసంగాన్ని అందించడానికి నిరాకరించారు. ప్రసంగం ప్రతి పెద్దగా ఉందని ఆరోపించారు. అలాగే బీఆర్ అంబేద్కర్, పెరియార్, సీఎన్ అన్నాదురై పేర్లతో పాటు 'ద్రవిడ నమూనా' అనే పదం, శాంతిభద్రతలకు సంబంధించిన ప్రసంగంలోని భాగాలను చదవడానికి ఆయన నిరాకరించి సభ నుంచి వెళ్లిపోయారు. 2021లో తమిళనాడు గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆర్ఎన్ రవికి... స్టాలిన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంతో చాలా తక్కువ సంబంధాలు ఉన్నాయి. గవర్నర్ బీజేపీ అధికార ప్రతినిధిలా వ్యవహరిస్తున్నారని, బిల్లులు, నియామకాలను అడ్డుకుంటున్నారని డీఎంకే ప్రభుత్వం ఆరోపించింది. అయితే చట్టానికి తన సమ్మతిని నిలుపుదల చేయడానికి రాజ్యాంగం తనకు అధికారం ఇచ్చిందని గవర్నర్ అంటున్నారు. రాజ్‌భవన్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య వివాదం సుప్రీం కోర్టు, రాష్ట్రపతి భవన్‌కు సైతం చేరింది. మంత్రివర్గం సూచనలు, సలహా మేరకు గవర్నర్లు పనిచేయాలని సుప్రీం కోర్టు, మద్రాసు హైకోర్టు స్పష్టంచేశాయి.

# ఖాళీలు భర్తీ, నిరుద్యోగ సమస్య పరిష్కారం

### ఇదే కేంద్ర కార్మిక సంఘాల ప్రధాన డిమాండ్

### బడా సంస్థలపై పన్నులు పెంచి, వెల్త్ ట్యాక్స్, గిఫ్ట్ ట్యాక్స్ ప్రవేశపెట్టాలి

### ప్రీ బడ్జెట్ మీటింగ్‌లో ఆర్థిక మంత్రికి సిటియు డిమాండ్



**న్యూఢిల్లీ :** దేశంలో బడా వ్యాపార సంస్థలపై పన్నులు పెంచాలని ప్రీ-బడ్జెట్ సంప్రదింపుల సమావేశంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు పది కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక (సిటియు) డిమాండ్ చేసింది. ప్రభుత్వరంగ సంస్థ (పిఎస్‌యు)లకు మంజూరైన పోస్టులు భర్తీ చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలోని వివిధ శాఖల్లో ఉద్యోగ ఖాళీల భర్తీ ద్వారా నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని కోరింది. కొత్తగా ఉద్యోగాలు సృష్టించకుండా విధించిన నిషేధ ఆజ్ఞలను ఎత్తివేయాలన్న డిమాండ్‌లను పునరుద్ఘాటించింది.
2025-26 వార్షిక బడ్జెట్ తయారు చేయడానికి ముందుగా అభిప్రాయసేకరణలో భాగంగా కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులతో సోమవారంనాడు ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ సమావేశం జరిపారు. సమావేశానంతరం సిటియు ఈ ఉమ్మడి ప్రకటన విడుదల చేసింది. ఈ సమావేశంలో పది కేంద్ర కార్మిక సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఐక్యవేదిక ప్రతినిధులు పలు డిమాండ్లతో కూడిన ఉమ్మడి విజ్ఞాపన పత్రాన్ని ఆర్థికమంత్రికి అందజేశారు. బడ్జెట్ నిధుల సేకరణకోసం కార్పొరేట్స్‌పై పన్నుల పెంచాలనీ, సంపదపన్ను, బహుమతి పన్నులను కొత్తగా ప్రవేశపెట్టాలని వారు కోరారు. ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని, కేంద్ర కార్మిక సంఘాల సమస్యలన్నీ పరిష్కరించడానికి, పారిశ్రామిక శాంతికోసం, ఆ ప్రయోజనాలు నెరవేర్చడంకోసం భారత కార్మిక సదస్సు (ఐఎల్‌సి)ను వీలైనంత తొందరగా నిర్వహించాలని, ఈ సదస్సు నిర్వహించేందుకు ఆర్థికమంత్రి జోక్యం చేసుకోవాలని సిటియు ప్రతినిధులు నిర్మలాసీతారామన్‌ను కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, వాటిని రద్దు చేయాలన్న డిమాండ్‌ను పునరుద్ఘాటించారు.
ప్రభుత్వరంగ పరిశ్రమలకు మంజూరుచేసిన పోస్టులు భర్తీ చేయడంలేదని, కేంద్ర ప్రభుత్వంలో, వివిధ రాష్ట్రాలలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయకుండా ఆపేశారనీ, కొత్త ఉద్యోగాలు సృష్టించకుండా నిషేధం అమలు చేస్తున్నారనీ, ఈ నిషేధం వెంటనే ఎత్తివేయాలని విజ్ఞాపన పత్రంలో కార్మిక సంఘాలు కోరాయి. ఔట్‌సోర్సింగ్ విధానానికి స్వస్తి చెప్పాలని, భారీ సంఖ్యలో కార్మికుల అవసరం ఉండే పరిశ్రమలను, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు మరింత భారీ పెట్టుబడులు సమకూర్చే పద్ధతులు నిలిపివేయాలని, జీవన భృతిని సృష్టించే మరిన్ని స్వయం ఉపాధి పథకాలను అమలులోకి తీసుకురావాలని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద కార్మికులకు 200 రోజులు పని ఇవ్వాలని, ఇందుకోసం పనిదినాల సంఖ్య పెంచాలని, ఈ పథకం కింద వారికి రోజుకు రూ.600లు వేతనం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా పట్టణ ఉపాధి హామీ తదితర కొత్త విధానాలకు శ్రీకారం చుట్టాలని కోరారు. ప్రైవేటీకరణ విధానాలకు స్వస్తిచెప్పాలని, ప్రభుత్వరంగ పరిశ్రమల నుండి పెట్టుబడుల ఉపసంహరణ చర్యలు మానుకోవాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్మకానికి పెట్టడం ఆపేయాలని, ప్రభుత్వ సేవలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించకూడదని డిమాండ్ చేశారు. ఇపిఎఫ్ ఆరంభ మొత్తాన్ని పెంచాలని, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ కవరేజీని అనిశ్చిత కార్మికులకు, గిగ్ వర్కర్లకు, యాప్ ఆధారిత కార్మికులకు, ఇళ్ళల్లో పనిచేసే కార్మికులకు క్రమక్రమంగా వర్తింపజేయాలని కూడా కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులు ఆర్థికమంత్రిని డిమాండ్ చేశారు. ఈ చట్టబద్ధమైన పథకాలన్నింటినీ క్రమంగా ఈ అనిశ్చిత కార్మికులకు వర్తింపజేయాలని కోరారు.
స్కీమ్ వర్కర్లకు ప్రభుత్వ కార్మికుడి హోదా ఇవ్వాలన్న భారత కార్మిక సదస్సు చేసిన సిఫార్సును అమలు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. అదేవిధంగా స్కీమ్ వర్కర్లు అందరినీ ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్‌లోకి చేర్చుకోవాలని అన్ని కార్మిక సంఘాల ప్రతినిధులు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ సహా ఐఎన్‌టియుసి, హెచ్ఎంఎస్, సిఐటియు, ఎఐయుటియుసి, టియుసిసి, ఎస్ఇడబ్ల్యుఎ, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసిలకు చెందిన నాయకులు సెక్టోరల్ ఫెడరేషన్స్, వివిధ అసోసియేషన్లకు చెందిన నాయకులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# మహిళలకు నెలనెలా రూ.2500

### ఢిల్లీలో 'ప్యారీ దీదీ యోజన' పథకాన్ని ప్రారంభించిన కాంగ్రెస్




**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో పార్టీలు ప్రజలకు పలు వాగ్దానాలు చేస్తుండగా, అధికార ఆమ్ ఆద్మీ (ఆప్) రోజుకో కొత్త పథకం ప్రకటిస్తోంది. ఆప్ ఇప్పటికే పలు పథకాలను వెల్లడించగా, కాంగ్రెస్ తాజాగా మహిళల కోసం కొత్త పథకం ప్రకటించింది. తమ పార్టీ అధికారంలోకి రాగానే 'ప్యారీ దీదీ యోజన' ప్రారంభిస్తామని పేర్కొంది. ఈ పథకం మహిళలకు నెలనెలా రూ. 2500 ఆర్థిక సాయం అందనుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని హామీనిచ్చింది. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న తరహాలోనే ఢిల్లీలో కూడా అమలు కాంగ్రెస్ భావిస్తోంది. కాగా 'ప్యారీ దీదీ యోజన' పథకాన్ని సోమవారం కర్నాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ప్రకటించారు. మహిళలకు ఆర్థికంగ సాధికారత పొందడమే ఈ పథకం లక్ష్యమని ఆయన చెప్పారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలి క్యాబినెట్‌లోనే ఇందుకు సంబంధించిన విధానాలను ఖరారు చేస్తామని చెప్పారు. తాను ఈ రోజు 'ప్యారీ దీదీ యోజన'ను ప్రారంభించేందుకు ఢిల్లీకి వచ్చానన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటువుతందన్న దృఢ విశ్వాసంతో తాము ఉన్నామని చెప్పారు. తొలి క్యాబినెట్ మొదటి రోజు నుంచే ప్రతి మహిళలకు నెలనెలా రూ. 2500 ఆర్థిక సాయం అందించే పథకాన్ని అమలు చేస్తామని శివకుమార్ చెప్పారు. దేశ, రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ ఏం చెప్పినా, ఎక్కడ ఏ వాగ్దానం చేసినా దానిని అమలు చేస్తుందని పేర్కొన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే అన్ని గ్యారంటీలను అమలు చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణం, ప్రతి ఇంటికి 10 కిలోల బియ్యం, నిరుద్యోగ యువతకు సుమారు రూ.3 వేలు, 200 యూనిట్ల విద్యుత్, ప్రతి మహిళకు రూ.2 వేలు ఇస్తున్నామన్నారు. అదనంగా, 1.22 కోట్ల మంది మహిళలు ప్రతి నెలా రూ.2,000 పొందుతున్నారని ఆయన చెప్పారు. మీడియాను ఉద్దేశించి ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుండటంతో ప్రజల్లోనూ నమ్మకం పెరిగినట్టు ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ తెలిపారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ ఛత్తీస్‌గఢ్‌లలో ఏవైతే వాగ్దానాలు చేశామో వాటన్నింటిని అమలు చేశామని, ప్రజావిశ్వాసాన్ని పొందగలిగామని చెప్పారు. ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కలల్లో విహరిస్తుంటారని, 11 ఏళ్లుగా ఢిల్లీ పరిస్థితి దిగజారిందని, ఎడ్యుకేషన్ మోడల్, ఉచిత విద్యుత్, ఉచిత నీళ్లు, అవినీతిని అంతం చేయడం వంటి హామీలన్నీ పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరిలో జరగాల్సి ఉన్నాయి. ఢిల్లీలో 15 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకు 60 సీట్లలో ఆప్ గెలుపొందగా, బిజెపి 8 సీట్లు గెలుచుకుంది.

# ప్రధాని చర్చలు జరపాలి

### రైతు సంఘాల విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** పంజాబ్, హర్యానాలో ప్రత్యేక కిసాన్ మహాపంచాయత్ తరువాత సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్‌కెఎం), సంయుక్త కిసాన్ మోర్చ రాజకీయేతర (ఎస్‌కెఎం-ఎన్‌పి) రెండూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరకంగా నిరసనలను బలోపేతం చేయాలని నిర్ణయించాయి. అంతే కాకుండా, ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ఎస్‌కెఎం-ఎన్‌పి నాయకుడు జగ్‌జీత్ సింగ్ డల్లేవాల్‌కు ప్రజా మద్దతు కూడగట్టేందుకు రెండు సంఘాలు ప్రయత్నిస్తున్నాయి. ఇతర రాష్ట్రాల రైతులను కూడా నిరసనలలో భాగస్వాములు కావాల్సిందిగా గత ఏడాది నవంబర్ 26 నుంచి ఆమరణ దీక్ష చేస్తున్న డల్లేవాల్ విజ్ఞప్తి చేశారు. ఖనౌరీలో నిరసన కేంద్రం వద్ద ఆయనకు మద్దతుగా శనివారం వేలాది మంది రైతులు సమావేశమయ్యారు. హర్యానాలోని తొహానాలో శనివారం నాడు కిసాన్ మహా పంచాయత్ జరిగింది. ప్రజాస్వామ్యాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గౌరవించాలని, అన్ని రైతు సంఘాలతో చర్చలు జరిపి డల్లేవాల్‌ను రక్షించాలని కోరింది. అలాగే రైతుల మధ్య విశాలమైన ఐక్యత కోసం మహా పంచాయత్ పిలుపునిచ్చింది. ఖనౌరీ, శంభులో జరుగుతున్న రైతుల ఉద్యమాలకు మద్దతు ప్రకటించింది. 'నరేంద్ర మోదీ నియంతృత్వ ధోరణిని వ్యతిరేకంగా రైతులు హెచ్చరించారు. ఆయన పరిపాలనలో ప్రజాస్వామిక సూత్రాలను గౌరవింపబడాలి. ప్రజాస్వామ్యంలో ఏ ఒక్కరు చట్టానికి అతీతులు కారు. రైతు నాయకుడు డల్లేవాల్ ప్రాణాలను రక్షించేందుకు రైతు సంఘాలన్నిటితో ఎన్‌డిఎ-3 ప్రభుత్వం తప్పనిసరిగా చర్చలు జరపాలి'' అని ఎస్‌కెఎం ఒక ప్రకటనలో పేర్కొంది.

**ఎన్‌పిఎఫ్ఎఎంను వెనక్కి తీసుకోవాలి**

జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ ఫ్రేమ్‌వర్క్ పాలసీ (ఎన్‌పిఎఫ్ఎఎం) వెనక్కి తీసుకోవాలని కోరుతూ కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖలు రాయాలని హర్యానా రైతులను ఎస్‌కెఎం మహా పంచాయత్ కోరింది. ముసాయిదా ఎన్‌పిఎఫ్ఎఎం అమల్లోకి వస్తే ధాన్యం వ్యాపారం కార్పొరేట్ చేతుల్లో పడుతుందని సీనియర్ రైతు నాయకుడు ఉగ్రహన్ తెలిపారు. ''ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ), అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)లకు వ్యతిరేకంగా తీవ్రమైన, భారీ పోరాటం చేయాలి'' అని ఆయన అన్నారు. 'హర్యానా ప్రభుత్వం 24 పంటలకు కనీస మద్దతు ధర అంటూ తప్పుదోవ పట్టిస్తోంద'ని భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్ అన్నారు. ఎస్‌కెఎం సీనియర్ నాయకుల కమిటీ రైతు సంఘాల మధ్య ఐక్యత కోసం కృషి చేస్తున్నదని తెలిపారు.

# ఢిల్లీలో కోటిన్నర మంది ఓటర్లు

### తుది జాబితా విడుదల చేసిన ఇసి

**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఓటర్ల తుది జాబితాను ఢిల్లీ ఎన్నికల కమిషన్ సోమవారం విడుదల చేసింది. జాబితా ప్రకారం దేశ రాజధానిలో 1,55,24,858 మంది రిజిస్టర్డ్ ఓటర్లు ఉన్నారు. వీరిలో 84,49,645 మంది పురుష ఓటర్లు, 71,73,952 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఓటర్ల జాబిజాలో లేని వారు 2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లేదని ఎన్నికల కమిషన్ తెలిపింది. ఎంత మంది కొత్త ఓటర్లను చేర్చారు, ఎంతమంది పేర్లను తొలగించారనే వివరాలు తాజా ఓటర్ల తాబితాలో ఇసి పొందుపరిచింది. కాగా, మాజీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల పోటీ చేస్తున్న అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున ఓటర్లను తొలిగించారని ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ చేసిన ఆరోపణలను ఎన్నికల అధికారి గత శనివారం తోసిపుచ్చారు. ఓట్ల తొలగింపు కోరిన అప్లికెంట్ల వివరాలను డిఇఒ ఇవ్వలేదని, ఉద్దేశపూర్వకంగానే ఓటర్ల పేర్లను డిఇఒ తొలగించారని ఎంపి చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని చెప్పారు. ఎన్నికల జాబితా నుంచి పేర్లు తొలగించడం పూర్తిగా ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమే ఉంటుందని తెలిపారు.

## రూ.12లక్షల కోట్లు ఆవిరి

### ముంచిన వైరస్ భయాలు

**ముంబై :** దలాల్ స్ట్రీట్‌లో మరోసారి వైరస్ గుబులు మొదలైంది. దేశంలో హెచ్ఎంపివి కేసులు వెలుగు చూసిన వేళ సూచీలు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, విదేశీ మదుపర్ల అమ్మకాలు సూచీలను పడేశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1400 పాయింట్ల మేర పతనం కాగా... నిఫ్టీ 23,550 స్థాయికి చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.12లక్షల కోట్ల మేర క్షీణించి రూ.439 లక్షల కోట్లకు చేరింది. ఉదయం సెన్సెక్స్ 79,281.65 (క్రితం ముగింపు 79,223.11) పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఉదయం కాసేపు లాభనష్టాల మధ్య చలించింది. బెంగళూరులో ఇద్దరు చిన్నారుల్లో హెచ్ఎంపీవీని గుర్తించినట్లు వార్తలు రావడంతో సూచీల పతనం ప్రారంభమైంది. అనంతరం భారీ నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 77,781.62 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సూచీ... చివరికి 1258.12 పాయింట్ల నష్టంతో 77,964.99 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 388.70 పాయింట్లు నష్టపోయి 23,616.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరో 3 పైసలు క్షీణించి 85.82గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టైటాన్, సన్‌ఫార్మా షేర్లు మినహా మిగిలిన అన్ని కంపెనీల షేర్లూ నష్టాల్లో ముగిశాయి. టాటా స్టీల్, ఎన్టీపిసి, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి.

### ప్రార్థనా స్థలాల వివాదంలో జోక్యానికి..

# సుప్రీంను ఆశ్రయించిన 'హిందూ సంస్థ'

### 1991నాటి చట్టంలోని నిబంధనల చెల్లుబాటుకు వ్యతిరేకంగా దాఖలైన కేసుపై అఖిల భారతీయ సంత్ సమితి పిటిషన్



**న్యూఢిల్లీ :** 1991 నాటి చట్టంలోని నిబంధనల చెల్లుబాటుకు వ్యతిరేకంగా దాఖలైన కేసులో జోక్యం చేసుకోవాలని అఖిల భారతీయ సంత్ సమితి అనే హిందూ సంస్థ సోమవారం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఇది 1947, ఆగస్టు 15 నుండి ఉనికిలో ఉంది. న్యాయవాది అతులేష్‌కుమార్ ద్వారా దాఖలు చేసిన ఈ అభ్యర్థన 1991చట్టంలోని సెక్షన్ 3, సెక్షన్ 4లను సవాల్ చేసింది. సమానత్వం, మతాన్ని ఆచరించే హక్కు సహా అనేక ప్రాథమిక హక్కులను వారు ఉల్లంఘించారని వాదించారు. 1991చట్టం ఏదైనా ప్రార్థనా స్థలాన్ని మార్చడాన్ని నిషేధిస్తుంది. 1947 ఆగస్టు 15నాటి నుంచి ఉనికిలో ఉన్నటువంటి ఏ ప్రార్థనా స్థలమైనా దాని సంబంధిత మతపరమైన స్వభావాన్ని నిర్వహించడం కోసం అందిస్తుంది. అయితే అయోధ్యలోని రామజన్మభూమిబాబ్రీ మసీదుకు సంబంధించిన వివాదాన్ని దాని పరిధికి దూరంగా ఉంచింది. సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం డిసెంబరు 12, 2024న దేశంలోని కోర్టులు తాజా వ్యాజ్యాలను పరిశీలించకుండా మతపరమైన స్థలాలను ముఖ్యంగా మసీదులు, దర్గాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరుతూ పెండింగ్‌లో ఉన్న వాటిపై ఏమైనా మధ్యంతర ఉత్తర్వులు లేదా తుది ఉత్తర్వులను జారీచేయకుండా తదుపరి ఉత్తర్వుల వరకూ నిషేధించింది.ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనల) చట్టం 1991లోని వివిధ నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన 6 పిటిషన్లపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ కొన్ని ముస్లిం సంస్థలు జోక్యం చేసుకోవాలని అనేక విజ్ఞప్తులు అందాయి. అఖిల భారతీయ సంత్ సమితి అనే హిందూ సంస్థ వివిధ కారణాలపై 1991చట్టంలోని సెక్షన్ 3, సెక్షన్ 4 చెల్లుబాటును సవాల్ చేసింది. చట్టంలోని సెక్షన్ 3 ప్రార్థనా స్థలాలను మార్చడాన్ని నిషేధిస్తుంది.

### గుండెను చీల్చి బయటకు తీసి...

# జర్నలిస్ట్ ముకేశ్ పోస్టుమార్టమ్‌లో వాస్తవాలు

**రాయ్‌పూర్ :** దాదాపు రూ.120 కోట్ల విలువైన కాంట్రాక్టులో అవినీతిని బయటపెట్టినందుకు హత్యకు గురైన జర్నలిస్టు ముకేశ్ చంద్రకర్ కేసులో ఒళ్లు గగుర్పొడిచే వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. హంతకులు అతడిని దారుణంగా కొట్టి... గుండెను చీల్చి బయటకు తీసినట్లు శవపరీక్షల్లో తేలింది.
ఇప్పటికే నిందితుడిని ఆదివారం హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేశారు. ముకేశ్ మతదేహానికి డాక్టర్లు శవ పరీక్ష ముగించారు. అతడి కాలేయం నాలుగు ముక్కలైనట్లు గుర్తించారు. అతడి పక్కటెముకలు ఐదు చోట్ల, తలపై 15 చోట్ల ఎముకలు విరిగిపోయాయి. అతడి గుండెను చీల్చినట్లు తేలింది. తమ 12 ఏళ్ల కెరీర్‌లో ఇంత భయానక హత్యను ఎన్నడూ చూడలేదని డాక్టర్లు వెల్లడించారు. ఇద్దరు కంటే ఎక్కువమందే ఈ హత్యలో పాల్గొన్నట్లు అనుమానం వ్యక్తంచేశారు. బస్తర్‌కు చెందిన ముకేశ్... అదే ప్రాంతంలోని గంగలూరు నుంచి హిరోలి వరకు రూ.120 కోట్లతో చేపట్టిన రోడ్డు ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ కథనం వెలువరించాడు. తొలుత రూ.50 కోట్ల టెండర్‌తో చేపట్టిన ఈ ప్రాజెక్టు... పూర్తిస్థాయి అభివద్ధి జరగకపోయినప్పటికీ రూ.120 కోట్లకు చేరుకుందని వెల్లడించాడు. అనంతరం అతడు కనిపించకుండా పోయాడు. ఆ తర్వాత ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ సురేశ్ చంద్రకర్ ఇంటి ఆవరణలోని సెప్టిక్ ట్యాంక్‌లో శవమై కనిపించాడు. పచ్చబొట్టు ఆధారంగా అతడిని గుర్తించారు. ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేశారు. కాగా, ముకేశ్ కేసులో కీలక నిందితుడైన కాంట్రాక్టర్ సురేశ్ చంద్రకర్‌ను హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేశారు.
అతడు ముకేశ్‌కు దూరపు బంధువు. హత్య జరిగిన రోజు నుంచి సురేశ్ కూడా అదృశ్యం కావడంతో పోలీసులు అతడిపై నిఘా వేశారు. చివరికి హైదరాబాద్‌లో తన డ్రైవర్ ఇంట్లో అతడు నక్కినట్లు గుర్తించారు.
ఇందుకోసం దర్యాప్తు బందాలు 200 సీసీ కెమెరాలను, 300 మొబైల్ నెంబర్లపై నిఘా వేశారు. ఇప్పటికే సురేశ్‌కు చెందిన బ్యాంక్ ఖాతాలను సీజ్ చేసి.. అక్రమంగా నిర్మిస్తున్న యార్డును ధ్వంసం చేశారు. అతడి భార్యను కూడా కస్టడీలోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

## లోయలో పడిన బస్సు... నలుగురి మృతి

**తిరువనంతపురం :** బస్సు లోయలో పడిన దుర్ఘటనలో నలుగురు ప్రయాణికులు మరణించారు. మరో32 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కేరళలోని కొటరక్కరదిండిగల్ జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వారిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బ్రేక్ ఫెయిల్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీస్ ఉన్నతాధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులోని తంజావూర్ పర్యటనకు వెళ్లిన యాత్రికులు తిరిగి స్వస్థలం అలప్పు జిల్లాలోని మావెలిక్కరకు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు. ఇడుక్కి జిల్లాలోని కల్లివాయల్ ఎస్టేట్ సమీపంలో ఉదయం ఈ దుర్ఘటన చోటు చేసుకుందని వివరించారు. మృతులను అరుణా హరి (55), రామ్మోహన్ (40), సంగీత (45), బిందు ఉన్నితాన్ (59)గా గుర్తించామన్నారు. పర్వత ప్రాంతంలో మలుపు తిరిగే క్రమంలో బస్సు బ్రేకులు ఫెయిల్ అయి... అదుపు తప్పి 70 అడుగుల లోతు ఉన్న భారీ లోయలోకి పడి పోయిందన్నారు. స్థానికులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, విపత్తు నిర్వహణ సంస్థకు చెందిన సిబ్బంది సహాయంతో సహాయక చర్యలు చేపట్టామని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

## ఇంటి పేరుపై రాజకీయమా?

### బిజెపి నేత వ్యాఖ్యలపై ఆతిశీ భావోద్వేగం

**న్యూఢిల్లీ:** తన ఇంటి పేరు లక్ష్యంగా బిజెపి మాజీ ఎంపి రమేశ్ బిదూడీ చేసిన వ్యాఖ్యలకు ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ ఆగ్రహం వ్యక్తంచేశారు. బిదూడి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఓట్ల కోసం ఇంతకు దిగజారుతారా అని ఆమె భావోద్వేగానికి గురయ్యారు. 'సిఎం ఆతిశీ ఆమె తండ్రినే మార్చేశారు. గతంలో ఆమెకు ఒక ఇంటి పేరు ఉండగా... ప్రస్తుతం మరో పేరు వినియోగిస్తున్నారు. అంతేకాకుండా, ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడ్డ అఫ్జల్ గురుకు క్షమాభిక్ష ప్రసాదించాలంటూ ఆమె తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారు' అని రమేశ్ బిదూడి ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై సోమవారం విలేకరుల సమావేశంలో స్పందించిన ఆతిశీ మండిపడ్డారు. 'నా తండ్రి ఒక ఉపాధ్యాయుడు. ప్రస్తుతం ఆయన ఒకరి సహాయం లేనిదే నడవలేని పరిస్థితిలో ఉన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం ఇంతకు దిగజారుతారా?ఒక వద్ధుడిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదు. దేశంలో రాజకీయాలు దిగజారిపోతున్నాయంటే నమ్మలేకపోతున్నాను' అని భావోద్వేగానికి గురయ్యారు. రమేశ్ బిదూడి వ్యాఖ్యలపై మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ ధ్వజమెత్తారు.

# 11 రోజుల్లో 10మంది రైతులు బలవన్మరణం

**భువనేశ్వర్ :** ఒడిశాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తాము పండించిన పంట పూర్తిగా నష్టపోవడంతో... ఆ బాధ తట్టుకోలేక 11 రోజుల్లో పది మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. బీజేపీ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందని, దీంతో వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ప్రతిపక్షపార్టీ బీజేడీ (బిజు జనతాదళ్) విమర్శించింది. తాజాగా సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైరాగిపాలి గ్రామానికి చెందిన 58 ఏళ్ల రత్నాకర్ భోరు ఇటీవల కురిసిన అకాల వర్షానికి పంట నష్టపోయిందన్న ఆవేదనతో ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం అతన్ని సంబల్‌పూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం 5 గంటల సమయంలో మతి చెందాడు. అకాల వర్షాలకు పంట నష్టపోవడం, అప్పుల బాధ తట్టుకోలేక తన తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆ రైతు కుమారుడు పరేశ్ కుమార్ తెలిపారు. కాగా, రైతుల మరణాలపై సీఎం మోహన్ చరణ్ మాఝీ స్పందించారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా రైతులకు నేరుగా పరిహారం అందేలా చూస్తామని సీఎం ప్రకటించారు. బీమా చేసిన రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద 15 రోజుల్లో పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. అయితే బీజేపీ ప్రకటనలు మాటలకే పరిమితమవుతున్నాయని బీజేడీ మాజీ ఎమ్మెల్యే రోహిత్ పూజారి విమర్శించారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే బీజేపీ నేతలు పండుగలు, సమావేశాల్లో బిజీగా ఉన్నారని, రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు.

# రామా ..? ఆ ఊర్లో ఇంటికో రోగి !

* 40 ఏళ్లకే వృద్ధాప్యం - కిడ్నీ, ఎముకల వ్యాధితో ఇంటికొకరు* మెలితిరిగిపోతున్న కాళ్లు - చక్కెర వ్యాధి పుష్కలం
* రామనర్సయ్య గ్రామ ప్రజల అవస్థలు



పచ్చని పల్లె కాలుష్యానికి సుదూరంగా ఉన్న ఆ పల్లె పక్కనే నాగార్జున సాగర్ ఎడమ ప్రధాన కాలువ. ఎటు చూసినా పంటలతో భూమికి ఆకుపచ్చని రంగు అద్దినట్లు ఉంటుంది. చూడగానే పల్లె ఇలా ఉండాలి ఇక్కడ ఉంటే బాగుంటుంది అన్న భావన కలుగుతుంది. కాని నాలుగేళ్లుగా ఆ గ్రామస్తులు పడుతున్న కష్టాలను చూస్తే మాత్రం కళ్లు చెమర్చక మానదు. ఒకరు కాదు ఇద్దరు కాదు ఇంటికొకరు ఏదో ఒక వ్యాధితో బాధపడుతున్నారు. గ్రామాన్ని మూత్రపిండాల వ్యాధి వణికిస్తుంది. ఎముకల నొప్పితో బాధపడుతున్న వారు ఇంటి కొకరు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. కాళ్లు వంకర పోయి, నడుము వంగిపోయి, కర్ర ఊతంగా లేకుండా నడవలేని దయనీయ స్థితి. ఇన్ని అవస్థలు పడుతున్న ఈ పల్లె ఖమ్మంజిల్లాలోని కొణిజర్ల మండల కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామనర్సయ్య నగర్. భూమి లేని నిరుపేదలు పోడు నరికి నిర్మించుకున్న ఈ నవ నిర్మిత గ్రామం ఇప్పుడు అష్టకష్టాలు పడుతుంది.

**ప్రజాపక్షం/ఖమ్మం :** కరోనా తర్వాత కొత్త కష్టాలు సరి కొత్త జబ్బులు యావత్ దేశాన్ని ఇబ్బందిపెడుతున్నట్లు గానే రామనర్సయ్య గ్రామాన్ని నాలుగేళ్ల నుంచి వివిధ వ్యాధులు చుట్టుముట్టాయి. దీనితో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాయకష్టం చేసిన వారు చూస్తుండగానే కదలలేని స్థితికి చేరుకున్నారు. మూత్రపిండాలు వాపు రావడం లేదా కుచించుకుపోవడం ఇతరత్రా కారణాలతో శరీరం వాపు వచ్చి తీవ్రమైన వేదనకు గురవుతున్నారు. ఖమ్మం, విజయవాడ, హైదరాబాద్ నగరాల్లోని ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతూ వ్యాధులను తగ్గించుకునేందుకు పాట్లు పడుతున్నారు. ఈ గ్రామంలో నూటికి 90శాతం మంది పేదలే. గిరిజన జనాభా కూడా ఎక్కువే. పోడు సాగుపైనే ఆధార పడి జీవించే ఈ గ్రామస్తులను ఒక్కసారిగా వ్యాధులు చుట్టుముట్టడంతో సరైన వైద్యం పొందలేక, శరీరక బాధలు భరించలేక మానసికంగా కుంగిపోతున్నారు. 40 ఏళ్లకే వృద్ధులుగా మారిపోతున్నారు. ఎముకల వ్యాధితో కాళ్లు మెలితిరిగిపోయి నడవలేని స్థితికి నెట్టివేయబడుతున్నారు. దీనికి తోడు కాయకష్టం చేసే వారిని చక్కెర వ్యాధి సైతం ఇబ్బందిపెడుతుంది. 30 నిమిషాలు నడిస్తే చక్కెర వ్యాధి నియంత్రణలో ఉంటుందని చెబుతున్న ఈ రోజుల్లో రోజంతా పని చేసే వారిని ఈ వ్యాధి వేధిస్తుండడం శోచనీయం. పక్షవాతం, చాలా మందికి వచ్చి కాళ్లు, చేతులు చచ్చుపడిపోయాయి. ఇవి చాలవన్నట్లు గ్రామంలో 50 శాతం మందికి క్రమంగా కంటి చూపు తగ్గిపోయింది. నాలుగైదేళ్ల క్రితం వరకు ఆరోగ్యంగా ఉన్న ఈ పల్లెకు ఇప్పుడు ఈ దుస్థితి ఎందుకు వచ్చిందో అర్థం కావడం లేదు. కరోనా తర్వాత మినరల్ వాటర్ ఎక్కువగా వాడుతున్నారని మినరల్ వాటర్ వల్లనే వ్యాధుల బారీన పడ్డామని కొందరు అంటుండగా మిషన్ భగీరథ నీరు వాడుతున్న వారిలో కూడా జబ్బులు రావడం గమనార్హం. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో 80 శాతం మంది ప్రజలు ఏదో ఒక వ్యాధితో ఇబ్బందులు పడుతున్న తీరును గమనించి గ్రామంలో పల్లె దవాఖానాను ఏర్పాటు చేయాలని ఎముకలు, మూత్రపిండాలు, ఇతర వ్యాధులకు సంబంధించి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గ్రామస్తులకు సోకిన వ్యాధులను దృష్టిలోఉంచుకుని ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**40ఏళ్లకే వృద్ధుడిలా !**
అంగోత్ పుల్యా వయస్సు 42 ఏళ్లు. కాయకష్టం చేసి కుటుంబాన్ని పోషించుకునే పుల్యాకు మూడేళ్ల క్రితం పక్షవాతంలా వచ్చింది. కాలు చచ్చుపడిపోయింది. వైద్య సేవలు పొందుతుండగానే మాట పడిపోయింది. పుల్యా ఇప్పుడు మాట్లాడలేడు, నడవలేడు. ఆయనపై ఆధారపడిన ఆ కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. వైద్యం పొందేందుకు ఆర్థిక పరిస్థితి బాగాలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

**మూత్రపిండాల వ్యాధి ఈ స్థితికి చేర్చింది :**
గుగులోత్ టోక్యా నాలుగేళ్ల క్రితం వరకు ఆరోగ్యంగా ఉండి కాయకష్టం చేసేవాడు. భూమి కౌలుకు తీసుకుని కుటుంబాన్ని పోషించుకునే టోక్యాకు కాళ్ల నొప్పులతో మొదలై ఇప్పుడు నడవలేని స్థితికి చేరుకున్నాడు. కిడ్నీ వ్యాధి కారణంగా ఏ పని చేయలేక కుటుంబానికి భారంగా మారాడు. 45 ఏళ్ల వయస్సులోనే వృద్ధుడిగా మారిపోయాడు.

**ఒళ్లంతా మంటలతో ఇబ్బందిపడుతున్న లాక్యా :**
ధర్మసోత్ లాక్యా వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. కొద్ది నెలల క్రితం అరికాళ్ల మంటలు వచ్చాయి. ఏదో వ్యాధి సోకిందని ఆసుపత్రికి వెళితే ఒక కిడ్నీ చెడిపోయిందని ఆపరేషన్ అవసరం అంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబ పోషణకు కష్టమైన పరిస్థితుల్లో ఆపరేషన్ చేయించుకునే స్థితి లేక బాధను అనుభవిస్తూ కాలం గడుపుతున్నాడు.

**శరీరమంతా వాచి ఇబ్బందిపడుతున్న విజయ :**
గుగులోత్ విజయకు 30 ఏళ్ల వయస్సు ఉంటుంది. కొద్ది రోజుల క్రితం శరీరంలో దురదలు వచ్చాయి. ఆ తర్వాత ఒళ్లు మొత్తం పాము పొడల మాదిరి శరీరమంతా వ్యాపించింది. దానికి తోడు శరీరం వాపు రావడంతో ఖమ్మంలోని వైద్యులను సంప్రదిస్తే ఓ కిడ్నీ చెడిపోయింది కిడ్నీ ఆపరేషన్ అవసరమన్నారు. రెక్కాడితే కాని డొక్కాడని విజయ కుటుంబం వైద్య సాయం పొందలేక భగవంతుని పై భారం వేస్తూ కాలం గడుపుతున్నారు.

పల్లె దవాఖానా ఏర్పాటు చేయాలి : కంపసాటి వెంకన్న
గ్రామాన్ని వ్యాధులు చుట్టుముట్టడంతో గ్రామంలో పల్లె దవాఖానాను ఏర్పాటు చేసి నిరంతరం వైద్య సేవలను అందించాలని సిపిఐ మండల నాయకులు, రామనర్సయ్య నగర్ గ్రామవాసి కంపసాటి వెంకన్న కోరారు. నాలుగేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న అధికార యంత్రాంగం ఈవైపు కన్నెత్తి చూడలేదన్నారు.ఈ వ్యాధులకు కారణం ఏమిటో అన్వేషించాలని తద్వారా నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

**వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి : శివ**
వైద్య శిబిరం ఏర్పాటు చేసి వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి తక్షణం వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ గ్రామశాఖ కార్యదర్శి గుగులోత్ శివ కోరారు. పేదవారు కావడంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య సాయం పొందలేకపోతున్నారని దీనితో అధికారులు వైద్య సాయం అందేవిధంగా తగు చర్యలు చేపట్టాలని కోరారు.

## ఒప్పందాలు అమలు చేయండి

- హమాలీల జీవితాలతో ఆడుకోవడం సరికాదు
ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి



**ప్రజాపక్షం/భద్రాచలం:**సివిల్ సప్లై, జిసిసి హామీలల రేట్లు పెంపుపై ఇచ్చిన ఒప్పందాన్ని అధికారులు నిలబెట్టుకోవాలని ఎఐటియుసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ ముందు జిల్లా నలు మూలల నుండి తరలివచ్చిన హామీలతో ధర్నా నిర్వహించారు.ఈ సందర్బంగా నరాటి మాట్లాడుతూ గత నాలుగు నెలల క్రితం జరిగిన ఒప్పందం ప్రకారం కమీషనర్ గెజిట్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, కానీ నేటికీ ఆ హామీ నెరవేరలేదన్నారు. ఈ నిర్లక్ష్యం కారణంగా డిసెంబర్ 18న కమీషనర్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేశామని, అప్పుడు కూడా డిసెంబర్ 31 నాటికి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చిరన్నారు. అయినప్పటికీ హామీ అమలుకాకపోవడంతో జనవరి 1వ తేది నుండి హమాలీ కార్మికులు సమ్మెలో ఉన్నారని, దీనంతటికీ కమీషనరే కారణం అన్నారు. ఇప్పటికైనా పెంచిన హమాలీ రేట్ల జిఓను వెంటనే విడుదల చేసి బకాయిలు చెల్లించాలని, పెంచిన బోనస్, కట్టుకూలి, మహిళా కార్మికులకు పెంచిన జీతాలు, ఐడి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెక్కలమీద ఆధారపడి జీవిస్తున్న జిసిసి, సివిల్ సప్లై హమాలీలకు ఇచ్చే నగదు లేని స్థితిలో ప్రభుత్వం ఉందా అని నరాటి విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా సహాయ కార్యదర్శి గెద్దడి నగేష్, సదానందం, రమణయ్య, దుర్గయ్యతో పాటు సిఐటియూ నాయకులు వంగూరి రాములు, బ్రహ్మచారి, జిల్లా నలు మూలల నుండి తరలివచ్చిన హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

## నేత్ర స్వచ్ఛంద సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/భద్రాచలం:**ఏజెన్సీ ప్రాంతంలో నేత్ర స్వచ్ఛంద సేవలు చేస్తూ పలువురుకి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తూ అంధత్వ నివారణకు చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా కలెక్ట్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మారుతీ నర్సింగ్ కాలేజీ, లయన్స్ క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో ఎస్ఆర్ వాసవి అసోసియేషన్, యుఎస్ఏ పుష్పగిరి కంటి ఆస్పత్రి సికింద్రాబాద్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం విజయవంతమైంది. మారుతీ కాలేజి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ స్వచ్ఛంద సేవలను అభినందించారు. అంధత్వ నివారణ కొరకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, ఈకార్యక్రమానికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. సికిల్ సెల్స్ ఎనీమియా, తలసేమియా ఎక్కువగా ఈ ప్రాంతంలో ఉందని, నివారణ కొరకు వార్డును అభివృద్ధి పరుస్తామని చెప్పారు. రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తహీనత నివారణకు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ వెంకటపుల్లయ్య, ఏహెచ్ సూపరింటెండెంట్ డా. రామకృష్ణ, డా. సంతోష్ పాల్గొన్నారు.

## సామాజిక సేవ ఓ వరం :కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం :** సామాజిక సేవ ఓ వరం లాంటిదని సామాజిక చైతన్యానికి, అభివృద్ధికి కృషి చేయడం ముఖ్యంగా విద్యాభివృద్ధికి చేయూతనివ్వడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు రూపొందించిన 2025 సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తూ చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ట్రస్టు సేవలు మరింత విస్తృత పర్చాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు పరిశ పుల్లయ్య, ట్రస్టు బాధ్యులు కనపర్తి వెంకటేశ్వర్లు, నంబూరి శంకర్‌రావు, మీడియా ప్రతినిధులు ఏనుగు వెంకటేశ్వరరావు, నలజాల వెంకట్రావు, రాఘవపాల్గొన్నారు

## బిజెపి నేత వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ నిరసన

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీపై బిజెపి నేత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ, జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బిజెపి మాజీ ఎంపి రమేష్ బిధూరి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా మాట్లాడుతూ బిజెపి నాయకులకు మహిళలంటే చిన్నచూపని వారు ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బిజెపి మాజీ ఎంపి ఢిల్లీ అసెంబ్లీ కల్కాజి బిజెపి అభ్యర్థి రమేష్ బిధూరి ఎంపి ప్రియాంక గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రమేష్ టికెట్‌ను రద్దు చేసి రానున్న రోజుల్లో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. బిజెపి ప్రభుత్వం మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుచ్చకాయల వీరభద్రం, మొక్కా శేఖర్‌గౌడ్, బొందయ్య, సయ్యద్ గౌస్, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, పల్లెబోయిన భారతిచంద్రం, కన్నం వైష్ణవి ప్రసన్న, గజ్జెల్లి వెంకన్న, ప్రతిభారెడ్డి, భవాని, రమాదేవి, జ్యోతి, నాగమణి, నీలవేణి, సుగుణ, ఉమాదేవి, జ్యోత్స్న, సమీరా, రహిమా, బండి నాగేశ్వరరావు, ఏలూరి రవికుమార్, కిలారు అనిల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## తాత మధును కలిసిన బిఆర్ఎస్ నాయకులు

**ప్రజాపక్షం/భద్రాచలం:** ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంఎల్‌సి తాత మధును భద్రాచలం పట్టణ బిఆర్ఎస్ నాయకులు సోమవారం ఖమ్మంలో కలిశారు. ఈ మేరకు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించిన బిఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజ్ సునీల్ కుమార్ నూతన సం.శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భద్రాచలం పట్టణంలో పార్టీ కార్యకలాపాలు, కార్యకర్తల మనోభావాలు, పార్టీ పురోభివృద్ధిపై వారిద్దమరి మధ్య కొద్దిసేపు చర్చ సాగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు బనాల రామకృష్ణ, బిసి సెల్ నాయకులు సాయి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


## డా. సుదర్శన్‌కు అభినందనల వెల్లువ

**ప్రజాపక్షం/భద్రాచలం:**పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డా. సుదర్శన్‌కు పలువురు అభినందనలు తెలియజేశారు. అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఆయన బాధ్యతలు చేపట్టడంతో ఆయనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు సిపిఎం బృందంతో పాటు పట్టణానికి చెందిన మెడికల్ అసోసియేషన్ సభ్యులు ఆయనను స్వయంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందించారు. సుదర్శన్ దంపతులను శాలువాతో కప్పి సత్కరించారు. దైవకార్యాన్ని బుజాలపై ఎత్తుకుని ముందుకు సాగేందుకు నిర్ణయించుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ రామభంటులా కార్యదీక్షతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, మెడికల్ అసోసియేషన్ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, గద్దం స్వామి, , మురళీ పాల్గొన్నారు.

## తులం బంగారం ఎక్కడ ?


రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం
మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ధ్వజం

**ప్రజాపక్షం/ తల్లాడ:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల నెరవేర్చటంలో విఫలమైందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. సోమవారం తల్లాడ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కేటిఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తానని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటి వరకు పూర్తిస్థాయిలో అమలు కాలేదని, కళ్యాణలక్ష్మి పథకం బిఆర్ఎస్ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తే ఆరోజు విమర్శించిన కాంగ్రెస్ నాయకులు, పెళ్లైన ఆడపడుకు తులం బంగారం లక్షరూపాయలు నగదు ఇస్తానని హామీ ఇచ్చి నేటి వరకు ఎక్కడ అమలు చేసిన దాఖలాలులేవని, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 20హామీలు కూడా నెరవేర్చలేదని విమర్శించారు. పేరుకే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని, గ్రామాల్లో ఎక్కడ బస్సులు తిరిగే పరిస్థితి లేకుండా పోయిందని, ప్రధాన పట్టణాలకు వెళ్లే సంఖ్య కూడా పూర్తిస్థాయిలో తగ్గించారని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నూకలు చెల్లాయని, ప్రజల నుండి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ఈ ప్రభుత్వం ఇంకా ఎన్నో రోజులు మనుగడ సాధించలేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వీర మోహన్‌రెడ్డి, మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు దుగ్గిదేవర వెంకటలాల్, వెంకన్న, శ్రీనివాసరావు, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ లేకుండా త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమ సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డిలతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. సత్తుపల్లి మండలం గంగారం పిహెచ్‌సికి చెందిన ఎన్. మారేశ్వరి తాను కాంటిన్జెంట్ వర్కర్‌గా పనిచేస్తున్నానని నెలకు ఐదు వేల రూపాయల వేతనం ఉందని గత 30 నెలలుగా హెచ్‌డిఎస్ బడ్జెట్ లేదని వేతనం ఇవ్వడం లేదని పెండింగ్ వేతనం ఇప్పించాలని, ఫుల్ టైం వర్కర్‌గా నియమించాలని దరఖాస్తు చేశారు. తల్లాడ మండలం కలకోడిమ గ్రామానికి చెందిన అదూరి శిరీష ఎస్సి కుటుంబానికి చెందిన నిరుపేద మహిళనని గతంలో ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇల్లు కొరకు దరఖాస్తు చేసుకున్నానని ప్రస్తుతం సర్వేలో తన పేరు రాలేదని తనకు ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. కారేపల్లి మండలంకు చెందిన బాదవత్ రాము ఏన్కూరు మండలం గార్లొడ్డు గ్రామంలోని లక్ష్మి నర్సింహా స్వామి ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నారాయణరావును పరిశ అనంతరామయ్య ట్రస్టుకు చేసిన అక్రమ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, డిఆర్‌వో రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలను నియంత్రించాలి




**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగాన్ని సమూలనంగా నియంత్రించాలని దీనిపై క్షేత్ర స్థాయిలో పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలని అడిషనల్ డిసిపిలు నరేష్‌కుమార్, ప్రసాదరావులు అన్నారు. సోమవారం స్థానిక పోలీసుకమిషనర్ కార్యాలయంలో జి ల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వారు పాల్గొని మాదక ద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలు, రోడ్డుప్రమాదాల నియంత్రణకు తీసుకోవల్సిన చర్యలపై దిశనిర్ధేశం చేశారు. ప్రధానంగా విద్యార్థులు మత్తు పదార్థలకు బానిస కాకుండా విద్యాసంస్థల్లో యాంటి డ్రగ్స్ కమిటీలు ఏర్పాటుచేసి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ర్యాలీలు, సదస్సులు నిర్వహించి మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనార్థలపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా కట్టుదిట్టమైన నిఘాతో గంజాయి , మత్తుపదార్థల రవాణా, వినియోగానికి అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.
**సైబర్ నేరాలపై అప్రమత్తం..**అదేవిధంగా సైబర్ నేరగాళ్ల బారిన పడ్డామని గుర్తించిన వెంటనే సదరు బాధితులు సైబర్ క్రైం వెబ్‌సైట్ లేదా నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. ఫలితంగా నేరగాళ్లు వినియోగించే ఖాతాలను గుర్తించి వాటిలో లావాదేవీలు బదిలీ కాకుండా అడ్డుకట్ట వేయవచ్చన్నారు. పోయిన డబ్బును తిరిగి రాబట్టెందును వీలు ఉంటుందన్నారు. నష్టపోయామని గుర్తించి గంట సమయంలోపు ఫిర్యాదు చేస్తే ఈ ప్రక్రియ సులభతరమవుతుందన్నారు. సైబర్ నేరాల్లో ఎక్కువగా ఒటిపిసంబంధించినవి, తప్పుడు సమాచారం, మోసపూరిత వాగ్ధానాతో జరిగే లావాదేవీలు ఎక్కువగా ఉంటాయన్నారు. కాబట్టి వీటిపై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు.
**రోడ్డు ప్రమాదాలు నివారణకు చర్యలు..**రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తాంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను విశ్లేషించి భద్రతా కమిటీలు పర్యవేక్షణలో అవసరమైన చర్యలు తీసుకుని ప్రమాదాలను తగ్గించాలన్నారు. ఇప్పటికే జిల్లాలో గుర్తించిన 68 బ్లాక్‌స్పాట్‌ల వద్ద శాఖాల వారిగా ఆయా ప్రాంతాల్లో బారికేడ్‌లు, స్టాపర్‌లు, సూచిక బోర్డులు, సిగ్నల్, బ్లింకింగ్ లైట్స్ ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ, రాష్ట్ర ప్రధాన రహదారులతో పాటు వివిధ గ్రామాలు, ప్రాంతాల నుంచి అనుసంధనం చేసిన రోడ్లపై అవసరమైన చోట వేగ నియంత్రికలు నిర్మించాలన్నారు. అదేవిధంగా ప్రధాన రహదారులపై హెచ్చరిక బోర్డులు, మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడం, కార్లు నడిపే వారు సీటు బెల్టు, ఇతర మోటారు వాహన చట్టంలోని నిబంధనలు తప్పనిసరి చేయాలని వీటిని అమలు చేస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అడిషనల్ డిసిపిలు అన్నారు.

## పారదర్శకంగా ఓటరు జాబితా

జిల్లాలో 98.15 శాతం ఓటరు కార్డులు పంపిణీ
కామన్ డైట్ అమలు పర్యవేక్షించాలి
ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బాలమాయదేవి





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తూ పారదర్శంగా ఓటరు జాబితా ఉండాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాలమాయదేవి తెలిపారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో ఓటరు సవరణ జాబితా 2025పై ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లా అధికారులతో ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాలమాయదేవి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఖమ్మం అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డిలు పాల్గొని ఖమ్మంజిల్లాలో ఓటరు సవరణ జాబితా 2025పై జిల్లాలో చేపట్టిన చర్యలను వివరించారు. ఓటరు తుది జాబితా వివరాలు, జనాభా ఓటర్ల నిష్పత్తి, మహిళలు, పురుషుల ఓటర్ల నిష్పత్తి, డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ తర్వాత వచ్చిన దరఖాస్తులు, వాటి స్థితిగతులు, ఓటరు కార్డుల డెలివరి వంటి పలు అంశాలను అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మాట్లాడుతూ ఓటర్ల తుది జాబితాను విజయవంతంగా ప్రచురించినందుకు అధికారులందరికీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. నూతన ఓటర్ల నమోదు కొంత తక్కువగా ఉన్న నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ సమయంలో మాత్రమే కాకుండా ఇతర సమయాల్లో కూడా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఓటరు తుది జాబితా వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు సాఫ్ట్ కాపీ, హార్డ్ కాపీ అందజేయాలని అధికారులకు సూచించారు. బిసి సంక్షేమ శాఖ పరిధిలో నడిచే గురుకులాల్లో పిల్లలకు అందిస్తున్న కామన్ డైట్ అమలు జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కామన్ డైట్ ప్రకారం పిల్లలకు కూరగాయలు, నాన్‌వెజ్ భోజనం అందేలా చూడాలని హాస్టల్స్‌ను ర్యాండమ్‌గా పరిశీలించాలన్నారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తూ భోజన నాణ్యతను పరిశీలించాలని బిసి సంక్షేమ శాఖ కమిషనర్ కూడా అయిన బాలమాయదేవి తెలిపారు. అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ జిల్లాలో జనాభా ఓటర్ల నిష్పత్తి 695 ఉందన్నారు. నూతన ఓటర్లకు ఓటరు కార్డు ముద్రణకు పంపామని జిల్లాలో 98.15 శాతం ఓటరు కార్డుల పంపిణీ పూర్తి చేశామన్నారు. ఓటరు జాబితా సవరణ జిల్లాలో పారదర్శకంగా నిర్వహించామని ప్రతి దశలో రాజకీయ పార్టీల ప్రతినిధులను భాగస్వామ్యం చేశామన్నారు. జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలు ఉన్నాయని వాటికి సంబంధించి మొత్తం 12,30,572 ఓటర్లతో తుది జాబితాను తయారు చేశామని, మహిళలు, పురుషుల నిష్పత్తి 1076గా ఉందన్నారు. ఈ సమావేశంలో పిఒ ఐటిడిఒ భద్రాచలం బి. రాములు, మూడు జిల్లాల ఇఆర్‌ఒలు, ఎఆర్‌ఒలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సొసైటీలకు ప్రతిపాదనలు

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేయడంతో పాటు నూతన సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న సొసైటీల పరిధిలో ఉన్న గ్రామాలకు, సొసైటీకి దూరం ఎక్కువగా ఉండడంతో వాటిని తగ్గించేందుకు ప్రభుత్వం దృష్టిసారించింది. రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వ్యాపారాభివృద్ధికి తోడ్పాటునందించేలా ప్రస్తుతం ఉన్న సొసైటీలకు అనుగుణంగా వాటి పరిధిలోని గ్రామాలను అనుసంధానం చేస్తూ నూతన సొసైటీలకు శ్రీకారం చుట్టింది. రఘునాథపాలెం మండలంలో ప్రస్తుతం వి.వెంకటాయపాలెం, మంచుకొండ, రఘునాథపాలెం సొసైటీలు ఉండగా మరో నాలుగు సొసైటీలు ఏర్పాటు కానున్నాయి.ప్రస్తుతం వి. వెంకటాయపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలో ప్రస్తుతం 18 గ్రామాలున్నాయి. ఖమ్మం నగరంలోని అల్లిపురం కేంద్రంగా ఏర్పాటు చేసే సొసైటీ పరిధిలోకి అల్లిపురం, కొత్తగూడెం, ధంసలాపురం ప్రాంతాలను చేర్చారు. మంచుకొండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలో ప్రస్తుతం 30గ్రామాలు ఉన్నాయి. ఈ సొసైటీ పరిధిలో మరో రెండు సొసైటీలు చిమ్మపుడి, ఈర్లపుడి కేంద్రంగా సొసైటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. ఈర్లపుడి కేంద్రంగా ఏర్పాటు చేసే సొసైటీ పరిధిలోకి ఈర్లపుడి, మంగ్యాతండా, మూలగూడెం తదితర గ్రామాలతో నూతన సొసైటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. నూతన సొసైటీలు ఏర్పాటైతే రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. సొసైటీలకు వెళ్లేందుకు ఆయా గ్రామాల రైతులకు దూరం తగ్గడంతో పాటు సత్వర సేవలు అందే అవకాశం ఉంటుంది. గతంలో కోయచలక, పాపటపల్లి కేంద్రాలుగా సొసైటీలు ఉండగా వాటిని 2005లో మంచుకొండ సొసైటీలో అనుసంధానం చేశారు. మరల ఇప్పుడు చిమ్మపుడి, ఈర్లపుడి కేంద్రంగా నూతన సొసైటీలను ఏర్పాటు చేయనున్నారు.

## ఆతిథ్యం.. అదుర్స్!

గోదావరి తీరంలో విడిదిళ్లు
ఆకట్టుకుంటున్న ప్రదేశం





**ప్రజాపక్షం/భద్రాచలం:** భక్తులను, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా గోదావరి తీరంలో ఏర్పాటు చేస్తున్న విడిదిళ్ళ ఆతిధ్యం అదుర్స్ లా ఉంది. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ నేతృత్వంలో ఐటిడిఎ పిఒ పర్యవేక్షణలో సాగుతున్న విడిదిళ్ల పనులు చరమాంకానికి చేరుకున్నాయి. సుమారు 20కి పైగా అతిధి విడిదిళ్లను గోదావరి తీరంలో ఏర్పాటు చేశా రు. ఓ ప్రక్క గోదావరి అందాలు, నదీ అలలపై సూర్యకాంతుల వెలుగులు ప్రసరించే ప్రదేశంలో ఏర్పాటు చేసిన ఈ విడిదిళ్లు ఆకర్షణీయంగా ఉన్నాయి. జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేదాన్లో భాగంగా భద్రాచలం గోదావరి కరకట్ట క్రింది భాగంలో ఏర్పాటు చేశారు.మరో ప్రక్క భద్రతలో భాగంగా వెదురు బొంగులతో మంచెను సిద్ధం చేశారు. పూర్తిసోలార్ వెలుగులతో ఉండేలా ఆ ప్రాంతంలో 20 సోలార్ లైట్లను అమర్చారు. స్వామి వారి తెప్పోత్సవం, ముక్కోటి ఏకాదశికి వచ్చే భక్తులు ఈ విడిదిళ్లలో సేద తీరి ప్రకృతి సోయగాలను, గోదావరి హొయలను తనివితీరా అనుభవించేలా చేసిన ఏర్పాట్లు చూడముచ్చటగా ఉన్నాయి. ఈ విడిదిళ్లలో బస చేసే వారి కోసం అదే ప్రదేశంలో తాత్కాలిక మరుగుదొడ్లను, నీటి వసతిని ఏర్పాటు చేశారు. దీనికి సమీపంలో సెల్ఫీ పాయింట్‌ను కూడా సిద్ధం చేశారు. రాత్రి వేళల్లో ఈ ప్రాంతం సోలార్ కాంతులతో కొత్త సోయగాలను సంతరించుకుంది. ఈ ప్రాంతంలో గిరిజన వంటకాలు, అటవీ ఉత్పత్తులతో తయారు చేసే ఆహార పదార్థాలు, గంజి, జావ, గటక, ఇతర గిరిజన సాంప్రదాయ వంటకాలను కూడా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
**ఐటిడిఎలోనూ** ///పర్యాటకులను ఆకర్షించే విధంగా ఐటిడిఎ ఆవరణలో గిరిజన మ్యూజియాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అస్సాంకు చెందిన ప్రత్యేకమైన వెదురు బొంగులను తెప్పించిన ఐటిడిఎఅధికారులు అక్కడి వారితోనే కట్టడాలు నిర్మించారు. పూర్తి వెదురుతో నిర్మించిన మూడు ఇల్లు ఆకట్టుకునేలా ఉన్నాయి. మరో ప్రక్క మట్టితో నిర్మించిన గిరిజన సహజ సిద్ధ నివాసం కూడా ఇక్కడే ఉంది. గిరిజనులు తరతరాలుగా వినియోగించే వస్తువులు, వేటకు వాడే ఆయుధాలు, పరికరాలు, నిత్యవసరాలు, గృహోపకరణాలు కూడా ఈ మ్యూజియంలో అందుబాటులో ఉన్నాయి. భద్రాచలం వచ్చే యాత్రికులు, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దిన ఈ మ్యూజియంపై పెద్ద ఎత్తున ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. రామాలయానికి వచ్చిన వారు సైతం ఈ మ్యూజియాన్ని తిలకించేలా ఐటిడిఏ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తుండటంతో పాటు గిరిజన వంటకాలను అందుబాటులో ఉంచనున్నారు.

# 'హెచ్‌ఎంపివి' కొత్త వైరస్ కాదు..

### భయపడాల్సిన అవసరం లేదు : మంత్రి దామోదర రాజనర్సింహ్మ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హెచ్‌ఎంపివి అనేది కొత్త వైరస్ కాదని, 2001 సంవత్సరంలోనే ఈ వైరస్ ఉనికిని కనుగొన్నారని, అప్పటి నుంచే ఈ వైరస్ ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తిలో ఉన్నదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. హెచ్‌ఎంపివి వైరస్ శ్వాసకోశ వ్యవస్థపై స్వల్ప ప్రభావం చూపుతుందని, ఈ వ్యాధి సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, ఆయన నోటి నుంచి వచ్చే తుంపర్ల ద్వారా మరొకరికి వైరస్ వ్యాపిస్తుందని మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైనాలో ఈ సంవత్సరం హెచ్‌ఎంపివి కేసులు ఎక్కువ సంఖ్యలో నమోదవుతున్నట్టు తెలుస్తోందని, ఇతర దేశాలు, ఇతర రాష్ట్రాల్లో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని, కేంద్ర ఆరోగ్యశాఖ అధికారులతో, తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటున్నామని తెలిపారు. ఈ వైరస్ విషయంలో ప్రస్తుతానికి భయపడాల్సిన అవసరం లేదని, జాగ్రత్తగా ఉంటే సరిపోతుందని, రాష్ట్రంలో అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉన్నదని ఆయన భరోసానిచ్చారు. డిసీజ్ సర్వైలెన్స్ సిస్టమ్‌ను మరింత బలోపేతం చేయాలని, అన్నిరకాల వనరులతో సిద్ధంగా ఉండాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను, జిల్లా అధికారులను ఆయన అప్రమత్తం చేశారు. సోషల్ మీడియాలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా నిరాధార, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తే, ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంటుందని హెచ్చరించారు.

## తిరుమల బ్యాంకు– 2025 క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** తిరుమల బ్యాంకు– 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. క్యాలెండర్ ఆవిష్కరణలో కేదార్‌నాథ్ నుంచి వచ్చిన సద్గురు దయానిధి స్వామిజీ, తిరుమల బ్యాంకు చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్, జితేందర్ తివారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కొత్త సంవత్సర శుభాకాంక్షలు గవర్నర్‌కు తెలిపారు. తిరుమల



బ్యాంకు మూడో బ్రాంచి ప్రారంభానికి రావాలని ఆహ్వానించారు.

### రైతు సంక్షేమం కోసం

# ప్రభుత్వం నిరంతరం కృషి

### సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**ప్రజాపక్షం/షాబాద్ :** రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌లు పేర్కొన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సభ అధ్యక్షునిగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, వైజ్ చైర్మన్ జంగయ్య, ఇతర కమిటీ సభ్యులకు మార్కెట్ శాఖ అధికారులు రియాజ్, సర్దార్‌నగర్ మార్కెట్ సెక్రటరీ సుజాత ప్రమాణ స్వీకారం చేయించారు. చేవెళ్ల నియోజకవర్గం, షాబాద్ మండల పరిధిలోని తిమ్మారెడ్డి గూడ మంత్రి తుమ్మలకు, స్పీకర్‌కు గొర్రె పిల్లల గొంగళి వేసి ఘన స్వాగతం పలికారు. ఎట్లా ఎర్రవలి గ్రామంలోని రూ.5కోట్లతో వంతెనను ప్రారంభించారు. గ్రామంలో రూ.10లక్షల నిధులతో సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. సర్దార్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. చేవెళ్ల మార్కెట్ యార్డ్‌లో వ్యాపార సముదాయ గోదామును ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్



రావు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటైన తెలంగాణ రాష్టంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల పాలనలో అప్పుల రాష్టంగా అభివృద్ధి చేసిందని చెప్పారు. బిఆర్‌ఎస్ చేసిన అప్పులకు మిత్తి అసలు కట్టడానికే సంవత్సర కాలం పట్టిందని వివరించారు. పంట సాగు చేసే ప్రతి రైతుకు సంక్రాంతి నుండి రైతు భరోసా పథకం అమలు చేస్తామన్నారు. రైతుల సంక్షేమం కోసం 35 శాతం నిధులు కేటాయిస్తున్నట్లు వివరించారు. అవుటర్ రింగు రోడ్డు దగ్గరలో అధునాతన అత్యధునిక సాంకేతికంగా నూతన మార్కెట్ యార్డ్‌ను నిర్మించి రైతులకు మౌలిక వసతులు కల్పించే విధంగా అందుబాటులోకి తెస్తామని చెప్పారు. కోహెడ దగ్గర పండ్ల మార్కెట్‌ను ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేస్తామన్నారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు న్యాయం జరిగిందని చరిత్రలో చెపుకునే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఒకేసారి రూ. 2 లక్షల రుణమాఫీ చేయడం చరిత్రలో ఎక్కడా లేదని కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంకే సాధ్యం అన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రాంత రైతులు భూములు అమ్ముకోవద్దని ప్రతి సందర్భంలో రైతులకు విన్నవిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి రంజిత్ రెడ్డి, మాజీ ఎంఎల్‌సి యాదవ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహ్మ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జ్ పామెన భీంభరత్, రాష్ట కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు సత్యనారాయణ రెడ్డి, రాష్ట అధికార ప్రతినిధి గౌరీ సతీష్, షాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, టిపిసి ప్రధాన అధికార ప్రతినిధి పామెన భార్గవ్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

### సంక్రాంతి పండుగ వేళ..

# పతంగులతో పాటు పక్షులనూ ఎగరనిద్దాం

### ప్రజలకు అటవీ శాఖ పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంక్రాంతి పండుగ వేళ పతంగులతో పాటు పక్షులకు తెలంగాణ అటవీ శాఖ పిలుపునిచ్చింది. గాలిపటాలు ఎగరవేసేందుకు కేవలం కాటన్ దారాలు మాత్రమే వాడాలని కోరింది. పతంగుల వినియోగంలో ఎట్టి పరిస్థితుల్లో చైనామాంజ వాడకూడద, చైనా మాంజా అమ్మినా, నిలువ, రవాణా చేసినా చట్ట ప్రకారం శిక్షలు తప్పవని అటవీ దళాల ప్రధాన సంరక్షణ ఆధికారి ఆర్ఎం డోబ్రియాల్ హెచ్చరించారు. ఈ సందర్భంగా డోబ్రియల్ మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ అంటేనే పర్యావరణ హితంగా జరగాల్సిన ఈ సంబురమని చైనీస్ మాంజా వినియోగంతో మనుషులతో పాటు మూగజీవాలు ఆ దారలకు చిక్కుకొని మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. కొన్ని పక్షులు రెక్కలు, కాళ్లు కోల్పోయి జీవచ్ఛవంలా మారుతున్నాయన్నారు.. సంక్రాంతి పండగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని... కానీ పండుగ సందర్భంగా ఎగరవేసే పతంగుల వల్ల పర్యావరణం, పక్షులకు హాని జరగకుండా చూడాలని అటవీ శాఖ కోరింది నైలాన్, సింథటిక్ మాంజా (చైనీస్ మాంజా) వాడకం వల్ల అనర్థాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలంది. కేంద్ర పర్యావరణ చట్టం (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్



ఉత్తర్వులు 2016) ప్రకారం చైనీస్ మాంజా వాడకాన్ని నిషేధించినట్లు తెలిపారు. పతంగులు ఎగరవేసేందుకు గ్లాస్ కోటింగ్‌తో ఉన్న నైలాన్ , సింథటిక్ దారాన్ని కొందరు వాడుతున్నారని... పండుగ తర్వాత ఎక్కడికక్కడ ఈ వ్యర్థాలు మిగిలిపోయి పర్యావరణం, పక్షులకు హాని కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు.. మనుషులు కూడా తీవ్ర గాయాల భారిన పడుతున్నారన్నారు. చైనీస్ మాంజాకి బదులు సంప్రదాయ కాటన్ దారాలను పతంగుల కోసం వాడాలని సూచించారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో కూడా చైనా మాంజా వినియోగాన్ని నిషేధించామని అటవీశాఖ అధికారులు వెల్లడించారు. పోలీసులతో పాటు ఇతర శాఖల సమన్వయంతో మాంజా వాడకాన్ని అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్జీవోల సహకారంతో స్కూలు పిల్లలతో పాటు అందరికీ అవగాహన కల్పిస్తున్నామన్నారు. చైనా మాంజా అమ్మినా, నిలువ, రవాణా చేసినా ఐదేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా ఎదుర్కోవాల్సి ఉంటుంది... మాంజా వాడకం వల్ల మనుషులకు, పక్షులకు హాని జరిగితే 3 నుంచి 7 ఏళ్ల దాకా జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా ఉంటుందని హెచ్చరించారు. గత కొన్నేళ్లుగా 28 లక్షల రూపాయల విలువైన 1391 కిలోల దాకా చైనీస్ మాంజా సీజ్ చేశామని తెలిపారు. చైనా దారం దిగుమతి వల్ల స్థానికంగా కాటన్‌తో పంతుగుల దారం తయారు చేసేవాళ్లు ఉపాధి కోల్పోతున్నారని చెప్పారు. చైనా మాంజా రవాణా చేస్తే వాహనాలు కూడా సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. పండగ సీజన్‌లో నిఘా కోసం ప్రత్యేకంగా ఐదు టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. చైనా దారం అమ్మకం గురించిన వివరాలు తెలిస్తే అటవీ శాఖ టోల్ ఫ్రీ నెంబర్లు 040 23231440, 1800 4255 364 తెలియజేయాలని కోరారు. చైనీస్ మాంజాపై ప్రజలకి అవగాహన కల్పించి, పక్షులని రక్షించేందుకుగాను అరణ్య భవన్‌లో వాల్ పోస్టర్ ను విడుదల చేసారు.

## రైతుల పక్షపాతి కాంగ్రెస్ పార్టీనే

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రైతులకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రూ.85 వేల కోట్లు ఖర్చు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కేడాదిలోనే రూ.53 వేల కోట్లకుపైగా ఖర్చు చేశామని, కాంగ్రెస్ నిబద్ధతకు ఇదే నిదర్శనం అని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి సోమవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. బిఆర్‌ఎస్ ఏడాదికి రైతులకు ఖర్చు చేసింది రూ.7కోట్లు దాటలేదన్నారు.



రైతు బంధు ముసుగులో బడా బాబులకు,రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లబ్ధి చేకూర్చేందుకే కొండలు గుట్టలకు రైతుబంధు వేసి బిఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.20 వేల కోట్లు వృథా చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ హామీల అమలు చేయలేకపోవడానికి బిఆర్‌ఎస్ చీకటి జీవోలే కారణం అని తెలిపారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీసేలా బిఆర్‌ఎస్ 10 ఏళ్ల పాలన సాగిందన్నారు. తెలంగాణ ప్రజలు బిఆర్‌ఎస్ అబద్ధపు ప్రచారాలను గమనించాలని కోరారు. కేంద్రం సాగు చేసే రైతులకు ఎన్ని ఎకరాలు ఉన్నా ఇచ్చేది రూ.6 వేలు మాత్రమే.... రైతులపై బిజెపి నేతలకు ప్రేమ ఉంటే రాష్ట్రంలో అమలు అవుతున్న పథకాలను మోదీని ఒప్పించి దేశమంతా ఇప్పియ్యాలని డిమాండ్ చేశారు. రాజకీయ నేతలు రాజకీయాలు చేసేందుకు చెప్పే ప్రచారాలను నమ్మకుండా ప్రజలు వాస్తవాలను గమనించాలన్నారు. వరి వేస్తే ఊరి అని నిబంధనలు పెట్టిన బిఆర్‌ఎస్‌కు రైతులపై మాట్లాడే అర్హత లేదన్నారు. 55 కోట్లు అక్రమంగా విదేశీ కంపెనీకి పంపిస్తే... ఈడీ విచారణకు పిలిస్తే కెటిఆర్ డ్రామాలు ఆడుతున్నాడని ఆరోపించారు. రాబోయే నాలుగు సంవత్సరాలలో ఇచ్చిన హామీలు అన్ని నెరవేరుస్తామని ఆయన స్పష్టం చేశారు.

## అన్ని రాజకీయ పార్టీలకూ గ్రీన్ కో కంపెనీ ఎన్నికల బాండ్స్

### మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'గ్రీన్ కో కంపెనీ' అన్ని రాజకీయ పార్టీలకు ఎన్నికల బాండ్స్‌ను ఇచ్చిందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి అన్నారు. తమ వ్యూహం బెడిసి కొట్టేసరికి సిఎం రేవంత్ ఎన్నికల బాండ్స్ విషయాన్ని ఏదో కొత్తగా కనిపెట్టినట్టుగా మీడియాకు లీకులు ఇచ్చారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎలు బాల్క సుమన్ ,గాదరి కిషోర్ కుమార్ ,కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డితో కలిసి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, సిఎం రేవంత్ రెడ్డి కొత్త చిక్కులను సృష్టిస్తున్నారన్నారు. రైతు భరోసా కింద రూ.12 వేలను అందజేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చావు కబురు చల్లగా చెప్పిందని, రైతుల ఆగ్రహాన్ని దృష్టి మరల్చేందుకే కెటిఆర్‌కు ఎసిబి నుంచి నోటీసులను ఇప్పించారని జగదీష్ రెడ్డి ఆరోపించారు. విచారణకు హాజరయ్యేందుకు కెటిఆర్ తన వెంట తీసుకెళ్లిన న్యాయవాదిని పోలీసులు లోపలికి అనుమతించకుండా కెటిఆర్‌ను 45 నిముషాలు రోడ్డుపైనే నిలబెట్టారని మండిపడ్డారు. ప్రస్తుతం జరుగుతున్న విచారణలన్నీ తోలు బొమ్మలాట విచారణలేనని ఎద్దేవా చేశారు. హైకోర్టు ముందు ఎసిబి పెట్టిన 200 పేజీల రిపోర్ట్‌లో గ్రీన్ కో ప్రస్తావన ఎందుకు రాలేదని ఆయన ప్రశ్నించారు. ఫార్ములా ఈ కార్ రేస్‌కు ముందే గ్రీన్ కో ఎన్నికల బాండ్స్ ఇచ్చిందని, అనేక కంపెనీలు, అనేక రాజకీయ పార్టీలకు ఎన్నికల బాండ్స్ ఇచ్చాయని, ఇందులో దాపరికం లేదని, దీనిపైన చర్చనే అనవసరమని జగదీష్ రెడ్డి చెప్పారు. అబద్దానికి అమ్మ ,అయ్య ఎవరూ ఉండబోరని, గ్రీన్ కో వార్త కూడా అలాంటిదేనని ఎద్దేవా చేశారు.



## ముదిరాజ్‌లకు రిజర్వేషన్లు కల్పించాలి

### ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరామ్‌కు ముదిరాజ్ సేవ సంఘం విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలలో ముదిరాజ్‌లకు రిజర్వేషన్‌లు ఇస్తామని హామీ ఇచ్చిందని, దీనిని అమలు చేసేలా చొరవ తీసుకోవాలని ముదిరాజ్ సేవ సంఘం ప్రతినిధుల బృం దం టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌కు విజ్ఞప్తి చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని టిజెఎస్ రాష్ట్ర కార్యాలయంలో ముదిరాజ్ సేవ సంఘం నాయకులు ఉప్పరి నారాయణ ముదిరాజ్, పడిగే యాదగిరి ముదిరాజ్, అనంతరాములు, శ్రవణ్ కుమార్‌లతో కూడిన ప్రతినిధి బృందం ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిశారు. ఉద్యోగ భర్తీలకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేస్తున్న నేపథ్యంలో రిజర్వేషన్‌లు లేక ముదిరాజ్ యువత ఉద్యోగాలకు దూరం అవుతున్నారని వారు కోదండరామ్‌కు వివరించారు. ముదిరాజ్‌లకు రిజర్వేషన్‌లు కల్పించేలా చొరవ తీసుకొని ప్రభుత్వంతో మాట్లాడాలని న్యాయం చేయాలనీ వారు ప్రొఫెసర్ కోదండరామ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో టిజెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్ ముదిరాజ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## భేరి రామచంద్ర యాదవ్‌కు 'పండుగ సాయన్న' అవార్డు



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** ప్రజావీరుడు పాలమూరు పండుగ సాయన్న ముదిరాజ్ రాష్ట్రస్థాయి అవార్డును తెలంగాణ రాష్ట్ర బిసి ఐక్యవేదిక అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్‌కు అందజేశారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్ వేదికగా సోమవారం పండుగ సాయన్న సేవా పురస్కార కమిటీ ఆధ్వర్యంలో ఈ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. కమిటీ సభ్యులు శివ ముదిరాజ్, బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, టిజెఎస్ ప్రధాన కార్యదర్శి రమేశ్‌లు రామచంద్ర యాదవ్‌కు 'పండుగ సాయన్న' అవార్డు బహుకరించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ బిసిల డిమాండ్ల అమలుకు ఉద్యమిస్తూనే పండుగ సాయన్న ఆశయాల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ అవార్డు ఇవ్వడంతో తనపై ఉద్యమ బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు.

# ఈ నెలలోనే ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేస్తాం



ఎక్సైజ్ డైరెక్టర్ చెవ్వూరు హరి కిరణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎక్సైజ్ శాఖలో అర్హత కలిగిన అధికారుల నుంచి సిబ్బంది వరకు వారికి రావాల్సిన ప్రమోషన్లను ఈ నెలలోనే పూర్తి చేస్తామని తెలంగాణ ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ చెవ్వూరు హరికిషన్ అన్నారు. సోమవారం అబ్కారీ భవన్‌లో టిఎన్‌జిఓ, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘాల ఉద్యోగులతో కొత్త సంవత్సరం గెట్ టూ గెదర్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరికిషన్ మాట్లాడుతూ.. ఎన్‌ఫోర్స్‌మెంట్ బాగా పని చేస్తే ఎక్సైజ్ శాఖ రీసోర్స్ పెరుగుతుందని, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికట్టడం వల్లనే ఈ డిసెంబరు నెలలో రావాల్సిన ఆదాయం కంటే 10 శాతం అధికంగా సేల్స్ పెరగడంతో ఎక్సైజ్ శాఖకు మేలు జరిగిందన్నారు. ఉద్యోగులు నిబంధనల మేరకు పని చేయాలని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్‌ను ఉద్యోగ సంఘాలు ఇప్పించడానికి సిద్ధంగా ఉన్నాయని, అందరు బాగా పని చేయాలని కోరారు. 2024లో ఎక్సైజ్, లా ఫోర్స్ బాగా పని చేశాయని, 2025లో మరింతగా పని చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. సిఎం టిఎన్‌జిఓ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని ఉద్యోగులకు రావాల్సిన అన్ని బెనిఫిట్స్‌ని అందించడానికి కట్టుబడి ఉన్నామని టిఎన్‌జిఓ సెంట్రల్ యూనియర్ అధ్యక్షుడు మారం జగదీష్ అన్నారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని ప్రధాన కార్యదార్శి డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కోశాధికారి రామినేని శ్రీనివాస్ రావు అన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్శాఖ అడిషనర్ కమిషనర్ అజయ్‌రావు, జాయింట్ కమిషనర్లు ఖురేషి, కె ఏబీ శాస్త్రీ, డిప్యూటీ కమిషనర్లు హరి కిషన్, డేవిడ్ రవికాంత్ , దశరథ్, రఘురాం, శ్రీనివాస్లతోపాటు ఇతర అధికారులు హాజరయ్యారు.

# బిసి బిల్లుకు బలమైన ఉద్యమం

### ఎపి సిఎం చంద్రబాబు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి

### రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** పార్లమెంట్‌లో బిసి బిల్లుకు కేంద్రంపై ఒత్తిడి పెంచేలా తెలుగు రాష్ట్రాల్లో బలమైన ఉద్యమాలు నిర్మించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఎపి సిఎం చంద్రబాబు నాయుడు బిసి బిల్లు కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని కోరారు. కేంద్రంలో బిసిలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక అభివృద్ధికి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఎపి బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం బోను దుర్గా నరేశ్ అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తెలంగాణ తరహాలో ఎపిలో కూడా అన్ని పార్టీలు బిసి సిఎం వాదన ఎత్తుకొనేలా అక్కడ బిసిలంతా ఐక్య పోరాటాలు చేయాలని సూచించారు. అన్ని రాష్ట్రాలలో ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీం, స్కాలర్‌షిప్‌ల మంజూరు, గురుకులాలు, బిసి స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బిసిల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను జనాభా ప్రకారం 27శాతం నుంచి 56శాతానికి పెంచాలని



విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య దేశంలో అన్ని కులాలకు జనాభా ప్రకారం వాటా ఇవ్వాలని, అప్పుడే సమాజంలో సమైక్యత, సమగ్రత, శాంతి నెలకొంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎపి బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులుగా బోను దుర్గా నరేశ్, మహిళా విభాగ అధ్యక్షురాలిగా హేమ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చింత శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా కాగిత అజయ్, రంగు విక్రమ్ నియమిస్తున్నట్టు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. సమావేశంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నిమ్మల వీరన్న, గౌరిగే మల్లేశ్, ఎపి సంఘం నేతలు భీమవరపు సురేశ్, రామలింగం, మెండు జ్యోతి, రామకృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## క్యూసిఎఫ్‌ఐకి అత్యున్నత పురస్కారం

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** పరిశ్రమలలో నాణ్యత ప్రమాణాల పెంపు, భద్రత అంశాలపై అవగాహన కల్పిస్తున్న దేశానికి చెందిన క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసిఎఫ్‌ఐ) అత్యున్నత పురస్కారం అందుకొన్నది. అమెరికాకు చెందిన వరల్డ్ రికార్డ్స్ యూనియన్ అత్యున్నత ప్రమాణాలతో మానవ వనరుల అభివృద్ధికి దోహదపడుతున్న సంస్థలకు ఇచ్చే అత్యున్నత పురస్కారం అందుకోవడం తమకెంతో ఆనందంగా ఉన్నదని క్యూసిఎఫ్‌ఐ ఈడీ డి.కె శ్రీవాత్సవ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో వరల్డ్ రికార్డ్స్ యూనియన్ రిజిస్ట్రార్ క్రిస్టోఫర్ టైలర్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నట్టు చెప్పారు. బీహెచ్ఈఎల్, రైల్వే, ఎన్ఎండిసి తదితర ప్రభుత్వ రంగ, ప్రైవేట్ సంస్థల అభివృద్ధికి తమ సంస్థ చేయూతనందించినట్టు తెలిపారు. సమావేశంలో ఫోరం మాజీ డైరెక్టర్ శ్రీనివాస, డైరెక్టర్లు మోహన్ రెడ్డి చేతన్ చితాల్కర్ పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జర్నలిస్టు కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ (జెసిహెచ్‌ఎస్‌ఎల్)కి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన నాన్ అలాటీ ప్యానెల్‌కు సోమవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కలిసి అభినందనలు తెలిపారు. నాన్ అలాటీస్ పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయొద్దని కోరారు, జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, కాలనీల అభివృద్ధికి, నాన్ అలాటీ సంక్షేమానికి కొత్త కమిటీ కట్టుబడి ఉండాలని పలు సూచనలు, సలహాలు చేశారు. త్వరలోనే పూర్తి కార్యవర్గంతో భేటీ అవుతానని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్యానెల్ విజయం సాధించడంతో పాటు అత్యధిక ఓట్లు సాధించిన సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మండభేరి గోపరాజును ఉప ముఖ్యమంత్రి శాలువాతో సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మిక్కిలినేని రవీంద్రబాబు, ట్రెజరర్ భీమగాని మహేశ్వర్ గౌడ్ తో పాటు సీనియర్ జర్నలిస్ట్ హనుమంత రావు పాల్గొన్నారు.

## కెనడా ప్రధాని ట్రూడో రాజీనామా



**టొరంటో :** కెనడా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. లిబరల్ పార్టీ నాయకత్వానికి, ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు జస్టిన్ ట్రూడో ప్రకటించారు. కొత్త నాయకత్వాన్ని ఎన్నుకున్న తర్వాత బాధ్యతల నుంచి వైదొలుగుతానని చెప్పారు. ట్రూడో వైదొలగాలంటూ సొంత పార్టీ నేతల నుంచి కొంతకాలంగా డిమాండ్లు వచ్చిన నేపథ్యంలో ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు. పార్టీ నాయకత్వానికి, ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయనున్న విషయాన్ని పార్టీకి, గవర్నర్‌కు తెలియజేశాను. కొత్త నాయకత్వాన్ని ఎన్నుకున్న వెంటనే రాజీనామా చేస్తా. ఈ ప్రక్రియ కొనసాగించేందుకు మార్చి 24వరకు పార్లమెంటును ప్రొరోగ్ చేస్తున్నా అని జస్టిన్ ట్రూడో ప్రకటించారు. అయితే, కెనడా చట్టం ప్రకారం.. అధికార పార్టీ నేత రాజీనామా చేసిన పక్షంలో 90 రోజుల్లో కొత్త నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సి ఉంటుంది. మరోవైపు, కెనడా ఉప ప్రధాని, ఆర్థికశాఖ మంత్రి క్రిస్టియా ఫ్రీలాండ్ ఇటీవల రాజీనామా చేసిన విషయం తెలిసిందే. జస్టిన్ ట్రూడో కేబినెట్‌లో అత్యంత శక్తిమంతురాలిగా గుర్తింపు పొందిన ఆమె.. ప్రధాని ట్రూడో ప్రజాదరణ కోల్పోతున్నారని ఆరోపించారు. ఇలా దాదాపు దశాబ్ద కాలం కెనడా ప్రధానమంత్రిగా ఉన్న జస్టిన్ ట్రూడో.. రాజకీయ అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. రాజీనామా చేయాల్సిందేనని సొంత పార్టీ నేతల నుంచే డిమాండ్ పెరిగిన తరుణంలో ట్రూడో ఈ నిర్ణయం వెలువరించారు.

## ప్రజావాణికి 123 ఫిర్యాదులు



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: మహబూబ్‌నగర్ జనవరి 05 ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 123 ఫిర్యాదులు అందాయన్నారు.త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### 15 అర్జీల స్వీకరణ



ప్రజావాణి కార్యక్రమంలో భాగం గా జిల్లా లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 15 అర్జీలను జిల్లా ఎస్‌పి డి.జానకి, ఐపిఎస్ స్వీకరించారు. తక్షణమే సంబంధిత ఎస్ఐ, సిఐ డిఎస్‌పిలతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల స్థితిని సమీక్షించి, పరిష్కారానికి అవసరమైన సూచనలు అందించారు.

## రూ.15 వేలు పెట్టుబడి సాయం ఇవ్వాలి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: రైతులకు ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేస్తూ బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, శివ రాజు పట్టణ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీ నరసింహులు మాజీ మున్సిపల్ చైర్మన్, ఆంజనేయులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, ఆంజనేయులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, గంజి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత్ హోటల్ తనిఖీ

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్‌ప్రతినిధి : మహబూబ్‌నగర్ పట్టణంలోని హోటల్ ప్రశాంత్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం సోమవారం తనిఖీ చేశారు. హోటల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నారా లేదా తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలో భాగంగా చికెన్ బిర్యాని కొన్ని ముడి పదార్థాలను సేకరించినట్లు తెలిపారు. ఏమైనా కల్తీ నిర్ధారణ జరిగితే చట్టపరంగా క్రిమినల్ కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీలలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. విజయ్ కుమార్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్టు, శ్రీలత జిల్లా ఫుడ్‌ఇన్‌స్పెక్టర్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

## పంప్‌హౌస్ పరిశీలన

ప్రజాపక్షం/నర్వ : నర్వ మండలంలోని కోయిల్‌సాగర్ ఫేస్ 1 పంప్ హౌజ్ ను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సోమవారం పరిశీలించారు. పంప్ హౌజ్ సమస్యలను అధి కారులను అడిగి తెలుసుకున్నారు. మరమ్మతుల కొరకు నిధులు విడుదల చేయా లని ఉన్నత అధికారులకు సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ,అధికారులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రజాపక్షం/వెల్దండ : చారగొండ మండలం జూపల్లిఎక్స్‌రోడ్డువద్ద ప్రమాదంలో మృతిచెందిన కల్వకుర్తి మండలం తాండ్రకిచెందిన రాంకోటి, వెల్దండ మండలం కొట్రకిచెందిన గణేష్ కుటుంబాలను ఆదుకుంటామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వరంగా ఆదుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

## రైతు భరోసా నిధులు తగ్గించడం తగదు

ప్రజాపక్షం/కల్వకుర్తి : కాంగ్రెస్‌పార్టీ ఎన్నికలలో ఎకరాకు రూ.15వేలు అని మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాం గ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.12వేలు ఇస్తామనడం తగదని మున్సిపల్‌చైర్మన్ ఎడ్మసత్యం, మార్కెట్ మాజీచైర్మన్ విజయ్‌గౌడ్ అన్నారు. సోమవారం రాష్ట్రప్రభుత్వతీరుకు నిరసనగా టిఆర్‌ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో కల్వకుర్తి ఆర్‌డిఓ శ్రీనునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాటన్ మిల్ అధ్యక్షులు అయినేని సూర్యప్రకాష్‌రావ్, మాజీ ఎంపిపి కొండూరు గోవర్ధన్, పట్టణ అధ్యక్షులు బావండ్లమధు, వైస్‌చైర్మన్ షాహిద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరి

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



ప్రజాపక్షం/వనపర్తి : ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సహ ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో జాతీయ రోడ్డు భద్రత మసో త్సవాల సందర్భంగా అధికారుల చేత రోడ్డు భద్రత ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహిం చారు. జిల్లా రవాణా శాఖ అధికారి మానస ఆధ్వర్యంలో అదికారులందరి చేత రోడ్డు భద్రతా ప్రతిఇజ్ఞ చేయించారు. ఈ ర్యాలిలో అధికారులు, యువత, ప్రజలు హెల్మెట్ ధరించి పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిజ్ఞ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ , అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు

ఎమ్మెల్యే మేఘారెడ్డి



ప్రజాపక్షం/ వనపర్తి టౌన్ : కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు గుండెల్లో పెట్టి చూసుకుంటుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. పెద్దమందడి మండలం బుగ్గపల్లి తాండలో సోమవారం ఆయన కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గిరిజన మహిళలు సాంప్రదాయ నృత్యాలు చేస్తూ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గ్రామంలోని ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్ , మాజీ జడ్పీటీసీ వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

ప్రజాపక్షం/వీపనగండ్ల : ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి వి. రజిని కోరారు. వనపర్తి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి ఆదేశాల మేరకు వీపనగండ్ల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పేదరికం నిర్మూలన పథకాల అమలు పై చట్టపరమైన అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా న్యాయామూర్తి వి. రజిని హాజరై మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా న్యాయస్థానాలలో ఉచిత న్యాయ సేవలు పొందవచ్చని సూచించారు. భ్రుణహత్యలు, గృహహింస బాలికలపై అఘాయిత్యాలు, కుటుంబ కలహాల సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా. రాజశేఖర్ , జిల్లా ఇంచార్జ్ సిడిపిఓ లక్ష్మ య్య, పంచాయతీ కార్యదర్శి రమేష్డ్డి పాల్గొన్నారు.

# దివాలా రాష్ట్రంగా మార్చింది బిఆర్‌ఎస్సే

బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుకు వడ్డీలే రూ.6500 కోట్లు

బిఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పు అక్షరాల రూ.8లక్షల కోట్లు

మంత్రి జూపల్లికృష్ణారావు



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : ధనికరాష్ట్రాన్ని దివాలా రాష్ట్రంగామార్చింది బిఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, కెసిఆర్ ప్రభుత్వం చేసిన అప్పులకు కాంగ్రెస్‌ప్రభుత్వంభారీగా వడ్డీకట్టేపరిస్థితిలో ఉన్నప్పటికి ఇచ్చినహామీలు నెరవేర్చుకోవడానికి కృషిచేస్తున్న సంగతిప్రజలు గమనిస్తున్నారని రాష్ట్రపర్యాటక ఎక్సైజ్ సాంస్కృతికశాఖమంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. సోమవారం నాగర్ కర్నూల్ వ్యవసాయమార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం, జిల్లా గ్రంథాలయ భవన ప్రారంభోత్సవం ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాలలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లకాలంలో అధికారం చేపట్టిన బిఆర్‌ఎస్ 8లక్షలకోట్ల అప్పు చేసిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేస్తూ ఏడాది కాలంలోనే ప్రజాపాలనకు శ్రీకారం చుట్టారన్నారు. ఏడాదిపాలనలో రాష్ట్రప్రజలు సుభిక్షంగా ఉన్నారని అన్నారు. కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావులు తమతప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి చేసింది గోరంతాఅయితే కొండంత చెప్పుకున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. త్వరలోనే మార్కెండేయ ఎత్తిపోతలపథకాన్ని ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, మాజీ జడ్పివైస్‌చైర్మన్ బాలాజిసింగ్, కాంగ్రెస్ పార్టీ జిల్లామైనార్టీ సెల్‌అధ్యక్షుడు హబీబ్‌రహమాన్, మాజీమార్కెట్ కమిటిచైర్మన్ దొడ్ల ఈశ్వర్‌రెడ్డి, ట్రాన్స్‌ఫోర్టు అథారిటిడైరెక్టర్ గోపాల్‌రెడ్డి, వ్యవసాయమార్కెట్ కమిటీ నూతన చైర్మన్ మేనేపల్లి రమణారావు, ప్రముఖ వ్యాపారవేత్త హాకీం మురళి, మాజీ ఎంపిటిసి చెన్‌రెడ్డిశ్రీనివాస్‌రెడ్డిలతోపాటు మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించిన మంత్రి

నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖమంత్రి జూపల్లికృష్ణారావు , స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్‌వారిచేత ప్రమాణ స్వీకారం చేయి ంచారు. కార్యక్రమంలో జిల్లాకాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## షీ టీమ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు




ప్రజాపక్షం/జడ్చర్ల: జడ్చర్ల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గంగా పురంలో షీటీమ్స్ వారి చేత విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీటీమ్స్ ఎఎస్ఐ వనజారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీలు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సప్ ట్విట్టర్‌లలో అపరిమిత వ్యక్తులతో సంబంధాలు పెంచుకుని తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని అమ్మాయిలతో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే తక్షణమే ఫిర్యాదుచేయాలని అపరిచితులతో సెల్ఫీలు దిగడం గాని లిఫ్ట్ అడగడం గాని బయటకు వెళ్లడం గానిచేయరాదని తెలియని వారిని నమ్మి మోసపోవద్దని సూ చించారు. షీటీం కానిస్టేబుల్ రఘు మాట్లాడుతూ విద్యార్థులకు జాగ్రత్తలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ అనంతప్ప మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణతో మెలిగి తమ జీవితాలను అందంగా తీర్చిదిద్దుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జరీనా బేగం, కిరణ్ కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బివి జ్యోతి, కవిత, మల్లస్వామి, బసవయ్య, షర్మిల ,తిరుపతిరెడ్డి, నారాయణ, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

## న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

టిఎఫ్‌టియు డిప్యూటీ కలెక్టర్‌కు వినతి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: 523 సర్వే నంబర్‌లో తమ భూముల్ని, పట్టా సర్టిఫికెట్లను ప్రభుత్వానికి సమర్పించి డబల్‌బెడ్ రూంలు పొందటానికి అర్హులుగా నిర్ధారించిన వారికి తక్షణం డబల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నేడు జిల్లా డిప్యూటీ కలెక్టర్ మోహన్ రావు తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య టిఎఫ్‌టియు నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ 2018లో అప్పటి జిల్లా కలెక్టర్ రోనాల్డ్ రోస్ 523 సర్వే నంబర్ లోని పట్టా సర్టిఫికెట్లు కలిగిన లబ్ధిదా రులందరూ తమ ప్రభుత్వానికి స్వాధీనపర్చాలని ఆదేశించిందని, ఈ విధంగా సర్టిఫికెట్లు స్వాధీన పరిచిన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చారని, కలెక్టర్ మాటల్ని నమ్మి ప్రజలు తమ పట్టా సర్టిఫికెట్లను ప్రభుత్వానికి స్వాధినపరిచారన్నారు. కాని అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇవ్వకుండా మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశానుసారం సొంత ఆస్తి మాదిరిగా డబుల్ బెడ్ రూమ్‌లను అర్హులు కాని వారికి పంచిపెట్టారని, అర్హులైన పేదలకు తీరని అన్యాయం చేశారు. అక్రమా లకు పాల్పడ్డ నాయకులపై, సంబంధిత అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవా లన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల ఎడల ప్రభుత్వం సానుకూలంగా స్పందించా లని వారు విజ్ఞప్తి చేశారు. లేని ఎడల 20 తారీకున మహబూబ్‌నగర్ అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయం యందు పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని వారు హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో టిఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, ఇతర లబ్దిదారులు పాల్గొన్నారు.

## రేట్ల పెంపు ఒప్పంద జిఒలు విడుదల

జిల్లా కలెక్టర్‌కి వినతి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : తెలంగాణ పౌరసరఫరాల సంస్థ, జిసిసి హమాలీ కార్మికులకు 2024–2025 ఎగుమతి దిగుమతి రేట్ల పెంపు కోసం 2024 లో జరిగిన ఒప్పంద జిఒను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని వామపక్ష కార్మి క సంఘాల నేతలు డిమాండు చేశారు. డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆరు రోజులుగా చేస్తున్న నిరవధిక ఆందోళన భాగంగా సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎఐటియుసి, సిఐటియూ, టియూసిఐ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి, సిఐటియు, టియుసిఐ జిల్లా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ పౌరసరఫరాల సంస్థలో హమాలీ కార్మికుల రేట్ల పెంపు ఒప్పందం జరిగి ఏడాది గడుస్తున్న ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి జిఒకూడా విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల న్యాయమైన సమస్యల సాధనకై జనవరి ఒకటి నుండి నిరవధిక ఆందోళనకు దిగిన సివిల్ సప్లయ్ కార్మికుల సమస్యలను పరిష్కరిం చకపోగా సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం విడ్డూరం అన్నారు. లక్షణమే జిఒ విడుదల చేసి కార్మికుల ఆదుకోవాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి, సిఐటియు టియుసిఐ సంఘాల నేతలు పి.సురేష్, నల్లవెల్లి కురుమూర్తి, వెంకటేశ్, చంద్రకాంత్, రాజు, బుట్టో, తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన : డిఇఒ ప్రవీణ్ కుమార్



ప్రజాపక్షం/జడ్చర్ల : రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు మహబూబ్‌నగర్ జిల్లా వేదిక కానుందని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మధ్యా హ్నం జడ్చర్ల మండలం పోలేపల్లిలోని ఎస్‌వికెఎం ఇంటర్నేషనల్ పాఠశాలలో ఏర్పా టు చేసిన విలేఖరులు సమావేశం ఆయన మాట్లాడారు. 2012 తర్వాత రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తూ ఏర్పాట్లను పర్య వేక్షిస్తున్నారని జిల్లా యంత్రాంగంతో పాటు నిర్వహణ కమిటీలు గత ఐదు రోజులుగా నిర్విరామంగా కృషి చేస్తున్నారని డిఇఒ తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభానికి ముఖ్య అతిథులకు జిల్లా ఇన్ చార్జ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారు అని తెలిపారు. వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరిని కలిసి ఆహ్వానాలు అందించామన్నారు. సైన్స్ ప్రయోగాలు ప్రదర్శించేందుకు కోసం ఎస్వీకేయం పాఠశాలలో 51 గదులను కేటాయించామని ఎలాంటి అసౌకర్యం కలగ కుండా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ సమావేశంలో సి.యం.ఓ సిఎంఒ బాలు యాదవ్ ఎఎంఒ దుంకుడు శ్రీనివాస్ సిపిఒ రవీందర్ ఐపిఆర్ డిప్యూటీ ఇఇ ఇస్ర నాయక్ ఎంఇఒ మంజుల దేవి మీడియా కమిటీ కన్వీనర్ పల్లాటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



ప్రజాపక్షం/వెల్దండ : మండలపరిధిలోని కుప్పగండ్ల గ్రామానికిచెందిన రామస్వామి, గోరేటిభరత్‌లు ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న కుప్పగండ్ల మాజీ సర్పంచ్ మొక్తాలశేఖర్ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఇరువురి కుటుంబాలకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటాననిహామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మూడోవార్డు మెంబర్ కొమ్మగొని వెంకటయ్యగౌడ్, గోరేటి పారేశా,మున్నూరు వెంకటేష్, దుబ్బదేవయ్య, గోరేటిలక్ష్మ య్య, గోరేటి బుజ్జయ్య, గోరేటి కృష్ణయ్య, గోరేటి రాములు, జల్లెలశ్రీను, ఎండి. జాంగీర్, గోరేటిబాలస్వామి, అశోక్, శ్రీకాంత్, వంశీ, పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి సాయమందిస్తా

ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : సమాజ శ్రేయస్సు కాంక్షించే జర్నలిస్టుల సంక్షేమం కోసం తనవంతుగా సహకరిస్తానని ఎమ్మెల్యేడాక్టర్ కూచుకుళ్లరాజేష్‌రెడ్డి అన్నారు. టియూడబ్ల్యూజే(ఐజేయు) జర్నలిస్టు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యేడాక్టర్ రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీకూచుకుళ్ల దామోదర్‌రెడ్డిని కలిసిన జర్నలిస్టులకు వారు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యం లో జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలి స్టువృత్తికి న్యాయంచేసేలా ప్రజా సమస్యలతో పాటుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షే మ, అభివృద్ధిపథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టియూడబ్ల్యూజే(ఐజెయు) సీనియర్ నాయకులు పలుసవిజయ్‌కుమార్‌గౌడ్,తాలుకా ప్రధాన కార్యదర్శి గుంటిసాయిలుసాగర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహ్మద్‌దర్వేష్‌ఖాద్రి, హౌజింగ్ రిప్రెజెంటేటివ్ దినకర్‌రావు, లీగల్ అడ్వైజర్ రాంబాబు, కోశాధికారి అల్లంపల్లి రమేష్, ఉపాధ్యక్షులు గోరేటిశ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ పేదలకు కొండంత అండ

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య

ప్రజాపక్షం / వీపనగండ్ల: అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి సీఎంఆర్ఏ పథకం ఒక వరం లాంటిదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోదల బీరయ్య, రైతు బంధు సమితి మండల మాజీ అధ్యక్షులు ఎత్తం కృష్ణయ్యలు అన్నారు. ఇటీవల మండల కేంద్రమైన వీపనాలలో అనారోగ్యం బారిన పడి చికిత్స పొందిన 9 మంది లబ్దిదారులకు రెండు లక్షల 59వేల రూపాయలు విలువ చేసే చెక్కులను లబ్దిదారులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కిసాన్ సెల్ అధ్యక్షులు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## షరతులు లేకుండా రైతు భరోసా అమలు



ప్రజాపక్షం/అడ్డాకుల : అబద్ధపు హామీలతో కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని ఎన్నికల సమయంలో రైతు భరోసా రూ.15 వేలు అందిస్తామని చెప్పి రూ.12 వేలకు కుదించి ఇవ్వడం అన్నదాతలకు అన్యాయం చేస్తుందని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశానుసారం అడ్డాకుల మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు ప్రక్కన వివేకానంద విగ్రహం దగ్గర నల్ల బ్యాడ్జీలు ధరించి తెలంగాణ రాష్ట్ర రైతులు నిరసన తెలిపారు. రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫేస్టో లో పొందుపరిచిన విధంగా రైతు భరోసా పథకాన్ని ఇచ్చిన హామీ ప్రకారం సక్రమంగా నిర్వహించాలని నిరసన తెలుపుతూ నినాదాలు చేస్తూ కాంగ్రెస్ హామీ పత్రాలను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి సంవత్సరం గడిచిన రైతులకు రైతు బంధు అందించని దుస్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సరం రైతులకు రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, రైతులు పంట సాయం కోసం ఎదురు చూసి నిరాశే మిగిలిందన్నారు. రైతు భరోసా కాంగ్రెస్ ఒక సంవత్సరం ఎగ్గొట్టిందని దానిని కలిపి రైతులఖాతాలో జమ చేయాలని రూ.15 వేల రైతు భరోసా వెంటనే అమలు చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డాకుల మండల బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు టి.శ్రీనివాస్‌రెడ్డి, మండల సింగిల్ విండో చైర్మన్ మద్దూరి జితేందర్‌రెడ్డి, మండల సీనియర్ నాయకులు మద్దూరి చంద్రమోహన్‌రెడ్డి, మండల మాజీ రైతు బంధు సమితి అధ్యక్షులు బి. తిరుపతిరెడ్డి,బిఆర్‌ఎస్‌పార్టీ నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేపలవలలో చిక్కుకున్న కొండ చిలువ



ప్రజాపక్షం / కొత్తకోట : కొత్తకోట మండలం గుంపుగట్టు రామన్ పాడు పంపు హౌస్ పక్కన గల కెనాల్ లో గుర్తు తెలియని వ్యక్తులు వేసిన చేపల వలలో 8 అడుగుల, 11 కేజీల బరువు గల కొండ చిలువ వలలో చిక్కుకొని ఇబ్బంది పడుతున్న కొండ చిలువను చూసిన రమేష్ , సాగర్ స్నేక్స్ సోసైటీ వ్యవస్థాపకులు చీర్ల కృష్ణసాగర్‌కి సమాచారం ఇవ్వగా వెంటనే రామన్ పాడు పంప్ హౌస్ దగ్గరకు చేరుకొని వలలో చిక్కుకున్న కొండ చిలువను బయటికి లాగి బిగ్గరగా చుట్టుకున్న తగ్గి వైర్లను బ్లేడు సహాయంతో కట్ చేసి సురక్షితంగా బంధించారు. అనంతరం సంబందించిన కొండ చిలువను ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో గోపాల్ యాదవ్ , హుదూత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్వో వాటర్ ఫిల్టర్ ప్రారంభం



ప్రజాపక్షం/ కొత్తకోట: కొత్తకోట మున్సిపాల్టీ కేంద్రంలోని బాలిక సాం ఘిక గురుకుల సంక్షేమ పాఠశాలలో ఆర్వో వాటర్ ఫిల్టర్ ప్రారం భోత్సవంలో సోమవారం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి చేతుల మీదగా ప్రారంభించారు. పాఠశాలలోని సమస్యలు సోలార్ వాటర్ హీటర్ సిస్టం, లైబ్రరీ కి సంబంధించిన మెటీరియల్ , ఫర్నిచర్ , సామాగ్రిని కావాలని అధ్యాపక బృందం ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో ఎమ్మెల్యే స్పందించి కాంగ్రెస్ పార్టీ నాయకులు సంకిరెడ్డిపల్లి ఎన్ఆర్ఐ అమర్ రెడ్డి, కొన్నూరు శరత్ రెడ్డి వారి ద్వారా ఏర్పాటు చేయిస్తానని హామీనిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



ప్రజాపక్షం/పాన్‌గల్‌: పాన్‌గల్ మండల కేంద్రానికి చెందిన బండి చంద్రకళ (32) అనే వివాహిత ఉరి వేసుకొని మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబులల్ చంద్రశేఖర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చంద్రకళ ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు చీర కట్టుకొని ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతురా లికి పిల్లలు కానందువల్ల తన భర్త మహేష్ , కుటుంబ సభ్యులు తరచూ వేదింపులకుగురి చేయడంతో మన స్థాపం చెంది ఉరి వేసుకొని చనిపోయిందని మృతు రాలి తల్లి కె. వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు.

## ఉపాధ్యాయులకు సర్వీస్ పుస్తకాల పంపిణీ



ప్రజాపక్షం/పెద్దమందడి : నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన ఉపాధ్యా యులకు విశ్రాంత గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రాంమూర్తి స్మారకర్థం కుమారుడు వి. రాజశేఖర్ నూతనంగా నియమించబడ్డ 2024 ఉపాద్యాయులకు సర్వీస్ పుస్తకాలను ఉచితంగా పిఆర్టీయూ టీఎస్ జిల్లా వారి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పిఆర్టీయూ టీఎస్ పెద్దమందడి మండల శాఖ ఆధ్వర్యంలో మండలానికి వచ్చిన నూతన ఉపాద్యాయులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండలం ఎంఈఓ భానం విష్ణు, పెద్దమందడి కాంప్లెక్స్ ప్రధాన ఉపాద్యాయులు శాంతన, మద్దిగట్ల మోజర్ల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు వరప్రసాద్ రావు, ఉపాద్యాయ బృందం పాల్గొన్నారు.

## భూ తగాదాలలో తమ్ముడిపై అన్నదాడి


ప్రజాపక్షం/అచ్చంపేట: భూతగాదాల విషయంలో తమ్ముడిపై అన్నకత్తితో దాడిచేసిన సంఘటన అచ్చంపేట పరిధిలోని బొమ్మన్‌పల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం బొమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన అర్జున్, వేణు ఇద్దరు అన్నదమ్ములు భూపంచాయతీకోసం ఘర్షణపడుతుండేవారు. సోమవారం ఉదయం వేణు తన ఇంట్లో నిద్రిస్తుండగా తన అన్న అర్జున్ తమ్ముడిపై దాడిచేశాడు. అతనిమేల్కొని ప్రతిఘటించేలోపు బలంగా దాడిచేయడంతో రక్తపుమడుగులో అపస్మారకస్థితికివెళ్లాడు. గుర్తించిన కుటుంబసభ్యులు అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికిచేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

## బిటిరోడ్డు నిర్మాణం చేపట్టాలని వినతి

ప్రజాపక్షం/వెల్దండ: మండలకేంద్రం నుంచి రాచూర్‌గ్రామం వరకు బిటిరోడ్డు నిర్మించాలని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు గ్రామ యువకులు వినతి పత్రం అందజేశారు. ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చిన ప్రజా ప్రతినిధులు , అధికారులు మావిజ్ఞప్తిని నెరవేర్చలేకపోయారని గతకొన్ని దశాబ్దాలుగా నిరసనలు, పాదయాత్రలు, విజ్ఞప్తులుచేసిన నేటికి ఆగ్రామ ప్రజల సౌకర్యార్థం బిటిరోడ్డును నిర్మించలేకపోయారని ఆవినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో గ్రామయువకులు బెక్కరిసురేష్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, గణేష్,శంకర్, సుభాష్, శ్రీశైలం ఉన్నారు.

ఫోకస్

# యువతరంగం



## వ్యక్తిత్వ వికాసమా? వినాశనమా?

### రెండువైపులా పదునైన కత్తి ఇంటర్నెట్ !

ఇంటర్నెట్... ఈ రోజుల్లో దీనిని తెలియనివారు లేదా ఉపయోగించని వారు లేరనడం అతిశయోక్తికాదు. ఏదో ఒక సమయంలో... ఏదో ఒక రకంగా ఇంటర్నెట్ సౌకర్యాన్ని ఉపయోగించక తప్పడం లేదు. ఎన్నో ఉపయోగాలున్న ఇంటర్నెట్‌ను దుర్వినియోగం చేస్తున్న వారు కూడా పెరుగుతున్నారు. ఇది రెండు వైపులా పదునైన కత్తి. వ్యక్తిత్వ వికాసానికి, అభివృద్ధికి ఎంతగా ఉపయోగపడుతుందో, అంతకు రెట్టింపుగా, మహా వినాశనానికి, పతనానికి కారణమవుతుంది. ఉపయోగించుకునే తీరును బట్టి, ఇంటర్నెట్ ప్రాధాన్యతలు, మంచీచెడులు మారుతుంటాయి. సాధారణంగా మంచి కంటే చెడే ఎక్కువగా ఆకర్షిస్తుంది. అందుకే నేటి సమాజంలో హెచ్‌ఐవి ఎయిడ్స్ కంటే, కరోనా తెచ్చిన కొవిడ్ 19 కంటే భయానకమైన జబ్బుగా ఇంటర్నెట్ పరిణమించింది. బెంగళూరులోని జాతీయ మానసిక ఆరోగ్య, నాడీ శాస్త్ర సంస్థ ఇటీవల నిర్వహించిన ఒక అధ్యయనంలో చేదు నిజాలు బయట పడ్డాయి. పట్టణాలు, నగరాల్లోని యువత ఇంటర్నెట్‌ను, తత్సబంధిత ప్లాట్‌ఫామ్స్‌ను విపరీతంగా ఉపయోగిస్తున్నారని, 73 శాతం మంది మానసిక అనారోగ్యానికి గురవుతున్నారని ఆ అధ్యయనం తేల్చిచెప్పింది. కనీసం 5 శాతం మంది యువతీయువకులు అంతర్జాలానికి బానిసలుగా మారారని అంచనా. నివేదికను అనుసరించి, మనిషి ఆలోచనల్లో విపరీతమైమ మార్పులు సంభవిస్తున్నాయి. మెదళ్లలోకి చొచ్చుకుపోతున్న వివిధ రకాల ప్రభావాల నుంచి యువత తనను తాను సంరక్షించుకోలేకపోతున్నది. ఫేస్‌బుక్ లేదా యూట్యూబ్.. ఇన్‌స్టాగ్రామ్ లేదా వాట్సాప్... ప్లాట్‌ఫామ్ ఏదైతేనేం... అంతర్జాయ సుడిగుండంలో చిక్కుకొని మానసిక విశ్రాంతిని కోల్పోతున్నది. ఒత్తిడికి గురవుతున్నది. అనేకానేక మానసిక సమస్యలతోపాటు, వెన్నునొప్పి, తలనొప్పి, నిద్రలేమి, కంటి సమస్యలు వంటి అనారోగ్యాలను యువత కొని తెచ్చుకుంటున్నది.

విద్యార్థుల చదువు దారితప్పుతున్నది. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో ఎక్కువగా కనిపించే ఈ లక్షణాలు, ఇప్పుడు మన దేశంలోనూ దర్శనం ఇవ్వడం ఆందోళనకరం. మద్యం, మాదక ద్రవ్యాల వినియోగానికి బానిసలైన వారికి 'డిఅడిక్షన్ సెంటర్లు' ఉన్నట్టే ఇప్పుడు ఇంటర్నెట్ వ్యవసానికి కూడా డిఅడిక్షన్ సెంటర్ల అవసరం ఏర్పడింది. అంతర్జాలంలో ఎక్కువగా విహరించడాన్ని ఇరటర్నెట్ అడిక్షన్ అని అనుకుంటారు. వాస్తవానికి అది కాదు. ఇంటర్నెట్ పై అతిగా ఆధారపడటం, అది లేకుంటే ఉండలేకపోవడమే అంతర్జాల వ్యసనం. ఈ రోజుల్లో ఫోన్, ఇతర పరికరాల ద్వారా అన్ని వేళలా అంతర్జాలం అందుబాటులో ఉంది. అవసరం కొద్దీ ఎక్కువ మంది ఇరటర్నెట్ చూస్తుంటారు. ఇది సాధారణము. కానీ కొందరు అవసరం లేకున్నా.. అసలు ఏం చూడాలో తెలియకున్నా నెట్లో ఏదో ఒకటి చూస్తూనే ఉంటారు. ఇది క్రమంగా వ్యసనంగా మారుతుంది. ఈ పరిస్థితి నుంచి యువత ఎంత తొందరగా బయటపడితే అంత మంచిది. విద్యార్థులు తమతమ పాఠ్యాంశాలకు సంబంధించిన పలు సందేహాలను ఇంటర్నెట్ మాధ్యమంగా నివృత్తి చేసుకోవచ్చు. తమకు నచ్చిన రంగంలో ప్రతిభాపాటవాలను పెంచుకోవచ్చు. ఉద్యోగాన్వేషణ నుంచి వృత్తి నైపుణ్యం వరకూ యువతకు కూడా ఇంటర్నెట్ ఎంతగానో ఉపయోగపడుతున్నది. ఈ విషయాన్ని కాదనలేం. కానీ, అతిగా మాఆరడమే సమస్యలకు ప్రధాన కారణం. ఈ 'అతి' ఎంతగా పెరిగిందంటే, ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపించినప్పుడు, వెంటనే ఇంటర్నెట్‌లో సర్చ్ చేసి, సొంత వైద్యం చేసుకునే స్థాయికి చేరింది. రీల్స్ పేరుతో వస్తున్న దరిద్రాలను చూస్తునే ఉన్నాం. మనుషుల మధ్య చిచ్చుపెట్టే పోస్టులు కోకొల్లలు. కుల, మత, ప్రాంత, భాషాది విభేదాలను రెచ్చగొడుతూ, పబ్బం గడుపుకొంటున్న రాజకీయనాయకుల ఉచ్చులో ఎక్కువగా యువతే చిక్కుకొని గిలగిల్లాడుతున్నది. మోతాదుకు మించిన ఇంటర్నెట్ వాడకం కారణంగా, ఏకాగ్రత లేమి, పనిలో నాణ్యతాలోపం, పని చేసే శక్తి .. పనిపట్ల ఆసక్తి సన్నగించడం, వాస్తవిక ప్రపంచంతో సంబంధాలు తగ్గడం, ఒంటరితనం, ఆందోళన, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, ఊబకాయం, సమయానికి తినకపోవడం, వ్యాయామం లేకపోవడం, అధిక ధూమపానం, మద్యపానం, వ్యక్తి జీవన విధానాలో పెను మార్పులు రావడం, జీవక్రియలో తేడాలు, ఆన్‌లైన్ సంబంధాల వల్ల కొత్త సమస్యలు, నేరపూరిత ప్రవర్తన, వ్యాధినిరోధక శక్తి తగ్గడం వంటి ఎన్నో రుగ్మతలతో యువత అల్లాడుతున్నది. ఇక గేమింగ్, జూదం, అశ్లీల సైట్లు, సైబర్ నేరగాళ్లతో సంబంధాలు వంటి సమస్యలు కూడా పుట్టుకొస్తున్నా యి. మనీ యాప్స్ కారణంగా ఎంత మంది ప్రాణాలు తీసుకుంటున్నారో మనకు తెలుసు. ఇంటర్నెట్‌ను సక్రమంగా వాడుకుంటే ఎంత ఉపయోగపడుతుందో, పక్కదార్లు పడితే అన్ని నష్టాలకు కారణమవుతుంది. అతి ఎప్పటికీ అనర్థదాయకమే.

## శృతిశర్మ



లక్ష్యం చేరాలన్న పట్టుదల... అందుకు తగిన కృషి ఉంటే అసాధ్యమనేది ఏదీ లేదని నిరూపించింది శృతి శర్మ. కష్టపడి చదవడం ఒక ఎత్తయితే, చదివిన దానిని సమర్థవంతంగా రాయగలగడం, ఇంటర్వ్యూలో తడబాటు లేకుండా సమాధానాలివ్వడం మరో ఎత్తు. ఈ రెండింటిలోనూ శృతి రాణించింది. స్మార్ట్ ప్రిపరేషన్ సామర్థ్యాన్ని ప్రదర్శించింది. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించడానికి అవసరమైన ప్రేరణనిస్తున్న ఆమెను అచంచలమైన అంకిత భావానికి నిదర్శనంగా పేర్కోవాలి. ఢిల్లీలోని కేంబ్రిడ్జి ప్రైమరీ స్కూల్‌లో ఆమె విద్యా ప్రస్థానం ప్రారంభమైంది. అక్కడ కిండర్‌గార్టెన్ నుంచి 5వ తరగతి వరకూ చదువుకుంది. అనంతరం ఢిల్లీలోని సరద్దార్ పటేల్ విద్యాలయంలో చేరింది. సెయింట్ స్టెఫెన్స్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. అండర్‌గ్రాడ్యుయేట్ సమంలో హిస్టరీ ఆనర్స్‌ను అభ్యసించింది. జామియా మిలియా ఇస్లామియా రెసిడెన్షియల్ కోచింగ్ అకాడెమీలో యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ పరీక్షకు శిక్షణ పొందింది. మొదటి నుంచి చదువు పట్ల ఆకస్తి కనబరచి, అద్భుత ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శించిన శృతి, యుపిఎస్‌సిని కూడా అంతే శ్రద్ధగా చదివింది. ఐఎఎస్ కావాలన్న తన కోరికను నెరవేర్చు కుంది. 2021లో ఐఎఎస్ టాపర్‌గా నిలిచింది. దటీజ్ శృతి.

### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..



## వ్యాపారం కష్టం కావచ్చు...అసాధ్యం కానేకాదు


వ్యాపారం అనగానే ముందుగా కష్టాలు, నష్టాలు గుర్తుకొస్తాయి. మనలో అత్యధిక శాతం మంది చాలీచాలని జీతాలకు పని చేయడానికైనా ఇష్టపడతారుగానీ, అవే శక్తిసామర్థ్యాలను సొంత వ్యాపారం అభివృద్ధికి ఉపయోగించుకుందామని అనుకోరు. పెట్టుబడి ఊడ్చుకుపోతుందన్న భయం... వ్యాపారం అచ్చిరాదన్న పిచ్చి నమ్మకం... అసలు ఏం చేయాలో అర్థంగాకపోవడంతో ఏర్పడిన గందరగోళం... ఇవన్నీ కలిసి ఎంతో మంది సమర్థులను కట్టుబానిసలు చేస్తున్నాయి. ఏదో ఒక వ్యాపారంతో స్వయం ఉపాధి కల్పించుకుందామనే ఆలోచను దూరం చేస్తున్నాయి. వ్యాపారం కష్టమన్న విషయాన్ని కాదనలేం. అయితే, అసాధ్యం మాత్రం కాదు. వ్యాపారానికిలక్షలు,కోట్లు పెట్టుబడి అవసరమన్న అపోహ చాలామందిలో ఉంది. ఇప్పుడు ఎంతో కొంత వస్తున్నది కాబట్టి, ఉన్నదానిని పోగొట్టుకొని కొత్త ప్రయత్నాలు చేయడం ఎందుకనే వాదన తెరపైకి వస్తుంది. 'రక్షణాత్మ విధానం' (డిఫెన్స్)ను మించిన ఆయుధం మరొకటి లేదని గుడ్డిగా నమ్మడం ఆనవాయితీగా మారింది. జీవితంలో ఎదగాలి అనుకున్నప్పుడు కష్టం గురించి ఆలోచించకూడదు.కష్టం వద్దనుకున్నప్పుడు జీవితంలో ఎదగాలనే ఆలోచన ఉండకూడదు. అప్పుడు ఉన్నదానితోనే తృప్తిపడాలి. అదే సుఖమనుకొని బతికేయాలి. ఏదోలా బతుకుదాం అనుకునే వారి గురించి ఆలోచించడం కంటే, ఫలానా విధంగానే బతుకుతాం అనుకునే వారి గురించి తపన పడడం అవసరం.

### ఏదైనా చిరు వ్యాపారంతో మొదటి అడుగు వేద్దామనుకునే వారు ప్రయత్నించతగిన కొన్ని వ్యాపారాలు

**దుస్తుల శ్రేణి..** ఈకాలంలో అత్యధిక ఆదరణ అటు తిండికి, ఇటు దుస్తులకి ఉంది. సొంత వ్యాపారం చేద్దామనుకునే వారు వివిధ రకాల దుస్తుల శ్రేణిని పరిశీలించవచ్చు. దుస్తుల మార్కెట్ గురించిన సమాచారం సేకరించి, స్థానికంగా ఉన్న డిమాండ్‌ను పరిశీలించాలి. వ్యాపారం మొదలుపెట్టే ప్రాంతాన్ని అనుసరించి, ఆయా దుస్తుల శ్రేణి మారుతూ ఉంటుంది. లక్షాధికారులు, కోటీశ్వరులు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో బ్రాండెడ్ దుస్తులే అమ్మాలి. సగటు జీవులు బతికే ప్రాంతాల్లో బ్రాండెడ్ కంటే సామాన్య దుస్తులకే డిమాండ్ ఎక్కువ. ఇప్పుడు సోషల్ మీడియా అందుబాటుబాటులో ఉంది కాబట్టి, మీ వ్యాపారాన్ని ప్రచారం చేసుకోవడం సులభమే.

**డ్రాప్‌షిప్పింగ్..** ఉత్పత్తిదారుడికి, వినియోగదారుడికి మధ్య అనుసంధాన కర్తగా వ్యవహరించడాన్ని డ్రాప్‌షిప్పింగ్‌గా పేర్కోవచ్చు. ఈ వ్యాపారం చేసేవారు తమ సొంతంగా వస్తువులు తయారు చేయరు. దుకాణాలు తెరవరు. స్టాక్స్ నిలువ ఉంచుకోరు. ఏ వస్తువుకైనా ఆర్డర్‌ను పొందడం, దానిని ఉత్పత్తిదారుడికి చేరవేయడం లేదా ఉత్పత్తిదారుడు సూచించిన వినియోగదారుడికి సదరు సరుకు అందించడం... ఇది డ్రాప్‌షిప్పింగ్ వ్యాపారం. ఈ వ్యాపారంలో భౌతిక ప్రదేశంలో ఉత్పత్తులను స్టాక్ చేయవలసిన అవసరం లేదు. అంటే, మీ నగదు ప్రవాహం ఇన్వెంటరీలో ముడిపడి ఉం డదు. ఈ వ్యాపారాన్ని ఎక్కడి నుంచైనా నిర్వహించవచ్చు.

## మే 18న జెఇఇ



అడ్వాన్స్ షెడ్యూల్ ను విడుదల చేశారు. మే 18, 2025న నిర్వహించనున్న జెఇఇ (జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్) అడ్వాన్స్ షెడ్యూల్ ను విడుదల చేశారు. సంబంధిత వెబ్‌సైట్ https://jeeadv.ac.in/లో షెడ్యూల్ ను చూసుకోవచ్చు. జెఇఇ మెయిన్స్ 2025 పేపర్లో మొదటి 2.5 లక్షల ర్యాంక్‌ను పొందిన అభ్యర్థులు I కోసం బిఇ/ బిటెక్ పరీక్షకు అర్హులు. తెలంగాణలో జెఇఇ అడ్వాన్స్ పరీక్ష రాసేందుకు 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, మహబూబ్ నగర్, నల్గొండ, నిజామాబాద్, సత్తుపల్లి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్ ఉన్నాయి. ఆర్గనైజింగ్ ఇన్స్టిట్యూట్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) కాన్పూర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఏప్రిల్ 23 నుండి మే 2 వరకు ప్రారంభించనుంది. అర్హులైన అభ్యర్థులు పరీక్ష ఫీజును మే 5 సాయంత్రం 5 గంటలలోపు చెల్లించాలి. మహిళలు, షెడ్యూల్ కులం (ఎస్సి), షెడ్యూల్ తెగ (ఎస్‌టి), వికలాంగులు (పిడబ్ల్యుడి) అభ్యర్థులకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 1600. ఇతర అభ్యర్థులకు రూ. 3200. ఐఐటీల్లో ప్రవేశానికి రెండు సెషన్లలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. పేపర్ 1 ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పేపర్ 2 మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహిస్తారు. అర్హత గల అభ్యర్థులు మే 11 నుండి మే 18 వరకు ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 2:30 గంటల మధ్య అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్ష రాయడానికి వయస్సు ప్రమాణాలను చూస్తే అక్టోబర్ 1, 2000న లేదా ఆ తర్వాత జన్మించిన అభ్యర్థులు అయి ఉండాలి. అయితే, ఎస్‌సి, ఎస్‌టి, పిడబ్ల్యుడి కేటగిరీలకు చెందిన అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

## పండుగకు కూడా పస్తులేనా?

### ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** స్కూలు ప్రారంభమైన నుండి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఇంతవరకు ఒక్క రూపాయి వేతనం ప్రభుత్వం ఇవ్వడం లేదని స్కావెంజర్లు సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో మెమొరాండాన్ని రెవెన్యూ అధికారి విజయలక్ష్మి అందించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు మాట్లాడుతూ ఆరు నెలలుగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్లకు ఒక్క రూపాయి వేతనం ఇవ్వకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, ఈ పండుగ కూడా కొద్దిపాటి జీవితాన్ని కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉందని, తక్షణమే స్కావెంజర్ వేతనాన్ని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకొని పెండింగ్ బకాయిలను చెల్లించాలని, తక్షణమే వారికి కనీస వేతన సవరణ చట్టం ప్రకారం వారికి వేతనాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి సైదాబీ, ధోని కనలక్ష్మి, అర్జుల శ్వేత, కొల్లూరి మేరీ, తాళ్ల సూరయ్య, షేక్ పర్వీన్, పోలేపల్లి పద్మ, ఇల్లా సునీత, మేకల కవిత, ఎండి సుభాన్ పాషా,రామారావు పాల్గొన్నారు.

## సమ్మె వల్ల విద్యార్థులకు ఇబ్బందులు

### ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదళ్ల శరత్

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, వారితో చర్చలు జరిపి వారి సమ్మెను విరమింపజేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యా దళ్ళ శరత్ ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కెజిబివిలపై అవగాహన లేని వారిని ఇన్ చార్జిలుగా నియమిస్తే విద్యార్థులు అన్ని విధాలుగా నష్టపోతారని ఆయన అన్నారు. దీనిపైప్రభుత్వం పునరాలోచించాలని వెంటనే స్పందించి విద్యార్థులను ఇబ్బందులకు గురి చెయ్యొద్దని, అలాగే సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి,వారిని రెగ్యులరైజ్ చేయాలని, ప్రభుత్వం పై తిరుగుబాటు జరగకుండా చూసుకోవాలని హితవు పలికారు. విద్యార్థులు ఇబ్బందులు పడితే విద్యార్థి సంఘాలుగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెలో విద్యార్థులతో కలిసి పాల్గొని వారి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## పోటు ప్రసాద్‌కు ఘననివాళి

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : ప్రజాసంఘాల నిర్మాణంలో పోటు ప్రసాద్ తనదైన ముద్ర వేశారని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, ఓమయ్య అన్నారు. శ్రద్ధానంద్ గంజ్ హమాలీ యూనియన్ హాల్‌లో అమరజీవి బాలమల్లేష్, పోటు ప్రసాద్‌ల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని వారి చిత్రాపటాలకు పూలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నరేష్, హన్మాండ్లు, పరశురాం, అమర్, శ్రీహర్, అంబాదాస్, బోజరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

## ఎఐటియుసి రాష్ట్రకమిటీ సభ్యుడుగా మాషూక్

**ప్రజాపక్షం/ నర్సంపేట :** అఖిలభారత కార్మిక సంఘం ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా నర్సంపేట మండలం, రాజ పల్లె గ్రామానికి చెందిన ఎండి మా షూక్ ఎన్నికయ్యారు. ఈనెల 5న మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రంలో జరిగిన ఎఐటియుసి రాష్ట్ర నిర్మాణ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ఉద్యమ నేపథ్యాన్ని గుర్తించిన రాష్ట్ర కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## జిఒను అమలు చేయాలని

# కలెక్టరేట్‌ల ఎదుట హమాలీల ధర్నా

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** రాష్ట్ర సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్‌తో కుదుర్చుకున్న పెరిగిన రేట్ల ఒప్పందం జిఒ అమలు చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో సివిల్ సప్లయి హమాలీ కార్మికులు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్ కృష్ణ మూర్తికి వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కురాజు గౌడ్ మాట్లాడుతూ గతంలో సివిల్ సప్లయి కమిషనర్ కార్మికులతో ఒప్పుకున్న ప్రకారం జిఒ అమలు చేయక పోవడం శోచనీయమని, ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలతో సహా ఒప్పంద జిఒను అమలు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికులకు 10లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, లేని యెడల సమ్మె యథావిధిగా కొనసాగుతుందన్నారు. ధర్నాలో ఎఐటియుసి జిల్లా నాయకులు బత్తిని సదానందం, కూటు అధ్యక్షులు కుక్కల మల్లయ్య, మచ్చ సందీప్, గడ్డం సురేష్ ,కునుకుల బిక్షపతి, బోయిన సమ్మయ్య, ఆకుల సుధాకర్, బోయిని కట్టయ్య, హనుమకొండ సివిల్ సప్లయి హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

### మంత్రుల ఇండ్లనూ ముట్టడిస్తాం

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** సివిల్ సప్లై హమాలీ రేట్ల జిఒను విడుదల చేయకుంటే మంత్రుల ఇండ్లను ముట్టడిస్తామని సివిల్ సప్లై రాష్ట్ర అధ్యక్షులు గుంపల్లి మునీశ్వరుడు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్‌లు డిమాండ్ చేశారు. సివిల్ సప్లై రేట్ల ఒప్పందం జీవో విడుదల చేసి పెరిగిన రేట్ల ప్రకారం బకాయిలను విడుదల చేయాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ గోడౌన్‌లో పనిచేసే హమాలీ కార్మికులు సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ ముట్టడించి రెవెన్యూ అధికారి విజయలకి పలుడిమాండ్లతో కూడిన మెమొరాండం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి మియాపురం, గోవర్ధన చారి, సివిల్ సప్లై హమాలి కార్మికులు కొత్తగట్టు నర్సింహం బక్కెర కిషోర్ ,తుప్పతి కుమారస్వామి గొర్రె కుమారస్వామి మిట్టపల్లి సురేందర్ రాయరాకుల తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లై గోదాములలో ఎగుమతి దిగుమతి చేస్తున్న హమాలీ కార్మి కుల కూలీరెట్ల జిఒను వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి, మల్యాల, ధర్మపురి గోదాం పాయింట్లు గత ఆరు రోజులుగా అమాలి కూలిరెట్లు పెంచిన జిఒను విడుదల చేయాలని, ఇతర సంక్షేమ పథకాల వెంటనే అమలు చేయాలని నిరవధిక సమ్మె చేపట్టినట్టు తెలిపారు. నంతరం కలెక్టర్ జిఎంకు వినతి పత్రాలు అందించారు. ప్రభుత్వ అధికారులు హామాలీ కార్మికులను బెది రింపులకు భయభ్రాంతులకు గురిచేస్తూ పనిచేయమని ఒత్తిడి తెస్తున్నారని, ఇలాంటి చర్యలు అధికారులు మానుకోవాలని, కాలయాపన చేస్తున్న పెరిగిన కూలి రెట్ల జిఒ అమలు చేయాలన్నారు. సివిల్ సప్లై అమాలి కార్మిక సంఘం నాయకులు బి.మల్లయ్య, ఇస్తారి, తిరుపతి, వై. నరసయ్య, డి.మల్లేశం మరియు ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి ముక్రం, సహాయ కార్యదర్శి వెన్న మహేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నస్పూర్:** సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు పెంచాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. సోమవారం సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుటు ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎఐ టియుసి జిల్లా ఉపాధ్యక్షులు మిట్టపల్లి పౌలు, పానుగంట సత్యనారాయణ, తిప్పని సత్తయ్య, గుర్రాల సంపత్, రాజన్న, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.నిర్మల్‌జిల్లా సివిల్ సప్లై హమాలీల జిఒను అమలు చేయాలని కోరారు.ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఎస్ విలాస్‌హాజరై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కామ్రేడ్ ఎస్‌విలాస్ మా ట్లాడుతూ గత 4 నెలలుగా సివిల్ సప్లై కమిషనర్‌తో గతం ఒప్పందం అయిందని దానిని అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ పి.పుండాలిక్, జిల్లా యూనియన్ కార్యదర్శి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి.ముత్యం జిల్లా అధ్యక్షలు, పి.భీమాష్, జిల్లా సహాయ కార్యదర్శి, బాధర్ జిల్లా ఉపాధ్యక్షలు, పాల్గొన్నారు.



హనుమకొండ టౌన్‌లో...


జగిత్యాల రూరల్‌లో...



మంచిర్యాలలో..


వరంగల్‌లో..



నిర్మల్‌టౌన్‌లో..

## సింగరేణిలో నూతన గనులు ఏర్పాటు దిశగా చర్చ

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాల వయోపరిమితి 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచడం ఎఐటియుసి ఘనతేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. సోమవారం కెటికె ఒసి2లో ఎఐటియుసి అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ సామకృష్ణమూర్తి అధ్యక్షతన ద్వారా సుమమావేశం (గేట్ మీటింగ్) జరిగింది. ఈ సమావేశానికి ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఇటీవల జరిగిన స్ట్రక్చర్ సమావేశంలోని విషయాలు కార్మికులకు వివరించారు. ఈ ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరే ణిలో నూతన గనులు రాకుంటే సింగరేణి మొనగాడా ప్రశ్నార్థకమని నూతన ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని, ఈ విషయంపై యాజమాన్యంతో చర్చించడం జరిగిందని త్వరలోనే నూతన గనుల ఏర్పాటు చేయడం జరుగుతుంద న్నారు. అలాగే గుర్తింపు సంఘంగా గెలిచిన అనతి కాలంలోనే పలు డిమాండ్లను సాధించడం జరిగిందని తెలిపారు. అలాగే టెక్నీషియన్లకు, మైనింగ్ సూపర్వైజర్లకు సర్ఫేస్ లో సూటబుల్ జాబ్ ఇవ్వడం, గతంలో మైనింగ్ సర్టిఫికెట్ ఆలస్యం కావడం వల్ల ఉద్యోగాలు పోయిన జేఎంఈటి లకు తిరిగి ఉద్యోగాలు ఇప్పించడం ఎఐటియుసి చొరవేనని అని తెలిపారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ తప్పకుండా నెరవేరుస్తుందని, యూనియన్ చేసే పోరాటాలకు వివిధ కార్యక్రమాలకు కార్మికులు అండగా నిలవాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, మైనింగ్ సబ్ కమిటీ ఇన్చార్జ్ తోట రామచందర్, పి.నారాయణ, మల్లేష్, కె.శ్రీనివాస్, పర్వతాలు, రాజమౌళి, సేఫ్టీ కమిటీ, మైనింగ్ కమిటీ, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



## అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులతో పరిసరాలు పరిశుభ్రం

**ప్రజాపక్షం/కొత్తూరు:** అండర్ గ్రౌండ్ డ్రైనేజీతోనే పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని కొత్తూరు మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు. సోమవారం కొత్తూరు మున్సిపాలిటీ లోని 11వ వార్డులో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎన్.బాలాజీ, వైస్ చైర్మెన్ డోలీ రవీందర్, కౌన్సిలర్లు కోస్గి శ్రీనివాస్, జె.శ్రీనివాన్, అల్విన్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, పీర్లగుడెం చంద్రయ్య, కుమ్మరి లక్ష్మయ్య, రాజిరెడ్డి, గోపాల్‌లు ఉన్నారు.

# మహానగరి

## డివిజన్ అభివృద్ధికి నిధులు హర్షణీయం

**ప్రజాపక్షం/సరూర్ నగర్:** డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం హర్షణీయం అని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. సోమవారం డిప్యూటీ కమిషనర్ సుజాతను ఉపేందర్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధుల విడుదలకు కృషి చేసిన జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కెఎల్‌ఆర్, సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గణేష్ నేత, బండి మధుసూదన్‌రావు, లింగస్వామిగౌడ్, జ్ఞానేశ్వర్ యాదవ్, రమేష్ నేత, యాదవ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, శివ, పగడాల ఎల్లయ్య,రాజు నాయక్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా, అనీరాజాకు వీడ్కోలు



**ప్రజాపక్షం/నార్సింగి :** సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, అనీరాజాకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలనరసింహ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి, నందిగామ మండల కార్యదర్శి గడ్డం జంగయ్యలు వీడ్కోలు పలికారు. హైదరాబాదులోని విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగిన దళిత హక్కుల పోరాట సంఘం జాతీయ మహాసభలకు హాజరై తిరిగి ఢిల్లీకి ప్రయాణమయ్యారు. సిపిఐ నాయకులు వా రికి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు పలికారు.

## ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

బుద్దుల జంగయ్య వినతి



**ప్రజాపక్షం/కొందుర్గు:** అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఎంపిడిఒ అనురాధకు వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేలో చాలా మంది లబ్దిదారులు తమకు ఇందిరమ్మ ఇల్లు కావాలని ప్రజా పాలన ధరఖాస్తులో టిక్ చేసినా, సర్వే యాప్‌లో వారి పేర్లు చూయించకపోవడంతో, సర్వే చేస్తున్నా వారు తమ ఫోటోలు తీసుకోవడం లేదని లబ్దిదారులు ఆందోళన చెందుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రజా పాలనలో ధరఖాస్తులు ఇచ్చిన వారందరి ఫోటోలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. ఈ విషయమై ఎంపిడిఒ అనురాధ మాట్లాడుతూ కొన్ని గ్రామ పంచాయితీలలో సాంకేతిక సమస్య వల్ల ఇలాంటి సమస్యలు వచ్చాయని, వాటిని పరిష్కారం చేస్తున్నామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బినర్సింహ్మా, సిసురేష్, లక్ష్మయ్య, సునిత, రాములు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు అర్జీలు పరిష్కారం

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్,జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ21, ఇతర శాఖలకు 31 తో కలిపి మొత్తం 52 దరఖాస్తులు అందాయని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి అధికారులంతా కలిసి పనిచేయాలి

కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** జిల్లా గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ 2025 క్యాలెండర్‌ను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అధికారులంతా కలిసి పని చేయాలని సూచించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి గెజిటెడ్ అధికారుల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి, అసోసియేట్ అధ్యక్షులు పిసి వెంకటేష్, ఉపాధ్యక్షులు నూతనకంటి వెంకట్, గంప శ్రీనివాస్, అలివేలు మంగ, సంయుక్త కార్యదర్శులు లక్ష్మణ స్వామి, సుజాత, సైదమ్మ, రాకేష్, నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు డాక్టర్ నరేందర్, జిల్లా వెటర్నరీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లాలోని ఇతర గెజిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

## రిటైల్ సేవా రంగంలో 'గిగ్ ఆర్థిక వ్యవస్థ' గణనీయపాత్ర

ఎన్‌ఆర్‌ఆర్‌ఆర్‌సి సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సురేష్‌బాబు

సిఆర్ ఫౌండేషన్‌లో గిగ్ వర్కర్స్‌పై సెమినార్




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి/శేరిలిగంపల్లి :** రిటైల్ సేవా రంగంలో గిగ్ ఆర్థిక వ్యవస్థ గణనీయమైన పాత్ర పోషిస్తోందని ఎన్‌ఆర్‌ఆర్ ఆర్‌సి సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. "గిగ్ ఎకానమీ.. సవాళ్లు, అవకాశాలు, విధాన పరిష్కారాలు" అనే అంశంపై సెమినార్‌ను సిఆర్ ఫౌండేషన్ హైదరాబాద్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో సోమవారం నిర్వహించారు. సెమినార్‌లో గిగ్ కార్మికులతోపాటు క్యాబ్ డ్రైవర్లు, ఆల్ ఇండియా జిఐజి వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. సెమినార్‌కు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు హాజరయ్యారు. సెమినార్‌లో సెంటర్ డైరక్టర్ డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ నీతి ఆయోగ్, నిపుణుల అభిప్రాయం ప్రకారం, గిగ్ ఆర్థిక వ్యవస్థ గత దశాబ్దంలో 450 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 37 లక్షల కోట్లు) టర్నోవర్‌తో దేశంలో వేగంగా అభివృద్ధి చెందిందన్నారు. అంతే కాకుండా 77 లక్షల మంది తాత్కాలిక కార్మికులు, ఫ్రీలాన్సర్‌లకు ఉపాధి కల్పిస్తోందని చెప్పారు. కార్మికులు ఎక్కువగా ఉబర్, ఓలా, స్విగ్గి, జొమాటో, అమెజాన్, ఫ్లిప్‌కార్టు వివిధ ఇతర డిజిటల్ ప్లాట్‌ఫ్లామ్‌లలో పనిచేస్తున్నారని ఆయన వివరించారు. అంతేకాకుండా దేశంలో ఈ సంఖ్య 2029–30 నాటికి 2.35 కోట్లకు లేదా మొత్తం శ్రామిక శక్తిలో 4.1 శాతానికి పెరుగుతుందని అంచనా వేశారు. అయినప్పటికీ, ఈ రంగంలోని కార్మికులు అసంఘటితంగా ఉన్నారన్నారు. కనీస వేతనం ఇతర ప్రయోజనాలు లేని కష్టతరమైన పని పరిస్థితులను తరచుగా ఎదుర్కొంటున్నారు. నేడు డిజిటల్ పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడిదారీ విధానం కార్మికుల దోపిడీ మరింత తీవ్రంగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. మాజీ లేబర్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కింగ్‌షుక్ సర్కార్ మాట్లాడుతూ గిగ్ ఆర్థిక వ్యవస్థలో పరిమాణం, కార్మిక ఉపాధి, దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర గురించి డేటాతో వివరించారు. ఈ రంగంలో ఉపాధి సంబంధాలపై వ్యాఖ్యానిస్తూ, అవి అస్పష్టంగా ఉన్నాయన్నారు. గిగ్ రంగంలోని కార్మికులకు కనీస హక్కులను అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రక్రియలో కార్మిక సంఘాలు కీలక పాత్ర పోషించాలని డాక్టర్ సర్కార్ పిలుపునిచ్చారు. 2014 నుంచి ప్రభుత్వం అమలు చేస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు నిరుద్యోగ పెరుగుదలకు, ఉపాధిని సాధారణీకరణకు దారితీశాయని డెవలప్‌మెంట్ ఎకనామిస్ట్ డాక్టర్ పిఎస్‌ఎం రావు అన్నారు. గిగ్ ఎకానమీ ఈ విధానాలకు స్పష్టమైన రుజువు అన్నారు. ఆల్ ఇండియా గిగ్, ప్లాట్‌ఫారమ్ అండ్ యాప్ ఆధారిత వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి షేక్ సలావుద్దీన్ మాట్లాడుతూ రవాణా, ఆహార రంగాలలో గిగ్‌తో పాటు ప్లాట్‌ఫారమ్ ఆధారిత కార్మికులు ప్రస్తుతం ప్రమాదకర పరిస్థితులలో పని చేస్తున్నారన్నారు. గత 10 సంవత్సరాలుగా, తమ యూనియన్ ఉబెర్, ఓలా, ఆటోల క్యాబ్ డ్రైవర్లతో సహా గిగ్ వర్కర్ల చట్టపరమైన హక్కుల కోసం, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో చర్చలు జరుపుతూ మెరుగైన కార్మిక నిబంధనలు, షరతుల కోసం పోరాడుతోందని సలావుద్దీన్ చెప్పారు. భద్రత, వైద్యం, బీమా డిమాండ్ చేస్తూ సమాజంలో గిగ్ కార్మికులకు సరైన స్థానానికి హామీ ఇచ్చే సమగ్ర, న్యాయమైన చట్టాల కోసం ప్రభుత్వాలతో పోరాడేందుకు రాజకీయాలకు అతీతంగా అన్ని కార్మిక సంఘాలు ఒకే వేదికపై ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి నాయకుడు వెంకటేష్, గిగ్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ కార్మికుల సమస్యలపై గిగ్ యూనియన్‌లకు చెందిన షేక్ సలుద్దీన్, ఇతర నాయకులతో సంయుక్తంగా పోరాటం చేయడం గురించి తన అనుభవాలను పంచుకుంలూ గిగ్ ఆవశ్యకతను ఉద్బోధించారు. ఐక్య కార్యాచరణ ప్రణాళిక. గిగ్ వర్కర్ యూనియన్లు నీలం రాజశేఖర్‌రెడ్డి పరిశోధనా కేంద్రం ఈ సెమినార్‌ను నిర్వహించడాన్ని ప్రశంసించారు.

## పండ్ల మార్కెట్‌లో కార్మికులకు కనీస సౌకర్యాలు

ఎఐటియుసి రాష్ట్ర నాయకులు రత్నాకర్‌రావు డిమాండ్

**ప్రజాపక్షం/అబ్దులాపూర్‌మెట్ :** రోజు కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్న పండ్ల మార్కెట్‌లో హమాలీ కార్మికులకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎఐటియుసి రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అబ్దులాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్‌లో ఎఐటియుసి అధ్వర్యంలో సోమవారం జరిగిన సభకు అయన ముఖ్యఅతిథిగా రత్నాకర్‌రావు హాజరై మాట్లాడారు. నగరంలో ఉన్నా పండ్ల మార్కెట్‌ను నగర శివారుకు తీసుకొచ్చి 4 సంవత్సరాలు గడుస్తున్నా నేటికి కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. కార్మికులు ఉండేందుకు విశ్రాతి భవనాలు, మంచినీటి సౌకర్యాలు కల్పించాలన్నారు. హమాలీలకు గుర్తింపు కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సంధర్భంగా 50 మంది హమాలీ కార్మికులు ఎఐటియుసిలో చేరారు. సమావేశానికి ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీర్ హరిసింగ్ అధ్యక్షత వహించగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రా చారి, జిల్లా ఎఐటియుసి కార్యదర్శి పానుగంటి పర్వతాలు, సిపిఐ నాయకులు ముత్యాల యాదిరెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, సామిడి శేఖర్‌రెడ్డి, దాసరి ప్రసాద్, కేతరాజు నర్సింహ్మా, వేణుగోపాల చారి, చందన, లక్ష్మి ప్రియా తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక...** బాటసింగారం పండ్ల మార్కెట్ ఎఐటియుసి కమిటీ అధ్యక్షుడిగా మక్బుద్ బాయి, ప్రధాన కార్యదర్శింగా చిన్నగౌడ్, కోశాధికారిగా మేతరి పోశయ్య, ఉపాధ్యక్షులుగా షరీఫ్, రాములు, మన్నాభాయ్ అలీమ్ భాయ్ అజాంద్ గంగారం లైక్ బాయ్ కోటిరెడ్డి సాయిలు నర్సింహ్మా,ఖజీర్ ఉతప్ప తిప్పన్నలను ఎన్నికయ్యారు.




## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు యాదయ్య డిమాండ్

**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ జేఎన్‌ఎన్‌యుఆర్ గృహకల్పలో ఉన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సోమవారం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య, జిల్లా సమితి సభ్యులు పి.శివకుమార్, కాలనీ కార్యదర్శి డి శివప్రసాద్ రాగన్నగూడలో ఎలక్ట్రిసిటీ డిఇని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ గృహకల్పలో ప్రధానంగా విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. అధికారులు చొరవ తీసుకొని సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శివ ప్రసాద్, దుబ్బ యాదయ్య, బి.నరసింహ తదితరులు పాల్గొన్నారు



## నత్తనడకగా ట్రంక్ లైన్ పనులు

జలమండలి అధికారుల తీరుపై సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్ర చారి ఆగ్రహం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** జలమండలి అధికారుల నిర్లక్ష్యంతో ట్రంక్ లైన్ పనులు దాదాపు మూడు నెలలు గడిచిన పూర్తి చేయకపోవడంతో ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జలమండలి అధికారుల తీరుపై సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి అగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం హయత్ నగర్ మండల సిపిఐ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్‌లోని మదర్ డయిరీ ప్రభుత్వ కళాశాల నుండి పుల్లారెడ్డి స్వీట్ హౌజ్ వరకు ఏర్పాటు చేస్తున్న ట్రంక్ లైన్ పనుల వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రచారి, ఎల్‌బి నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి, వాటర్ వర్క్స్ అధికారుల నిర్లక్ష్యంతో దాదాపు మూడునెలల నుంచి పనులు అసంపూర్తిగా కొనసాగుతున్నాయన్నారు. ట్రంక్ లైన్ పూర్తయితే సుమారు 18 కాలనీల ప్రజలకు డ్రైనేజీ సమస్య తీరుతుందని వారు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలతో ఓట్లు వేయించుకున్న ఎంఎల్‌ఎ, ఎంపి, కార్పొరేటర్‌లు ప్రజల సమస్యలను గాలి వదిలేశారని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కాంట్రాక్టర్‌ను నిలదీస్తే బిల్లుల పేరుతో కాలం వెల్లదిస్తున్నారని దీనిపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హయత్ నగర్ సిపిఐ మండల కార్యదర్శి శ్రీదేవి, సహాయ కార్యదర్శి శోభన్, అరుణ్, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు వంశివర్ధన్‌రెడ్డి, కందుల సుధాకర్, రమావత్ సక్రు నాయక్, సుజాత, వీరస్వామి, వీరన్న, వెంకట్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల నిర్మాణానికి రూ.5లక్షల విరాళం

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి రూ.5లక్షల విరాళం అందజేశారు. సోమవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కాంగ్రెస్ సీనియర్ నేత కాశీనాథ్‌రెడ్డితో కలిసి వ్యాపార వేత్త పూర్ణ చందర్ రూ.5లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పేద ప్రజల శ్రేయస్సు కోసం నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్పోరేట్‌కు ధీటుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నిర్మించడం జరుగుతుందని, ఇందుకు దాతలు మరింత మంది ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలంటే విద్య ఎంతో అవసరమని, అందుకే కళాశాలను అన్ని హంగులతో నిర్మిస్తున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కడ లేని విధంగా జూనియర్ కళాశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి తొచిన విధంగా ఆర్థికంగా విరాళం ఇచ్చేందుకు కృషి చేయాలని కోరారు. అదే విధంగా ఇందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నందిగామ శంకర్, తుపాకుల శేఖర్‌తోపాటు కళాశాల ప్రిన్సిపల్ ఉన్నారు.



## కాలనీ సమస్యలు పరిష్కారానికి కృషి

హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** శ్రీ రమణ కాలనీ ఫేస్1లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ అన్నారు. సోమవారం కార్పొరేటర్ కార్యాలయంలో కాలనీ సమస్యలు సరిష్కారం కోసం శ్రీరమణ కాలనీ సంక్షేమ వాసులు కార్పొరేటర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాత నాయక్ మాట్లాడుతూ శ్రీరమణ కాలనీల్లో అవసరమైన మౌళిక సదుపాయలు కల్పనకు సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రణాళిక సిద్ధం చేసి నిధులు మంజూరు చేయించి సమస్యలు పరిష్కరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కాలనీల్లో వీధి లైట్లు, డ్రైనేజీ, రోడ్లలను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు సంతోష్, బాలాజీ, రాజిరెడ్డి, సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గొంతుక 'ప్రజాపక్షం'

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సమస్యల పరిష్కారానికి ప్రజల గొంతుకగా 'ప్రజాపక్షం' దినపత్రిక పని చేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రజాపక్షం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజాపక్షం దినపత్రిక ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందన్నారు. సమాజంలో మీడియా అనేది నాల్గవ స్థానంలో ఉందని, ప్రజలకు, ప్రజాప్రతినిధులకు వారధిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజాపక్షం దినపత్రిక ప్రజలకు వారదిగా పని చేయడంతోపాటు నిజాన్ని నిర్భయంగా రాసే ప్రజాపక్షం దినపత్రిక ఎల్లప్పుడు ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మీడియాకు పూర్తి స్వేచ్ఛ ఉందని, నిజాన్ని నిర్భయంగా వ్రాసేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని గుర్తు చేశారు. ప్రజా సమస్యలను కథనాల ద్వారా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాము సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో మీడియాకు స్వేచ్ఛ అనేది లేకుండా పోయిందని, ఎక్కడికక్కడే చేతులు కట్టివేశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమం లో ప్రజాపక్షం దినపత్రిక షాద్‌నగర్ పిసి ఇన్‌చార్జి కె.రమేష్, కొత్తూరు విలేకరి ఎం.అనిల్‌కుమార్, కొందుర్గ విలేకరి సత్యనారాయణ, ఫరూఖ్‌నగర్ విలేకరి వెంకటేష్ గౌడ్, నందిగామ విలేకరి పవన్‌తో పాటు కాంగ్రెస్ నేతలు బస్వం, కృష్ణారెడ్డి, తుపాకుల శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.






### ప్రజాపక్షం..ప్రజల పక్షం : మల్‌రెడ్డి రాంరెడ్డి

**తుర్కయంజాల్:** నిజాలను నిర్భయంగా రాస్తూ ప్రజాపక్షం దినపత్రిక అనతి కాలంలోనే ప్రజల పక్షం అయ్యిందని రాష్ట్ర రాష్ట్ర ఆర్ అండ్ బి డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి అన్నారు. సోమవారం ప్రజాపక్షం దినపత్రిక 2025 క్యాలండర్,డైరీని రాంరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా వెలికితీస్తూ ప్రజలకు తెలియపరుస్తుందన్నారు. ప్రజలకు,ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్న ప్రజాపక్షం దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, వైస్‌చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య, మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు,ప్రజాపక్షం తుర్కయంజాల్ విలేకరి కె.నాగార్జున,తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతీ సంప్రదాయాలకు సంక్రాంతి ముగ్గులు ప్రతీక

కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** సంస్కృతీ సంప్రదాయలకు సంక్రాంతి ముగ్గులు ప్రతీక అని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్‌లోని వీరాంజనేయ కాలనీలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమంలో కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నా రు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ ముగ్గుల పోటీలలో మహిళలు ప్రతిభ కనబర్చడం అభినందనీయమన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపోందిన వారికి కార్పొరేటర్ సొంత ఖర్చుతో బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రామయ్య, భాష, సుధాకర్ రావు, రమేష్, శంకరయ్య, రెహమాన్, అనిల్ పాల్గొన్నారు.



## వైద్య శిబిరం ప్రారంభం : ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/పెద్దేముల్:** శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఎల్‌ఎన్‌ఆర్ యువసేన వ్యవస్థాపకులు లొంక నర్సిములు ఆధ్వర్యాన నిర్వహించిన పెద్దేముల్‌లో సోమవారం నిర్వహించిన ఉచితకంటి వైద్య శిబిరాన్ని తాండూరు ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. మారుమూల గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ అధ్యక్షులు లొంక నర్సింహు లు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి దారాసింగ్, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

## 'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరించిన డిపిఆర్‌ఒ చెన్నమ్మ



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** 2025కి సంవత్సరం, ప్రజాపక్షం క్యాలెండర్‌ను వికారాబాద్ జిల్లా డిపిఆర్‌ఓ చెన్నమ్మ, ఎపిఆర్‌ఒ ప్రభాకర్ తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు, అధికారులకు మధ్యవారధిగా ఉండాలని, నిరంతరం ప్రజలకోసం నిలబడేదే ప్రజాపక్షం పత్రిక అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ప్రతినిధి రవీందర్, రిపోర్టర్లు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి ఔట్‌సోర్సింగ్ సమస్య పరిష్కరించాలని వినతి



**ప్రజాపక్షం/అల్వాల్ :** జిహెచ్‌ఎంసి ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని అల్వాల్ ఔట్‌సోర్సింగ్ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి సమస్యల మీద వినతిపత్రం అందజేశారు. గ్రేటర్ హైదరాబాద్ మెట్రో సిటీ కాబట్టి జీతాలు పెంచి ఏజెన్సీ వ్యవస్థను ఎత్తివేసి జిహెచ్‌ఎంసి కార్పొరేషన్ ద్వారా జీతాలు చెల్లించాలని కోరారు. మంత్రి వెంటనే స్పందించి జిహెచ్‌ఎంసి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ విభాగం నరేష్, మల్లేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## దూసుకుపోయిన జెసిబి : రెండు బైకుల ధ్వంసం



**ప్రజాపక్షం/కాప్రా :** ఆగిఉన్న జిహెచ్‌ఎంసికి చెందిన జెసిబి వాహనం డ్రైవర్ లేకుండానే ఒక్కసారిగా ముందుకు దూసుకొని వెళ్లిన ఉదంతంలో రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. దీన్ని చూసిన డ్రైవర్‌ను ఆ వాహనాన్ని ఆపే యత్నంలో గాయాలకు గురయ్యాడు. నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గోకుల్ నగర్ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటు చేసుకొంది. మల్లాపూర్ ఎఫ్‌సిఐ రహదారిలోని గోకుల్ నగర్ మసీద్ సమీపంలో రుచి బెంగుళూరు బేకరీ సమీపంలో డ్రైవర్ వెంకటేష్ తన జిహెచ్‌ఎంసి జెసిబి వాహనాన్ని స్టార్టింగ్ లోనే ఉంచి పక్కనే ఆపి టీ తాగేందుకు వెళ్లాడు. కాసేపటికే ఆ వాహనం గేర్ లోకి పడటంతో అక్కడే ఉన్న రెండు ద్విచక్రవాహనాల మీదుగా ముందుకు దూసుకొని వెళ్లటంతో వాహనాలు ధ్వంసమయ్యాయి. దీన్ని చూసి టీ తాగుతున్న డ్రైవర్ వెంకటేష్ జెసిబిని ఆపే యత్నంతో గాయాల పాలవటంతో చికిత్స నిమిత్తం అతడిని ఆస్పత్రికి తరలించారు. నాచారం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజావాణిలో 114 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సత్వర పరిష్కారానికి అందించే ఫిర్యాదులను వెంటనే పరిశీలించి న్యాయం చేకూర్చాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్‌ఓ హరిప్రియ ఇతర విభాగాల అధికారులతో కల్సి అర్జీలను స్వీకరించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన 114 ఫిర్యాదులను స్వీకరించిన ఆయన ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరిస్తూ వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయటంతో పాటు వాటి వివరాలను సంబంధిత ఫిర్యాదస్తులకు తెలియచేయాలని, పరిష్కరించలేకపోతే దానికి కారణాలను సైతం తెలియచేయాలని అధికారులను సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం కనపరచవద్దని హెచ్చరించారు.

## నీటి సరఫరాలో అలసత్వం వహిస్తే సహించం : శ్రీశైలం గౌడ్ హెచ్చరిక



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జలమండలి జనరల్ మేనేజర్ అశోక్‌ని నీటి సరఫరా విషయంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ నిలదీశారు. బస్తీలలో చేస్తున్న నీటి సరఫరాలో అలసత్వం వహిస్తే సహించేది లేదని శ్రీశైలం గౌడ్ హెచ్చరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని ఐడిపిఎల్ చౌరస్తాలోని హెచ్ ఎండబ్ల్యుఎస్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని నియోజకవర్గంలోని పలు కాలనీలు, బస్తీలలో నీటి సరఫరాలో జరుగుతున్న అవకతవకలు, అధికారుల అలసత్వాన్ని వివరించారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఆదర్శ నగర్, మెట్కాని గూడ, శారదా కాలనీ, కెకెఎం నగర్, రాజీవ్ గాంధీ నగర్, కళావతి నగర్, శ్రీవెన్ ఎంక్లేవ్, చింతల్, సూరారం కాలనీ, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాలలో నీటి సరఫరాలో ప్రెజర్ తక్కువగా వస్తుందని, సరిపడే తాగునీరు సరఫరా జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ అశోక్, నాయకులు పాల్గొన్నారు.

**ఎన్‌ఎస్‌యుఐ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడలు ప్రారంభం**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని చింతల్ హెచ్‌ఎంటీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా గాంధీ మెమోరియల్ మండల్ లెవల్ క్రీడా పోటీలను మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు ఎంతో కీలకమని, విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో ఉత్సాహం, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యుఐ మాజీ ప్రధాన కార్యదర్శి జాన్, యువజన నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అధ్యయస్ క్లాసిక్ బొటిక్ ప్రారంభం



**ప్రజాపక్షం/అల్వాల్ :** మచ్చ బొల్లారం డివిజన్ సూర్యనగర్‌లో అధ్యయస్ క్లాసిక్ బొటిక్‌ను ప్రారంభించిన మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ, అల్వాల్ పట్టణ ప్రజలకు సరసమైన ధరలతో వినియోగదారులను ఆకర్షించి అభివృద్ధి చెందాలని నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిమ్మ అశోక్ రెడ్డి, కృష్ణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీశైలం యాదవ్, బలవంత రెడ్డి, రాజనర్సింహారెడ్డి, ప్రవీణ్, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

## నేరుగా కమిషనర్ చేతికే వినతిపత్రాలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైడ్రా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 83 ఫిర్యాదులు అందాయి. హైడ్రా కమిషనర్ ఎవి. రంగనాథ్ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. సమస్య ఏమిటి?, ఏ ప్రాంతానిది? పూర్తి వివరాలు తెలుసుకుని అప్పటికప్పుడే స్థానిక అధికారులతో మాట్లాడి సమస్యను వివరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రంగనాథ్ కోరారు. ఔటర్ రింగ్‌రోడ్డు పరిధి దాటి ఇతర జిల్లాల నుంచి కూడా వచ్చిన ఫిర్యాదుదారులకు తమ పరిధిలో లేదని నచ్చజెప్పి వెనక్కి పంపించారు. హైడ్రా పరిధిలోని ఫిర్యాదులే కాకుండా ఇతర శాఖలకు చెందిన సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖాధిపతులకు అందజేయాలని కమిషనర్ సూచించారు. ప్రతి ఫిర్యాదుపై హైడ్రా కార్యాలయంలో అధికారులతో చర్చించి, ఆయా ఫిర్యాదులు ఎవరి పరిధిలో ఉంటే వారికి అందజేసి, వారం రోజుల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

సంబంధిత అధికారులకు ఫిర్యాదులు కేటాయించి, వారితో ఫాలోఆప్ చేయాలంటూ ఫిర్యాదుదారులకు సూచించారు. 3వారాల్లో ఫిర్యాదుపై స్పందన ఉంటుందని కమిషనర్ హామీనిచ్చారు. నేరుగా హైడ్రా అధికారులు ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని తెలిపారు. సామాన్యుల నుంచి ప్రభుత్వ, పోలీసు ఉద్యోగులు, ఆర్మీ అధికారులు, రిటైర్డ్ ఉద్యోగులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల ప్రతినిధులు ఇలా అన్ని వర్గాల నుంచి హైడ్రా కమిషనర్‌కు నేరుగా ఫిర్యాదులు చేశారు. చెరువులు, పార్కులు, రహదారుల కబ్జాపై వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు అందాయి.

- పాత లే ఔట్లను పక్కన పెట్టి, ఫోర్జరీ లే ఔట్లతో పార్కులను, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాజేసిన కబ్జాదారులపై ఫిర్యాదు.
- తనకు ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలంతో పాటు, పార్కు స్థలాన్ని కూడా స్థానికంగా ఉన్న ఓ మహిళ కాజేసిందని, స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని కమిషనర్‌కు 1971లో ఇండో పాక్ యుద్ధంలో నేరుగా పాల్గొన్న విశ్రాంత సైనికుడు పి. సీతారామరాజు మొరపెట్టుకున్నారు.
- జవహర్ నగర్‌లో ప్రభుత్వ భూమిని నోటరీ చేసి అమ్మేస్తున్నారని, మొత్తం 6 వేల ఎకరాలకు గాను 2500 ఎకరాలు మాత్రమే మిగిలి ఉందని, దీనిని కూడా ప్లాట్లు చేసి అక్రమ లే ఔట్‌తో అమ్మేస్తున్నారని తెలిపారు. తాజాగా 15 ఎకరాల స్థలాన్ని స్థానికంగా ఉన్న వ్యక్తి కాజేయాలని ప్రయత్నిస్తున్నారని ముఖేష్ కుమార్ అనే వ్యక్తి హైడ్రా దృష్టికి తీసుకొచ్చారు.
- ఇరిగేషన్ నాలాకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని 60 గజాల ప్లాట్లు చేసి అమ్మేస్తున్నారని, వరద నీరు వచ్చి చేరే లోతట్టు ప్రాంతంలో పేదవారు ఇల్లు కొనుక్కొని మోసపోతున్నారని, వెంటనే ఆపాలని ఉప్పల్ నియోజకవర్గం చిలకానగర్ కార్పొరేటర్ భర్త ప్రవీణ్ ముదిరాజ్ హైడ్రా కమిషనర్‌కు దృష్టికి తీసుకొచ్చారు.
- మియాపూర్ పరిసర ప్రాంతాల్లోని బక్షికుంట, రేగుల కుంటలను సుందరీకరిస్తే ఆయా చెరువుల్లోకి మురుగు నీటిని వదిలేస్తున్నారని చందానగర్‌కు చెందిన ప్రజా సంఘాల నాయకులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడ ఉన్న గేటెడ్ కమ్యూనిటీకి చెందిన వారు ఎస్‌టిపి ద్వారా మురుగును శుభ్రం చేయకుండానేరుగా చెరువులోకి వదిలేయడంతో రూ. కోట్లు ఖర్చు చేసి కాపాడిన చెరువు మళ్లీ దుర్గంధంగా మారుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- వరద కాలువలు కూడా కబ్జా అవుతున్నాయని చందానగర్ వాసులు ఫిర్యాదు చేశారు.

**ప్రజావాణి ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలి**
**నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి**

ప్రజావాణిలో వచ్చిన వినతులకు ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పరిష్కారించాలని గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా నగర నలుమూలల నుండి వివిధ సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేశారు. వారినుంచి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఆయా విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంపై అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు శివ కుమార్ నాయుడు, యాదగిరి రావు, వేణుగోపాల్ రెడ్డి, అదనపు చీఫ్ సిటీప్లానర్ గంగాధర్, యుబిడి డైరెక్టర్ శ్రీనివాస్ రావు, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ రాములు నాయక్, ఎస్‌ఎన్‌డిపి డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.




## అక్రమ భూ కబ్జాలు బయటపెడతాం : ఎమ్మెల్యే




**ప్రజాపక్షం/అల్వాల్ :** ప్రజా సమస్యలు ప్రణాళికా బద్ధంగా సకాలంలో పరిష్కరించుకునేందుకు వికాస్ నీతి యాప్ పరిష్కరిస్తామని వికాస్ నీతి యాప్‌ను ఆవిష్కరించిన మల్కాజ్గిరి నియోజకవర్గ శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, మల్కాజ్గిరి నియోజకవర్గం సమస్యల వలయంగా ఉన్న సమయంలో తను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని ఒక్కొక్కరిగా ప్రతి సమస్యను ఉన్నతాధికారులు సంబంధిత మంత్రులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లానని శాసనసభలో సమస్యల మీద ప్రస్తావించగా కొన్ని సమస్యలు పరిష్కరించామని, అదేవిధంగా నార్త్ హైదరాబాద్ ప్రజలకు మెట్రో రైల్ ఆవశ్యకత ను ప్రస్తావిస్తే ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి డిపిఆర్ సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. పేద బ్రాహ్మణ విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్షిప్ పంపిణీలుపై అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే బ్రాహ్మణ పరిషత్ కు వైస్ చైర్మన్ శైలజ రామయ్యర్ నియమించారు. రేషన్ డీలర్ల సమస్యను పరిష్కరించాలని అసెంబ్లీ సాక్షిగా వినిపిస్తే సంబంధిత మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్య పరిష్కారం లభిస్తుందని వక్ఫ్ బోర్డ్ తీసుకున్న నిర్ణయంతో పేద ప్రజలు కష్టపడి కొన్ని ఆస్తులపై హక్కును కోల్పోతారని ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారం లభిస్తుందని వెల్లడించారు. ప్రధాన సమస్య అయిన ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం రైల్వే టోల్ గేట్ల వద్ద ఆర్‌యుబిలు నిర్మించాలని, దృఢ సంకల్పంతో ఏడాదికాలంగా పక్క ప్రణాళికతో అవసరమైన అన్ని అనుమతులు సంబంధిత శాఖల నుండి తీసుకురావడంతో విజయవంతం అయ్యామని, అదే విధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి ప్రభుత్వ భూముల కబ్జాల నుండి కాపాడేందుకు విశేషంగా కృషి చేస్తున్నామని, మల్కాజిగిరి నియోజకవర్గంలో ఫైర్ స్టేషన్ అల్వాల్ సబ్ రిజిస్టర్ కార్యాలయం త్వరలోనే ఏర్పాటు చేస్తున్నందుకు గర్వంగా ఉందని అన్నారు. 8 కోట్లతో విద్యుత్ సంబంధిత సమస్యలకు అదనపు సబ్ స్టేషన్లు కొత్తగా 100 విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు 22 కిలో మీటర్ల మేర త్రీఫేస్ వైరింగ్ మార్పిడి గౌతమ్ నగర్ మల్కాజిగిరి ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలో ని ప్రజల దాహార్తిని తీర్చేందుకు మహేంద్ర హిల్స్ లో భారీ 5 ఎంఎల్ రిజర్వాయర్ నిర్మాణాన్ని ఏర్పాటు చేసుకున్నాము. పేద ప్రజల కోసం మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని ఏడు కాలనీల సమస్యలపై పోరాటం చేస్తూ తుర్కపల్లి గ్రామాన్ని వరద ముప్పు నుండి కాపాడేందుకు ఆర్మీ జిహెచ్‌ఎంసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించామని, త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ గృహాలు రేషన్ కార్డుల పంపిణీ కూడా నిజమైన లబ్ధిదారులను గుర్తించి న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, సునీత రాము యాదవ్, బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, తదితరులు పాల్గొన్నా రు.




## అందరి మన్ననలు పొందుతున్న 'ప్రజాపక్షం'

**ప్రజాపక్షం/కాప్రా :** ప్రజా సమస్యలను వార్తా కథనాల రూపంలో ఎప్పటికప్పుడు ప్రభుత్వాల దృష్టికి తీసుకొని వస్తూ పరిష్కారానికి కృషిచేస్తున్న 'ప్రజాపక్షం' దినపత్రిక సామాన్య ప్రజలు, కార్మికులు, కర్షకుల హృదయాల్లో నిలిచిపోయిందని సిపిఐ మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. న్యూనాగోల్‌లో సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాపక్షం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.సైదారావు, అంజి, శరణరావు, శ్రీకాంత్ యాదవ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాకు గురవుతున్న స్థలాలను కాపాడాలి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మేడిపల్లి లేఅవుట్ సిపిఆర్‌ఐ పర్వతాపూర్ 60 అడుగుల అప్రోచ్ రోడ్డు పక్కన కబ్జాకు గురవుతున్న స్థలాలను కాపాడాలని, లేఅవుట్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని హెచ్‌ఎండిఏ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పల్లె పద్మారెడ్డి, ఈదునూరి హేమంత్‌కుమార్‌లు కోరారు. ఈ మేరకు వారు సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. దీనికి సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్ హెచ్‌ఎండిఏ అధికారులతో కల్సి సమన్వయంతో ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** అకస్మాత్తుగా మృతి చెంది న అంతాయిపల్లి బాలమ్మ కుటుంబానికి స్ఫూర్తి అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం శామీర్ పేట మండలం మజీద్‌పూర్ గ్రామంలో అంతాయిపల్లి బాలమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఈ సందర్భంగా స్ఫూర్తి అసోషియేషన్ అధ్యక్షుడు తుంకి వెంకటేష్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన స్ఫూర్తి అసోషియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. అందులో బాగంగా బాలమ్మ అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి తుంకి మల్లేష్(పోలీస్), జీడిమెట్ల రమేష్, నాగేష్, మహిపాల్, నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

## నిందితుడికి జైలు శిక్ష

**ప్రజాపక్షం / కొడంగల్ :** దొంగతనం కేసులో ఓ నిందితుడికి రెండు సంవత్సరాల జైలుశిక్ష పడినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతు 216వ సంవత్సరంలో మండల పరిధిలోని హుస్నాబాద్ గ్రామానికి చెందిన బోయిన మొగులప్ప వ్యక్తి ఇంట్లో మధ్యాహ్నం ఒకటి గంటల ప్రాంతంలో మూసి ఉన్న ఉంట్లోకి ఓ వ్యక్తి చోరబడి పెట్టేలో ఉన్న 30 తులాల వెండి కడియాలు అపహరించినట్లు గుర్తించారు. ఈ విషయమై పోలీసులకు పిర్యాదు చేయగా పోలీసులు చుట్టుపక్కల వారిని విచారించగా కుదురుమల్ల గ్రామానికి చెదిన పంతులు మల్లేష అనే వ్యక్తి మీ ఇంటి ముందు నుంచి పోయినాడని తెలిపడంతో అట్టి వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ దర్యాప్తు చేసి నేరాభియోగపత్రము దాఖలు చేయగా కొడంగల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శ్రీరామ్ సోమవారం ముద్దాయికి రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు 500 రూపాయల జరిమాన విధించినట్లు పేర్కొన్నారు. దొంగతనాలకు పాల్పడి తమ బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని పోలీసులు సూచించారు.

### ప్రభుత్వ ఆసుపత్రి తీరు....

## డాక్టర్ నిర్లక్ష్యంతో బాలుడు మృతి

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభు త్వ ఆసుపత్రి సిబ్బంది ఇలా వచ్చి ఆలా వెల్తారు. హైదరాబాద్ నుండి వికారాబాద్‌కు ట్రైన్‌లో ఉదయం 11గంటలకు ఇలా వచ్చి అలా వెళతారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కంటే ప్రైవేట్‌లోనే ఎక్కుగా ఉంటారు. వైద్యం కోసం వచ్చే రోగుల పట్ల దురుసుగ ప్రవర్తిస్తున్నారని రోగులు అరోపిస్తున్నారు. రాత్రి 10తర్వాత ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు ఉండరు నర్సులు మత్రమే ఉంటారు. అదివారం వస్తే, పండుగలు వస్తే డాక్టర్లు అనే మాటనే ఉండదు,ఏదైనా అత్యవసరమైతే హైదరాబాద్ పొండి అని చేతులు దులుపుకోవడం తప్ప పట్టించుకోరు అని ఆసుపత్రికి వచ్చిన రోగులు తెలిపారు. వికారాబాద్ ప్రభు త్వ ఆసుపత్రిలో పర్మటిస్టు ఎప్పుడు ఉండదు , ట్రైనింగ్ వారితో మందులుఇప్పిస్తారు. సోమవారం రాత్రి ఒంటిగం ట సమయంలో మూడురోజుల క్రింద పుట్టిన బాబుకు ఎక్కిళ్లు వచ్చాయని డాక్టర్‌ను ఎంత లేపినా రాకపోవడంతో బాబు మృతి చెందడానికి డాక్టర్ కరణం అని బాబు తల్లిదండ్రులు తెలిపారు. నావపేట్ మండల మాదిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన స్వప్న, బిక్షపతి బాబు తల్లిదండ్రులు తెలిపారు. డాక్టర్ త్వరగా స్పందించి ఉంటే బాబు బతుకుతుండేవాడు కాని డాక్టర్ కారణం అన్నారు. ఈ విషయంపై బాబు తల్లిదండ్రులు డాక్టర్ పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.

## ప్రభుత్వ భూములను కాపాడండి

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి డి. దామోదర్ రెడ్డి

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మేడిపల్లి మండ లం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం సిపిఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షతన కె.ప్రమీల జరగగా ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా సహా య కార్యదర్శిలు డి.దామోదర్ రెడ్డి, ఉమామహేష్ పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఇరువురు మాట్లాడుతూ, మేడిపల్లి మండలంలో ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, ప్రభుత్వ భూములు భూకబ్జాదారులు చేపడుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే చర్యలు తీసుకోవాలని, భూకబ్జాదారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాల ని వాళ్ళు కోరడం జరిగినది. రాష్ట్ర ప్రభుత్వం సర్వే నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం చాలామంది ప్రజాపాలనలో అప్లై చేసుకున్న కొంతమందిని గుర్తించడం వలన పేదలకు అన్యాయం జరుగుతుందని, మరల ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిని మరల పరిశీలించి లబ్ధిదారులను కంప్యూటర్ ఫీడ్ చేయాలని కోరారు. జంట కార్పొరేషన్ లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న కార్పొరేషన్ కమిషనర్లు చూసిచూరి నట్టు వదిలేయడంతో కార్పొరేషన్ కి భారీ ఆదాయం గండి పడుతుందని, వెంటనే ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని తెలియజేయడం జరిగినది.

చర్యలు తీసుకొని ఎడల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేయడం జరుగుతుందని హెచ్చరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి జె.లక్ష్మి, మేడిపల్లి మండల కౌన్సిల్ సభ్యులు వి.బి.బాలరాజ్, బాపరాజు, సిహెచ్.మాధవి, కె.మహాలక్ష్మి, దండు రమేష్, ఇస్తారు, సోమరాజు, బొంద య్య, దండు మదర్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల నియామకానికి 12న వ్రాత పరీక్ష

### సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

**ప్రజాపక్షం / కొడంగల్ :** చౌకధర దుకాణ డీలర్ల నియమాకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 12వ తేదిన వ్రాత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొడంగల్, దౌల్తాబాద్, దుద్యాల్, బోంరాస్‌పేట మండల కేంద్రాలలో రేషన్ డీలర్ల నియమాకానికి ప్రకటన జారీ చేయడం జరిగిందన్నారు.

కులం, వర్గం, అంగవైకలర్యం, లింగం, స్థానికత, వయస్సు ఆధారంగా అమోదించిన అభ్యర్థులకు తాండూర్ పట్టణంలోని సాయిపూర్ జిల్లా పరిషత్ నెంబర్ 1 పాఠశాలలో ఉదయం 11 గంటలకు నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థులు ఈ నెల 10వ తేది లోపు హాల్ టికెట్లు సంబందిత తహశీల్దార్ కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు

### పేట్ బషీరాబాద్ ఏసిపి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రోడ్డు ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపడుతామని పేట్‌బషీరాబాద్ ఏసిపి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం తూంకుంట మున్సిపల్ నుంచి కొంపల్లి వెళ్లే రోడ్డు మార్గాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంపల్లి రహదారి నుంచి గీతాశ్రమం, దేవరయాంజాల్, పోతాయిపల్లి, తూంకుంటలోని ప్రధాన చౌరస్తాలను పరిశీలించారు. ఆయనతో పాటు ఆర్‌అండ్‌బి డిఈ శంకర్ మాట్లాడుతూ ప్రధాన కూడళ్లు, మూల మలుపుల వద్ద వీధీ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూంకుంట కమిషనర్ వెంకటగోపాల్, ఆర్‌అండ్‌బి ఎఈ ధరణిధర్ రెడ్డి, అల్వాల్ ట్రాఫిక్ సిఐ నాగరాజు, మున్సిపల్ డిఇ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడ

# ఆ టోర్నీ తర్వాత గంభీర్‌పై వేటు?



### గంభీర్ మాటలల్లో..

టీమిండియా సీనియర్ క్రికెటర్ల రిటైర్మెంట్ గురించి ప్రశ్నించగా.. వారి భవితవ్యం గురించి మాట్లాడేందుకు గంభీర్ నిరాకరించిన విషయం తెలిసిందే. ఐదు నెలల తర్వాత టీమిండియాకు టెస్ట్ సిరీస్ ఉందని, అప్పటి వరకు ఎవరు ఎక్కడ ఉంటారో తెలియదని, జట్టు ట్రాన్సిషన్ గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటు అవుతుందని చెప్పాడు.

టీమిండియా వరుస పరాజయాల నేపథ్యంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై వేటు పడనుందా? అతని పనితీరుపై ఆగ్రహంగా ఉన్న భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) డెడ్‌లైన్ విధించిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. అప్‌కమింగ్ ఐసీసీ టోర్నీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025పైనే హెడ్‌కోచ్‌గా గౌతమ్ గంభీర్ భవితవ్యం ఆధారపడి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ టోర్నీలో టీమిండియా మెరుగైన ప్రదర్శన చేస్తేనే గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా కొనసాగనున్నాడు. ఆసీస్ పర్యటన తరహాలో విఫలమైతే మాత్రం గంభీర్‌పై బీసీసీఐ వేటు వేయనుందని సమాచారం. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ పరాజయం అనంతరం గంభీర్ చేసిన వ్యాఖ్యలే ఈ వార్తలకు బలం చేకూర్చుతున్నాయి.

### గంభీర్ రాకతో గతి తప్పిన టీమిండియా..

టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం రాహుల్ ద్రవిడ్ వారసుడిగా హెడ్ కోచ్ బాధ్యతలు చేపట్టిన గంభీర్.. తొలి పర్యటనలోనే మిశ్రమ ఫలితాలను ఎదుర్కొన్నాడు. శ్రీలంక పర్యటనలో టీ20 సిరీస్ విజయాన్నందుకున్న గంభీర్.. వన్డే సిరీస్‌లో మాత్రం ఘోర పరాజయాన్ని ఎదుర్కొన్నాడు. స్పిన్ వికెట్లపై భారత బ్యాటర్లు దారుణంగా విఫమవ్వడంతో మూడు వన్డేల సిరీస్‌ను శ్రీలంక 20తో కైవసం చేసుకుంది. సుదీర్ఘ కాలం తర్వాత శ్రీలంక చేతిలో భారత్ వన్డే సిరీస్ కోల్పోయింది. ఆ తర్వాత బంగ్లాదేశ్‌తో టీ20, టెస్ట్ సిరీస్ గెలిచిన భారత్.. న్యూజిలాండ్‌తో సొంతగడ్డపై జరిగిన మూడు టెస్ట్‌ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయ్యింది. 147 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే సొంతగడ్డపై టీమిండియా క్లీన్ స్వీప్ కావడం తొలిసారి. ఈ ఘోర పరాజయంతో హెడ్ కోచ్ గంభీర్‌పై విమర్శలు మొదలయ్యాయి.

### ఆసీస్ గడ్డపై ఘోర పరాభవం!

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని విజయంతో ప్రారంభించిన భారత్.. ఆ తర్వాత నాలుగు మ్యాచ్‌ల్లో దారుణంగా విఫలమైంది. మూడో టెస్ట్‌ను వర్షం సాయంతో గట్టెక్కినా చివరి రెండు టెస్ట్‌ల్లో గెలిచే అవకాశాలు దక్కినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఈ క్రమంలోనే గంభీర్ కోచింగ్‌పై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఆశించిన ఫలితాన్ని సాధించకుంటే మాత్రం గంభీర్‌తో పాటు పలువురు సీనియర్ ఆటగాళ్లపై కూడా వేటు పడనుంది. గతంలో బెంచ్ ఆటగాళ్ల సాయంతో టెస్ట్ సిరీస్ గెలిచిన భారత్.. ఈ సారి కనీస పోటీ ఇవ్వలేకపోవడం గంభీర్ వైఫల్యాన్ని బయటపెడుతోంది.

### వెన్ను గాయంతో బుమ్రా..

ఆస్ట్రేలియా పర్యటనలో ఎదురైన ఘోర పరాజయంతో తీవ్ర నిరాశలో ఉన్న టీమిండియా అభిమానులను మరో విషయం కలవరపెడుతోంది. ఆసీస్ పర్యటనలో వెన్ను గాయానికి గురైన టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా.. అప్‌కమింగ్ ఐసీసీ టోర్నీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఆడుతాడా? లేదా? అనే విషయం ఆందోళనకు గురి చేస్తోంది. ఆఖరి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లోనే అసౌకర్యానికి గురైన బుమ్రా.. వెంటనే ఫిజియోలకు సమాచారమిచ్చాడు. దాంతో అప్రమత్తమైన బీసీసీఐ మెడికల్ టీమ్ అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లి స్కానింగ్ తీయించారు. బుమ్రా తిరిగి వచ్చి బ్యాటింగ్ చేసినా.. రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయలేదు.

# ద్రవిడ్ ఉన్నప్పుడే టీమిండియా బాగా ఆడింది : హర్భజన్ సింగ్



రాహుల్ ద్రవిడ్ కోచ్ ఉన్నప్పుడే టీమిండియా మెరుగైన ప్రదర్శన చేసిందని మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అన్నాడు. గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత టీమిండియా ప్రదర్శన ఆందోళనకరంగా మారిందని అభిప్రాయపడ్డాడు. టీమిండియా ప్రదర్శనపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన హర్భజన్ సింగ్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. టీమిండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ పేరు ప్రస్తావించకుండా విమర్శలు గుప్పించిన హర్భజన్ సింగ్.. సీనియర్ బ్యాటర్లు అయిన రోహిత్ శర్మ, కోహ్లీలకు కూడా చురకలంటించాడు. రాహుల్ ద్రవిడ్ హెడ్ కోచ్‌గా ఉన్నప్పుడే టీమిండియా మెరుగ్గా ఆడింది. సొంత గడ్డపై ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్ గెలిచాం. ఆ తర్వాత టీ20 ప్రపంచకప్ 2024 సాధించాం. కానీ ఆ తర్వాత ఆకస్మాత్తుగా భారత జట్టుకు ఏమైందో నాకు అర్థం కావడం లేదు. గత ఆరు నెలల్లో శ్రీలంక చేతిలో వన్డే సిరీస్ కోల్పోయాం. న్యూజిలాండ్‌తో సొంతగడ్డపై వైట్‌వాష్‌కు గురయ్యాం. తాజాగా ఆస్ట్రేలియా చేతిలో 31తో సిరీస్ కోల్పోయాం. ఒక్కసారిగా పతనమైనట్లు అనిపిస్తోంది. కోహ్లీ, రోహిత్ ఎవరైనా ఆట కంటే ఎవరూ ముఖ్యం కాదు. కపిల్ దేవ్, అనిల్ కుంబ్లే వంటి మ్యాచ్ విన్నర్లు సైతం జట్టులో చోటు కోల్పోయారు. టీమిండియా సూపర్ స్టార్ సంస్కృతిని వదిలి పెట్టాలి. అభిమన్యు ఈశ్వరన్, సర్ఫరాజ్ ఖాన్‌లకు ఒక్క అవకాశం ఇవ్వలేదు. పేరున్న ఆటగాళ్లను కాకుండా బాగా ఆడే ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలి. జస్‌ప్రీత్ బుమ్రా లేకుంటే ఈ సిరీస్‌లో టీమిండియా 0–5తో క్లీన్ స్వీప్ అయ్యేది. అతను అసాధారణ బౌ లింగ్‌తో తొలి టెస్ట్‌లో విజయాన్నందించాడు. మిగతా మ్యాచ్‌ల్లో అద్భుత బౌలింగ్‌తో జట్టుకు విజయవకాశాలను అందించాడు.'అని హర్భజన్ సింగ్ చెప్పుకొచ్చాడు.

# పార్వతీదేవిగా కాజల్ !



మంచు విష్ణు హీరోగా నటిస్తున్న లేటెస్ట్ భారీ పాన్ ఇండియా చిత్రం కన్నప్ప. ఈ చిత్రం కోసం విష్ణు కఠినంగా కష్టపడుతున్నాడు. పైగా ఈ సినిమాలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్ లాంటి ఎంతోమంది అగ్ర నటీనటులు కనిపించనున్న విషయం తెలిసిందే. తాజాగా ఇందులో కాజల్ పాత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. కాజల్ పార్వతీదేవిగా కనిపించనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో శివుడిగా బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్‌కుమార్ నటిస్తున్నారు. కాగా ఏప్రిల్ 25, 2025న ఈ సినిమా రిలీజ్ కానుంది. ప్రీతి ముకుందన్ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తోంది. ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామాకి మహా భారత్ సీరియల్‌ని డైరెక్ట్ చేసిన ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై మోహన్ బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



# రెండో సంక్రాంతికీ.. బాలయ్య, వెంకీ, చరణ్ మూవీస్!

ఈ సంక్రాంతికి 'గేమ్ చేంజర్' మూవీతో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, 'డాకు మహారాజ్' చిత్రంతో నందమూరి బాలకృష్ణ, 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీతో విక్టరీ వెంకటేష్ ప్రేక్షకుల ముందుకొచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ మూడు సినిమాలపైన అంచనాలు భారీగానే ఉన్నాయి. 'గేమ్ చేంజర్' ట్రైలర్ రిలీజ్ తర్వాత హైప్ పెరిగింది. 'డాకు మహారాజ్' వైబ్ కూడా పాజిటివ్ గానే నడుస్తోంది. ఇక 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ఫెస్టివల్ మూడ్‌ని ఇప్పటికే తీసుకొచ్చేసింది. వీటిలో ఏ సినిమా ప్రేక్షకులని ఎక్కువగా ఎట్రాక్ట్ చేస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉంటే 2019లో కూడా ఇదే హీరోలు బాక్సాఫీస్ దగ్గర పోటీ పడ్డారు. ఈ ఏడాది ఈ ముగ్గురు హీరోలు మరోసారి బాక్సాఫీస్ దగ్గర పోటీ పడుతున్నారు. రామ్ చరణ్ 'గేమ్ చేంజర్' మూవీ జనవరి 10న థియేటర్స్‌లోకి వస్తోంది. బాలకృష్ణ జనవరి 12న 'డాకు మహారాజ్'తో రాబోతున్నారు. జనవరి 14న 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో విక్టరీ వెంకటేష్ థియేటర్స్ లోకి వస్తున్నారు. ఈ మూడు సినిమాలలో రెండింటిని దిల్ రాజు నిర్మించారు. ఇక 'డాకు మహారాజ్' సినిమా నైజాం రైట్స్‌ని దిల్ రాజు దక్కించుకున్నారు.

## రీల్

# వాళ్ళు నా అచీవ్‌మెంట్

– చిరంజీవి



మెగాస్టార్ చిరంజీవి చేసిన కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, రామ్ చరణ్ సహా తన ఫ్యామిలీలో ఉన్న బిడ్డలంతా తాను సాధించిన అచీవ్‌మెంట్స్ అని చిరంజీవి చెప్పుకొచ్చారు. ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'మొన్న పవన్ కళ్యాణ్ ఇంటికి వచ్చినపుడు నాతో ఒక మాట అన్నాడు. అన్నయ్య నువ్వు ఒక మాట అనేవాడివి గుర్తుందా ?, మనది మరొక రాజ్ కపూర్ ఫ్యామిలీ అవ్వాలనేవాడివి. నీ మాట మంత్రంలా పనిచేసి ఇప్పుడు 9, 10 మంది ఉన్నాం. నీ మాటకు బలం ఎక్కువ అని చెప్పాడు అని పవన్ నాతో అన్నాడు. ఆ మాట విన్నపుడు నాకు చాలా సంతోషం కలిగింది' అని మెగాస్టార్ తెలిపారు. మెగాస్టార్ ఇంకా మాట్లాడుతూ.. 'నాకు స్కూల్‌లో ఉన్నప్పటి నుంచే ఏదో ఒకటి సాధించాలని ఉండేది. ఐతే, కాలేజీలో అనుకోకుండా ఓ నాటకం వేశాక అందరూ నన్ను హీరోలా చూశారు, అప్పుడే నాకు నటనపై ఆసక్తి పెరిగింది. ఎదగాలంటే నెగటివిటీకి, వ్యసనాలకు దూరంగా ఉండాలని మెగాస్టార్ యువతకు సూచించారు. పరిస్థితులను అనుకూలంగా మల్చుకుని నేను ఎదుగుతూ వచ్చాను అంటూ 'ఈగల్ ఫిలాసఫీ'ని చిరు వివరించారు. మొత్తానికి చిరంజీవి చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

# పక్కా ప్లానింగ్‌తో బుట్టబొమ్మ రెడీ



బుట్ట బొమ్మ పూజా హెగ్డేని టాలీవుడ్ దూరం పెట్టినా కూడా మొన్నటి దాకా ఒకటి రెండు అవకాశాలతో సరిపెట్టుకున్న అమ్మడు ఇప్పుడు ఏకంగా ఐదారు సినిమాలతో బిజీ బిజీగా మారింది. బాలీవుడ్‌లో షాహిద్ కపూర్ తో దేవా సినిమా చేస్తున్న అమ్మడు ఆ సినిమా తర్వాత రెండు ఆఫర్లను పట్టేసింది. ఇక కోలీవుడ్‌లో దళపతి విజయ్ సినిమాతో పాటుగా సూర్య రెట్రోలో కూడా నటిస్తుంది. ఈ సినిమాలతో అక్కడ కూడా మళ్లీ తిరిగి ఫాంలోకి రావాలని చూస్తుంది అమ్మడు. పూజా హెగ్డే ఈసారి పక్కా ప్లానింగ్‌తో సినిమాలు చేస్తుందని అనిపిస్తుంది. ఒకప్పుడు గ్లామర్‌కే ప్రాధాన్యత ఇస్తూ సినిమాలు చేసిన అమ్మడు ఇప్పుడు నటనా ప్రాధాన్యత ఉన్న పాత్రలను కూడా చేయాలని భావిస్తుంది. ఈ క్రమంలో బుట్ట బొమ్మ పూజా హెగ్డే తన సినిమాల అవకాశాల గురించి రీసెంట్‌గా మాట్లాడింది. తన కెరీర్ సంతృప్తికరంగా ఉందని అంటున్న అమ్మడు. పాత్రల ఎంపిక కాదు అందులో జీవించడం ముఖ్యమని అంటుంది. అంతేకాదు ప్రొఫెషనల్‌గా ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటూ ఉన్నా అంటుంది పూజా.

# 9న న్యూ ఎనర్జీ పాలసీ ప్రకటన

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి




ప్రజాపక్షం / హైదరాబాద్: దేశ, విదేశీ పెట్టుబడులు ఆకర్షించే విధంగా ప్రజా ప్రభుత్వం ఈ నెల 9న న్యూ ఎనర్జీ పాలసీని ప్రకటిస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన, ఆర్థిక, ప్లానింగ్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్ రాష్ట్ర సచివాలయం ఎదురుగా ఉన్న దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద సోమవారం జెన్‌కోలో ఉద్యోగం పొందిన 315 మంది ఎఇలకు ఉద్యోగ నియామక పత్రాలను డిప్యూటీ సిఎం అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. గత పది సంవత్సరాల పాలన చేసిన గత ప్రభుత్వం రాష్ట్రంలో న్యూ ఎనర్జీ పాలసీని తీసుకురాలేదని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణను మిగులు విద్యుత్తు ఉత్పత్తి రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు తయారు చేశామన్నారు. అందులో భాగంగానే నూతన ఎనర్జీ పాలసీని తీసుకురావడం వల్ల దేశ, విదేశాల నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడానికి అవకాశం ఉండటంతో ఈ నెల నాలుగున జరిగిన క్యాబినెట్ సమావేశంలో న్యూ ఎనర్జీ పాలసీని ఆమోదించామని వివరించారు. దేశంలో ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న ఎనర్జీ పాలసీతో పాటు మన రాష్ట్రంలో అందుబాటులో రెనేవబుల్ ఎనర్జీ ఉత్పత్తికి కావలసిన అన్ని అంశాలను అధ్యయనం చేసి న్యూ ఎనర్జీ పాలసీని తయారు చేసినట్లు చెప్పారు. 2030 సంవత్సరం నాటికి తెలంగాణ రాష్ట్రానికి కావలసిన గరిష్ట విద్యుత్ డిమాండ్ 22,448 మెగావాట్ల విద్యుత్ ఉ త్పత్తికి ప్రజా ప్రభు త్వం ప్రణాళికలతో సన్నద్ధమౌతుందన్నారు. ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను కూడా అందుకు తగ్గట్టుగా విస్తరిస్తున్నట్లు చెప్పారు. మిగులు విద్యుత్తు రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడంలో భాగంగా రాష్ట్రంలో 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడానికి కావలసిన ప్రణాళికను రూపొందించినట్లు చెప్పారు. రామగుండంలో జెన్ కో సింగరేణి సంస్థ కాలరీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

### 'చెమట చుక్కలకు తర్ఫీదు' లోగో ఆవిష్కరణ

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూపొందించిన ''చెమట చుక్కలకు తర్ఫీదు''లో గోను డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. దేశ విదేశాల్లో ఉన్నత విద్య ఉపాధి అవకాశాలపై అవగాహన జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కోల్‌బెల్ట్ యువతను నిలిపే ప్రయత్నం చేస్తున్న సింగరేణి సంస్థ యజమాన్యాన్ని ఈ సందర్భంగా అభినందించారు. సింగరేణి సిఎండి ఎన్.బలరామ్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా జాతీయంగా, అంతర్జాతీయంగా ఉన్న అవకాశాలను వారు అం దిపుచ్చుకొని వివిధ రంగాల్లో ఉజ్వల కెరీర్లను మలచుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కె.కేశవరావు, మహ్మద్ అలీ షబ్బీర్, ఇంధన శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణభాస్కర్, జెన్‌కో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





# సిఎంకు సిపిఐ ధన్యవాదాలు

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీరారెడ్డి, దేవరకొండ ఎంఎల్ఎ బాలునాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కరువు ఫ్లోరైడ్‌తో సతమతమవుతున్న దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందించే డిండి ఎత్తిపోతల పథకం కోసం దశాబ్దాలుగా సిపిఐ అనేక ప్రజా ఉద్యమాలు, పోరాటాలు, పాదయాత్రలు నిర్వహించిందని పల్లా వెంకటరెడ్డి గుర్తు చేశారు. ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారానికి సాగునీరు ఏకైక మార్గమని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ 10 ఏళ్ల కాలంలో డిండి ఎత్తిపోతల పథకానికి ఎక్కడి నుండి నీరు తీసుకోవాలనే విషయంపై స్పష్టత లేకపోవడంతో ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా మారిందని పల్లా వెంకట రెడ్డి తెలిపారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు ఎస్‌ఎల్‌బిసి, డిండి ఎత్తిపోతల పథకంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం పట్ల సిపిఐ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తోందని పల్లా వెంకటరెడ్డి అన్నారు.



# ఇస్రో 'స్పేడెక్స్' 9కి వాయిదా

బెంగళూరు: అంతరిక్షంలో స్పేస్ డాకింగ్ ప్రయోగం (స్పేడెక్స్) పేరిట జంట ఉపగ్రహాలను భూకక్ష్యలో అనుసంధానం చేసే ప్రయోగాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే పీఎస్ఎల్వీసీ60 ద్వారా 440 కిలోల బరువున్న రెండు ఉపగ్రహాలను విజయవంతంగా నింగిలోకి పంపింది. తాజాగా, ఈ పరీక్షకు సంబంధించి ఇస్రో కీలక ప్రకటన చేసింది. స్పాడెక్స్ డాకింగ్ ఆపరేషన్‌ను 2025, జనవరి 9కి వాయిదా వేస్తున్నట్లు ఇస్రో ప్రకటించింది. సోమవారం గుర్తించిన అబార్ట్ దష్టాంతం ఆధారంగా గ్రౌండ్ సిమ్యులేషన్స్ ద్వారా డాకింగ్ ప్రక్రియకు మరింత ధ్రువీకరణ అవసరమని ఇస్రో పేర్కొంది. అంతకుముందు ఈ డాకింగ్ ఆపరేషన్‌ను జనవరి 7న ప్లాన్ చేసినట్లు ఇస్రో తెలిపింది. తాజాగా ఆ గడువును రెండు రోజులు పొడిగించింది. స్పాడెక్స్ ఆన్‌బోర్డ్ వీడియోను ఇస్రో ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది.

# కెటిఆర్ మెలిక

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం 10 గంటలకు తన లీగల్ టీంతో బంజారాహిల్స్‌లోని ఎసిబి ప్రధాన కార్యాలయానికి వచ్చారు. గేటు వద్దనే తన కారును ఆపిన కెటిఆర్.. ఎసిబి విచారణకు హాజరు అయ్యేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అయితే తన లీగల్ టీంను కూడా విచారణలో పాల్గొనేందుకు అవకాశం ఇవ్వాలని ఎసిబి అధికారులకు షరతు విధించారు. అందుకు ఎసిబి అధికారులు ససేమిరా అన్నారు. లీగల్ టీంతో కలిసి విచారణకు హాజరవుతానని కెటిఆర్ చెప్పడంతో అందుకు ఎసిబి అధికారులు అనుమతి నిరాకరించారు. తామిచ్చిన నోటీసులో కేవలం కెటిఆర్‌ను మాత్రమే విచారణకు హాజరు కా వాలని ఉందని, న్యాయవాదితో పాటు హాజరుకావాలని నోటీసులో తాము పేర్కొనలేదని ఎసిబి అధికారులు కెటిఆర్‌కు తేల్చిచెప్పారు. ఎసిబి కార్యాలయం వద్ద కెటిఆర్‌కు ఎసిబి అధికారులకు సు మారు 40 నిమిషాల పాటు వాగ్వివాదం చోటుచేసుకుంది. చివరకు కెటిఆర్ విచారణకు హాజరుకాకుండానే అక్కడి నుంచి తన లీగల్ టీంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఎసిబి కార్యాలయం బయట మీడియాతో కెటిఆర్ మాట్లాడు తూ.. పోలీసులపై తనకు నమ్మకం లేదని... అందుకే లాయర్లను తనతో పాటు తీసుకెళ్తానని కెటిఆర్ చెప్పారు. గేటు బయటే ఎసిబి అధికారికి కెటిఆర్ తన స్టేటమెంట్‌ను రాతపూర్వకంగా ఇచ్చానని కెటిఆర్ తెలిపారు. ఎసిబి ఆఫీసులో ఇవ్వాల్సిన స్టేట్‌మెంట్‌ను రోడ్డుపై ఇచ్చానని చెప్పారు. అక్కడి నుంచి బయల్దేరిన కెటిఆర్ నేరుగా పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అయితే విచారణకు కెటిఆర్ గైర్హాజరు అయినట్టుగా పోలీసులు పరిగణించారు.

### కెటిఆర్‌కు మరో నోటీసు జారీ...

ఈ నెల 6వ తేదీన ఫార్ములా ఈ–కార్ రేస్ కేసులో విచారణకు రావాలంటూ ఎసిబి అధికారులు ఈ నెల 3న నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నోటీసు మేరకు కెటిఆర్ విచారణకు హాజరుకాలేదని పరిగణించిన ఎసిబి అధికారులు సోమవారం మరోసారి నోటీసును జారీ చేశారు. ఈ నెల 9న ఎసిబి అధికారుల ముందు విచారణకు హాజరుకావాలంటూ నోటీసులో పేర్కొన్నారు.

### నేడు ఇడి విచారణకు కెటిఆర్ హాజరుపై ఉత్కంఠ..

ఫార్ములా ఈ–కార్ రేస్ కేసులో నిందితులు ఒక పథకం ప్రకారం విచారణకు హాజరుకావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేసును కెటిఆర్ డైరెక్షన్‌లోనే మిగతా నిందితులు కూడా విచారణకు హాజరుకాకపోవడంపై సర్వత్ర చర్చానీయాంశంగా మారింది. ఈ నెల 7న విచారణకు హాజరుకావాలంటూ డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి ) అధికారులు గత నెలలోనే కెటిఆర్‌కు నోటీసులు జారీ చేశారు. ఎసిబి విచారణను హాజరుకాకుండా కుంటిసాకులు చెప్పి తప్పించుకున్న కెటిఆర్ మం గళవారం ఇడి అధికారుల ముందు విచారణకు హాజరవుతారా లేదా అనే విషయంపై ఉత్కంఠ నెలకొంది. విచారణకు తన లీగల్ టీంతో వస్తానని ఎసిబి అధికారులకు పెట్టిన షరతునే ఇడి అధికారులకు కూడా కెటిఆర్ పెడుతారా అనే సందేహాలు కలుగుతున్నాయి. ఇప్పటికే ఇడి విచారణకు ఈ నెల 2,3 తేదీలలో హాజరుకావాల్సిన ఈ కేసులోని ఎ2,ఎ3 నిందితులు ఐఎఎస్ అధికారి అరవింద్‌కుమార్, హెచ్ఎండిఎ మాజీ చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్ రెడ్డిలు డుమ్మా కొట్టారు. ఎసిబి విచారణకు ఎ1 నిందితుడు కెటిఆర్ డుమ్మా కొట్టారు. నిందితులు విచారణకు హాజరుకాకపోవడంపై అధికారులు న్యాయనిపుణులతో చర్చిస్తున్నారు. కాగా ఈ కేసును క్వాష్ చేయాలని కెటిఆర్ వేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. ఈ తీర్పుపై అందరిచూపు నెలకొని ఉంది.

### విచారణకు మరో సమయం ఇవ్వాలని ఇడిని కోరిన కెటిఆర్

ఫార్ములా ఇకార్ రేస్ కేసులో మంగళవారం విచారణకి హాజరుకావాలని ఇడి ఇచ్చిన నోటీసులకి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందించారు. ఎసిబి తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని ఇప్పటికే హైకోర్టులో వేసిన కేసులో తీర్పు రిజర్వులో ఉందని, హైకోర్టు పైన ఉన్న గౌరవంతో.. హైకోర్టు తీర్పును వెలువరించేంతవరకు ఈ అంశంలో తనకు సమయం ఇవ్వాలని కెటిఆర్ ఇడి అధికారులను కోరారు. ఈ మేరకు ఇడి అధికారులకు సమాచారం చేరవేశారు.

# 'సుప్రీం' కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

నవాబ్‌సింగ్‌ను కలవడానికి నిరసన రైతులను ఒ ప్పించడం జరిగిందని తెలిపారు.'మాలో కొందరు సోమవారం మధ్యాహ్నం 3గంటలకు విశ్రాంత జస్టిస్ నవాబ్‌సింగ్ నేతృత్వంలోని కమిటీని కలవడానికి నిరసనలో ఉన్న రైతులను ఒప్పించగలిగారు. పురోగతి ఉంటుందని ఆశిస్తున్నాం. దయచేసి రెండు రోజుల అనంతరం దానిని తీసుకోండి' అని సిబల్ చెప్పారు. దీనిని విన్న ధర్మాసనం స్పందిస్తూ అందరిలో మంచి స్పృహ వెల్లివిరియాలని ఆశిద్దాం, ప్రార్థిద్దాం అని వ్యాఖ్యానించింది. చర్చల సంక్షిప్త నోట్‌ను సిద్ధం చేయాలని సర్వోన్నత న్యాయస్థానం కపిల్ సిబల్‌ను కోరింది. విచారణను జనవరి 10కి వాయిదా వేసింది. కేంద్రం తరపున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తా కమిటీ సమావేశ ఫలితాలపై సంక్షిప్త నోట్‌ను దాఖలు చేస్తుందని ధర్మాసనానికి చెప్పారు. తన సమావేశంలో అనారోగ్యంతో ఉన్న రైతునాయకుడు డల్లేవాల్‌ను కలిసిన సుప్రీంకోర్టు నియమించిన కమిటీ వైద్యసహాయం పొందాలని అభ్యర్థించింది. సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్) కన్వీనర్ అయిన డల్లేవాల్ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) సహా వివిధ డిమాండ్లపై 2024 నవంబరు 26 నుండి ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్నారు. డల్లేవాల్ పంజాబ్ ప్రభుత్వం అందించిన వైద్య సహాయం ఆఫర్‌ను తిరస్కరించాడు. దీంతో ఆయనకు ఆరోగ్యపరంగా తీవ్ర సమస్యలు తలెత్తడంతో ఆయన ఆరోగ్యం బాగా క్షీణించింది. ఆయ న వైద్య సహాయం పొందేందుకు ఆసుపత్రిలో చేరడంపై నిర్ణయం తీసుకునే బాధ్యతను సుప్రీంకోర్టు డిసెంబరు 20న పంజాబ్ ప్రభుత్వ అధికారులు, డాక్టర్లపై ఉంచింది. శంభుఖనౌరీ సరిహద్దు పాయింట్‌కు 700మీటర్ల పరిధిలోపు ఉన్నటువంటి ఆసుపత్రికి డల్లేవాల్‌ను తరలించవచ్చని అత్యున్నత న్యాయస్థానం తెలియజేసింది. నిరసన తెలియజేస్తున్న రైతుల గ్రీవెన్సెస్‌ను వినేందుకు 2024, సెప్టెంబరులో సుప్రీంకోర్టు రిటైర్డ్ జస్టిస్ నవాబ్‌సింగ్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ తన ప్రాథమిక నివేదికలో పంట దిగుబడి, పెరిగిపోతున్న ఖర్చులు, రుణాలు, సరిపోని మా ర్కెటింగ్ వ్యవస్థతో సహా పలుజాబితా చేయబడిన కారణాలను ప్రస్తావించింది. సుప్రీంకోర్టు జస్టిస్ నవాబ్ సింగ్ నేతృత్వంలోని కమిటీలో రిటైర్డ్ ఐపిఎస్ అధికారి బిఎస్.నందు, వ్యవసాయ నిపుణుడు దేవిందర్ శర్మ, ప్రొఫెసర్ రంజిత్ సింగ్ ఘుమన్, డాక్టర్ సుఖ్‌పాల్‌సింగ్, పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి వ్యవసాయ ఆర్థికవేత్త డాక్టర్ సుఖ్‌పాల్ సింగ్‌ను సభ్యులుగా నియమించింది. ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న రైతునాయకుడు డల్లేవాల్‌ను కలిసిన అనంతరం రిటైర్డ్ జస్టిస్ నవాబ్‌సింగ్ మీడియాతో మాట్లాడుతూ 'మేం 'వాహెగురు' తప్పకుండా ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థిస్తున్నాం' అని ఆయన వ్యాఖ్యానించారు. డల్లేవాల్ వైద్య సహాయం పొందేందుకు అంగీకరించారా అని విలేకరులు ప్రశ్నించగా నవాబ్‌సింగ్ సమాధానమిస్తూ 'మేం అందరం అతనికి వైద్యం (సహాయం) కోసం పదేపదే ప్రార్థించాం. అతని ఆరోగ్యం బాగుండాలి' అని వెల్లడించారు. ఆందోళనలు ముగిసిపోవాలని చెప్పడానికి తాను ఇక్కడకు వచ్చానని, కానీ ఆయన ఆరోగ్యం బాగుండాలని చెప్పడానికి తాను ఇక్కడకు వచ్చానని, ఆయన చెప్పినపుడల్లా కమిటీ ఇక్కడకు వచ్చిందని, తాను కూడా డల్లేవాల్‌కు హాయ్ చెప్పానని విశ్రాంత జస్టిస్ నవాబ్ సింగ్ విలేకరులకు తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com